www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 27-10-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 191 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి పూర్తి, నక్షత్రం: మూల మ.1:27 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ.11:40-1:27, రా.11:58-1:43, దుర్ముహూర్తం: మ.12:21-1:07, మ.2:39-3:25, అమృతఘడియలు: ఉ.6:20-8:07, రాహుకాలం: ఉ.7:30-9:00, సూర్యోదయం: 6:15, సూర్యాస్తమయం: 5:42 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేతలకు కల్తీ మద్యం సొమ్ము!

అధికారులకూ లాభాల్లో వాటాలు.. తలా ఇంత పంపకం

ఆదివారాల్లో బార్లకు భారీగా సరుకు సరఫరా

సిట్ విచారణలో అద్దేపల్లి సోదరుల వెల్లడి!

సగానికి సగం లాభంతో లిక్కర్ విక్రయాలు

విజయవాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం తయారీ ద్వారా అద్దేపల్లి సోదరులు ఆర్జించిన డబ్బు ఏమైందన్న కోణంలో సిట్ అధికారులు విచారిస్తున్నారు. నకిలీ లిక్కర్ సూత్రధారి అద్దేపల్లి జనార్దన రావు, ఆయన సోదరుడు జగన్మోహనరావును సిట్ అధికారులు ఆదివారం విచారించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కల్తీ మద్యం తయారీ, విక్రయాల ద్వారా వచ్చిన సొమ్మును వాటాలు వేసుకుని

మిగతా 2వ పేజీలో...



తుఫాను ముప్పు

తీవ్ర తుఫానుగా మారనున్న మొంథా

గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు!

రేపు కాకినాడ-తుని మధ్య తీరం దాటే అవకాశం

కోస్తాపై ఎక్కువ ప్రభావం ఉంటుందని అంచనా

పలు జిల్లాల్లో అసాధారణ వర్షాలు?

సముద్రంలోకి వెళ్లొద్దని జాలర్లకు హెచ్చరిక

ఓడరేవుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక

నేడు, రేపు అతి భారీ వర్షాలు: విపత్తుల సంస్థ

సహాయ చర్యలకు 19 కోట్లు విడుదల

పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవులు

డిప్లొమా సప్లిమెంటరీ పరీక్షలు వాయిదా

తుఫాన్‌ను ఎదుర్కొందాం!

తీర ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి.. ఆస్తి, ప్రాణ నష్టం జరగొద్దు

ఎక్కడికక్కడ యంత్రాలు సిద్ధంగా ఉంచాలి

ప్రతి విభాగం సమన్వయం చేసుకోవాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం

అధికారులతో టెలీకాన్ఫరెన్స్

విశాఖపట్నం/అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో మొంథా తుఫాన్ అలజడి సృష్టిస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలోని వాయుగుండం పశ్చిమ వాయవ్యంగా పయనించే క్రమంలో మరింత బలపడి ఆదివారం ఉదయానికి తీవ్ర వాయుగుండంగా మారింది. అనంతరం ఆదివారం రాత్రికి ఇది తుఫానుగా మారినట్టు అమెరికాకు చెందిన వాతావరణ సంస్థ జేటీడబ్ల్యూసీ(జాయింట్ టైఫూన్ వార్నింగ్ సెంటర్) ప్రకటించింది. అయితే, భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ఆదివారం అర్ధరాత్రి వరకు ఈ విషయాన్ని నిర్ధారించలేదు. ఈ తుఫానుకు థాయ్‌లాండ్ దేశం సూచించిన 'మొంథా' అని పేరు పెట్టారు. ప్రస్తుతం ఇది చెన్నైకి 720 కి.మీ. తూర్పు ఆగ్నేయంగా, విశాఖపట్నానికి 790 కి.మీ. దక్షిణ

మిగతా 11వ పేజీలో...

'తుఫాన్' జిల్లాలకు ప్రత్యేక అధికారులు

సహాయ చర్యల పర్యవేక్షణకు 18 మంది ఐఏఎస్‌లు

అజయ్‌జైన్, సిసోడియాకు జోనల్ బాధ్యతలు

తీరంలో హై అలర్ట్

గోదావరిపై పంటు రాకపోకలు నిలిపివేత

బీచ్‌ల్లోకి నో ఎంట్రీ



నరసాపురం చేరుకున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

అప్రమత్తతతోనే ముప్పు తప్పేది!

ఈ జాగ్రత్తలు పాటించండి

'మొంథా' తీవ్రరూపం దాల్చనున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రభుత్వం చేసిన సూచనలివీ..

- అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటికి రావద్దు.
- అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి.
- శిథిలమైన నివాసాలను వీడి, సురక్షిత భవనాలకు చేరాలి.
- నదులు, కాలువలు, వాగులు దాటే ప్రయత్నం చేయొద్దు.
- చెరువులు, కోనేర్లు, కుంటల వద్దకు వెళ్లొద్దు.
- లోతట్టు ప్రాంతాలను వీడి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి.
- ఈదురుగాలులు వీచేటప్పుడు చెట్లు, విద్యుత్ స్తంభాల కింద నిలబడొద్దు.
- తెగిపడిన విద్యుత్ తీగలను తాకొద్దు.. లోతు తెలియకుండా నీటిలోకి దిగరాదు.
- నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచుకోవాలి.
- సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దు.

స్టేట్ ఎమర్జెన్సీ కాల్ సెంటర్ టోల్‌ఫ్రీ నంబర్లు
112, 1070, 18004250101

11



కర్నూలు బస్సు ప్రమాదంలో చనిపోయిన వారి డీఎన్ఏ రిపోర్టులు రావడంతో మృతదేహాలను ఆదివారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ క్రమంలో కర్నూలు జీజీహెచ్ మార్చురీ వద్ద తన తండ్రి మృతదేహాన్ని అంబులెన్సులోకి ఎక్కిస్తుండగా వెక్కివెక్కి ఏడుస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఆదిశేషగిరి రావు కుమార్తె, కుటుంబ సభ్యులు

ఏడ్చిఏడ్చి ఇంకిన కన్నీళ్లు!

మృతదేహాల కోసం 48 గంటలకు పైగా నిరీక్షణ

డీఎన్ఏ రిపోర్టులు రావడంతో మృతదేహాల అప్పగింత

ప్రత్యేక అంబులెన్సుల్లో స్వస్థలాలకు పంపిన ప్రభుత్వం

19వ మృతదేహం చిత్తూరు జిల్లా వాసిదిగా గుర్తింపు

2 ప్రమాదాలు.. 2 ఎఫ్ఐఆర్‌లు నమోదు

కర్నూలు/కర్నూలు హాస్పిటల్, కుప్పం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా బస్సు ప్రమాదంలో అగ్నికి ఆహుతైన వారి కుటుంబీకుల బాధ వర్ణనాతీతంగా ఉంది. ఏడ్చిఏడ్చి కన్నీళ్లు ఇంకిపోయే పరిస్థితి. 48 గంటలకుపైగా నిరీక్షణ అనంతరం అధికారులు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. సోమవారం అందుతాయనుకున్న డీఎన్ఏ ఫలితాలు.. ప్రభుత్వ ప్రత్యేక చొరవ మేరకు ఆదివారం ఉదయానికే రావడంతో.. వెంటనే రక్త సంబంధీకులకు సమాచారం ఇచ్చారు. డీఎన్ఏ సరిపోల్చిన అనంతరం ఆదివారం మధ్యాహ్నం నుంచి మృతదేహాల అప్పగింత ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా కర్నూలు

మిగతా 12వ పేజీలో...

ఆ బస్సులు ఎక్కాలంటే హడల్!

భయపెట్టిన మరో రెండు బస్సులు

ఓ బస్సులో షార్ట్ సర్క్యూట్‌తో పొగ

లగేజీతో సహా దిగి పరుగులు

మరో బస్సు పెట్టినా ఎక్కేందుకు నో

రోడ్డుపక్కకు దూసుకెళ్లిన మరొకటి



రష్యా అమ్ములపొదిలో అణు క్రూయిజ్ క్షిపణి

అణు శక్తితో అనంత దూరాలకు దూసుకెళ్లే బురే వెస్నిక్

పరీక్షలో 15 గంటలపాటు 14 వేల కిలోమీటర్లకుపైగా ప్రయాణం

ప్రపంచంలో మరే దేశం వద్దా ఇలాంటిది లేదన్న పుతిన్

మాస్కో, అక్టోబరు 26: ప్రపంచంలోనే తొలిసారిగా.. అణు శక్తితో దూసుకెళ్లే క్రూయిజ్ క్షిపణిని రష్యా పరీక్షించింది! ప్రపంచంలో ఏ మూలనున్న లక్ష్యాన్నైనా ఛేదించే (అన్‌లిమిటెడ్ రేంజ్) సత్తా ఉన్న ఆ క్షిపణి పేరు.. '9ఎం730 బురే వెస్నిక్'. ఈ క్షిపణిని లాంచ్ చేయడానికి సంప్రదాయ ఇంజిన్‌నే వాడతారు. అనంతరం అందులోని చిన్న అణు రియాక్టర్ ఉత్తేజితమై.. దానికి 'దాదాపు అనంత దూరం' ప్రయాణించే శక్తినిస్తుంది! దీని తుది పరీక్షను ఆదివారం విజయవంతంగా నిర్వహించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. "ప్రపంచంలో మరెవరి వద్దా లేని అద్భుతమైన సృష్టి ఇది" అని ఆయన సగర్వంగా పేర్కొన్నారు. ఈ క్షిపణిని రష్యా సాయుధ దళాల అమ్ములపొదిలో చేర్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని

మిగతా 2వ పేజీలో...

మయన్మార్ సైబర్ క్రైమ్ స్థావరం నుంచి 1000 మంది పరార్

వారిలో 399 మంది భారతీయులు

అంతర్జాతీయ ఒత్తిడితో సైబర్ అడ్డాలపై జుంటా సైన్యం దాడి

సరిహద్దు గుండా థాయ్‌లాండ్‌లోకి..

2

మత్తు వదిలింది

గంజాయిపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం

ఈగల్, పోలీసుల ప్రత్యేక చర్యలు

మన్యంలో గంజాయి తోటల ధ్వంసం

ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సాహం

రాష్ట్రంలో గంజాయి సాగు పూర్తిగా బంద్

పొరుగు రాష్ట్రం ఒడిశాలో పెరిగిన సాగు

అక్కడి నుంచి మన్యం మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు

అరకు ప్రాంతంలో స్వీటు, హార్డ్‌వేర్ వ్యాపారుల ముసుగులో రాజస్థాన్, తమిళనాడు స్మగ్లర్లు

అంతర్రాష్ట్ర స్మగ్లింగ్ గుట్టు కనుగొన్న ఈగల్



అల్లూరి జిల్లా పెదబయలు మండలం మారుమూల పల్లెల్లో గుర్తించిన గంజాయిని దహనం చేస్తున్న 'ఈగల్' ఐజీ ఆకే రవికృష్ణ (ఫైల్)

2022 నాటికి మన్యంలో సుమారు 10 వేల నుంచి 15 వేల ఎకరాల్లో గంజాయి సాగు జరుగుతుండేదని అంచనా. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం గంజాయి హబ్‌గా మారిపోయిందనే విమర్శలు వినిపించాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయిపై ఉక్కుపాదం మోపింది. ఈగల్ బృందాలు, పోలీసుల కఠిన చర్యలతో మన్యంలో గంజాయి సాగు పూర్తిగా కనుమరుగైంది. ఇదే సమయంలో పొరుగు రాష్ట్రం ఒడిశాలో గంజాయి సాగు పెరిగింది. ఒడిశా నుంచి ఏపీ మీదుగా స్మగ్లింగ్ చేస్తున్న అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌ను ఈగల్ ఛేదించింది. అరకు ప్రాంతంలో స్వీటు షాపులు, ఐరన్‌మార్ట్ వ్యాపారాల మాటున తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్లు గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించింది. వరుస దాడులతో స్మగ్లర్లు రాష్ట్రం నుంచి పారిపోయారు.

(అమరావతి/పాడేరు-ఆంధ్రజ్యోతి)

ఏడాదిన్నర క్రితం వరకూ దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా ఆంధ్రప్రదేశ్ పేరే వినిపించేది. గత వైసీపీ ప్రభుత్వంలో విశాఖ మన్యంలో వేలాది ఎకరాల్లో గంజాయి సాగయ్యేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గంజాయి కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించింది. గిరిజన ప్రాంతంలో గంజాయి సాగు, రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఈగల్ బృందాలు, పోలీసులు పలు చర్యలు చేపట్టారు. మారుమూల ప్రాంతాల్లో గంజాయి తోటలను డ్రోన్‌ల ద్వారా గుర్తించడం, వాటిని ప్రత్యేక పోలీస్ బృందాలతో ధ్వంసం చేయడం, మరోవైపు అల్లూరి జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీలను ముమ్మరం చేసి రవాణాకు అడ్డుకట్ట వేయడం, బాధ్యులపై కేసులు నమోదు చేయడం వంటి చర్యలు తీసుకున్నారు. మరోవైపు గంజాయి సాగు, రవాణా వల్ల కలిగే నష్టాలపై గిరిజన రైతులు, స్థానికులు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గంజాయి సాగు, రవాణా జోలికి వెళ్లేందుకు భయపడే వాతావరణాన్ని సృష్టించారు. అలాగే పోలీస్ స్టేషన్ల స్థాయిలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, గ్రామపెద్దలు, రైతులతో 'పరివర్తన' పేరిట పోలీసులు సమావేశాలు నిర్వహించారు. గంజాయి జోలికి వెళ్లవద్దని, ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని

మిగతా 3వ పేజీలో...

ఇక ఆన్‌లైన్‌లో భూ వినియోగ మార్పు

3

45 రోజుల్లోపు అనుమతులిచ్చేలా ఆదేశాలు.. ఒక్కో దరఖాస్తుకు రూ.10 వేల ఫీజు



ఆంధ్రజ్యోతి

టీచర్లు 1000.. విద్యార్థులు '0'

» దేశవ్యాప్తంగా 8 వేల బడుల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్

» 2024-25 విద్యా సంవత్సరం గణాంకాల్లో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 26: ప్రభుత్వ విద్య ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రావాలని ఓవైపు అందరూ కోరుకుంటుంటే.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులే చేరని పరిస్థితి మరోవైపు నెలకొంటోంది. 2024-25 విద్యా సంవత్సరంలో దేశ వ్యాప్తంగా 7,993 ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అయితే ఈ పాఠశాలల్లో ఏకంగా 20,817 మంది ఉపాధ్యాయులు నియమితులైనట్లు తెలిపింది. ఇందులో విద్యార్థులు ఒక్కరు కూడా చేరని (జీరో ఎన్‌రోల్‌మెంట్) స్కూళ్లు దేశంలోనే అత్యధికంగా పశ్చిమబెంగాల్‌లో 3,812 ఉండగా, ఆ తరువాత స్థానంలో తెలంగాణలో 2,245 జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు ఉన్నాయి. ఇక ఇలాంటి స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయుల సంఖ్య కూడా అత్యధికంగా (17,965) బెంగాల్‌లోనే ఉంది. ఈ విషయంలోనూ తెలంగాణ రాష్ట్రం 1,016 మంది ఉపాధ్యాయులతో రెండోస్థానంలో ఉంది. కాగా, విద్యార్థులు చేరని స్కూళ్లలో తెలంగాణ తరువాతి స్థానాల్లో వరుసగా హరియాణా, మహారాష్ట్ర, గోవా, అసోం, హిమాచల్‌ప్రదేశ్ ఛత్తీస్‌గఢ్, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర ఉన్నాయి. అయితే కేంద్రపాలిత ప్రాంతాల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లే లేకపోవడం గమనార్హం. ఢిల్లీలోనూ ఇలాంటి ప్రభుత్వ పాఠశాల ఒక్కటి కూడా లేదు.

దేశవ్యాప్తంగా 'సర్'పై నేడు ఈసీ ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబరు 26: దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)పై వివరాలు వెల్లడించేందుకు సోమవారం సాయంత్రం ఎన్నికల కమిషన్(ఈసీ) విలేకరుల సమావేశం నిర్వహించనుంది. మొదటి దశలో 10-15 రాష్ట్రాలకు సంబంధించిన 'సర్' జరగనుండగా అందుకు సంబంధించిన సమాచారాన్ని ప్రకటించనుంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, పాండిచ్చేరి సహా ఇతర రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. నవంబరు ఒకటో తేదీన 'సర్' ప్రారంభం కానుంది.

ఐదేళ్ల తర్వాత భారత్-చైనా మధ్య విమానాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 26: ఐదేళ్ల విరామం తర్వాత భారత్-చైనా మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులు ఆదివారం రాత్రి నుంచి పునఃప్రారంభం అయ్యాయి. కోల్‌కతా నుంచి చైనాలోని గ్వాంగ్‌జౌ మార్గంలో మొదటి ఇండిగో విమాన సర్వీసు ప్రారంభమైంది. నవంబర్ 9నుంచి షాంఘై-న్యూఢిల్లీ మార్గంలో చైనా ఎయిర్‌లైన్స్ విమాన సేవలు మొదలవనున్నాయి. ఈ పరిణామం రెండు దేశాల మధ్య వాణిజ్యం, పర్యాటకం, వ్యాపార సంబంధాలను మరింత పెంచడానికి దోహద పడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏడాదిగా ద్వైపాక్షిక సంబంధాలు క్రమంగా మెరుగుపడడంతో సరిహద్దు ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి.

మూడు మీడియా పర్యవేక్షక సంస్థల ఏకీకరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 26: మూడు మీడియా పర్యవేక్షక సంస్థలు(రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(గతంలో డీఏవీపీ), ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో.. ఈ మూడింటిని ఏకీకృతం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా ప్రభుత్వ సమాచారం అందించడంలో మరింత బాధ్యతాయుత వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని భావిస్తోంది. మీడియాకు కచ్చితమైన సమాచారం అందించడం, అలాగే ప్రాంతీయ మీడియాకు కూడా వేగంగా సమాచారం, సందర్భోచిత వివరాలు అందించడమే ఈ వ్యవస్థ ఏర్పాటు లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన కసరత్తు 6 నెలల్లో అది పూర్తవుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అన్ని మీడియాల(ప్రింట్, టీవీ, డిజిటల్) వారికి ప్రభుత్వం విడుదల చేసే పత్రికా ప్రకటనలు, విధానాల సంక్షిప్త సమాచారం, మల్టీ మీడియా కంటెంట్, ధ్రువీకరించిన గణాంకాలు అందుబాటులోకి తెచ్చే సింగిల్ విండో విధానంగా ఈ వ్యవస్థ పనిచేస్తుందన్నారు.

దేశంలో 22 నకిలీ వర్సిటీలు: యూజీసీ

న్యూఢిల్లీ, అక్టోబరు 26: దేశంలో 22 నకిలీ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని యూజీసీ హెచ్చరించింది. ఆయా యూనివర్సిటీల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఢిల్లీలోని కోట్ల ముబారక్‌పూర్‌లో ఉన్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజనీరింగ్ సంస్థకు ఇప్పటికే పలు దఫాలు హెచ్చరికలు జారీ చేసినట్టు పేర్కొంది. 22 నకిలీ వర్సిటీల జాబితాను వెలువరించింది. వీటిలో 9 నకిలీ విశ్వవిద్యాలయాలు ఢిల్లీలోనే ఉన్నాయని, ఐదు యూపీలో ఉన్నాయని తెలిపింది. తర్వాతి స్థానంలో ఆంధ్రప్రదేశ్(ఏపీ), కేరళ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, పుదుచ్చేరి ఉన్నట్టు వివరించింది.

వచ్చే నెల మొదటి వారంలో పీఎం కిసాన్

న్యూఢిల్లీ, అక్టోబరు 26: కేంద్ర ప్రభుత్వం పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి యోజన 21వ విడత నిధులను నవంబరు మొదటి వారంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ పథకం ద్వారా సుమారు 8.5 కోట్ల మంది అర్హులైన రైతులకు రూ.2,000 చొప్పున అందించనుంది.

2న 'జీశాట్-7ఆర్' ప్రయోగం

సూళ్లూరుపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతోంది. నవంబరు 2న చేపట్టనున్న ఈ ప్రయోగం ద్వారా జీశాట్-7ఆర్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని వాహన అనుసంధాన భవనం (వ్యాబ్) నుంచి ఆదివారం ఎల్‌వీఎం3-ఎం5 వాహకనౌకను రెండో ప్రయోగ వేదికపైకి తీసుకొచ్చారు.

నేతలకు కల్తీ మద్యం సొమ్ము!

(మొదటి పేజీ తరువాయి)

తలా ఇంత పంచుకున్నట్టు సోదరులు వెల్లడించారు. దీనిలో కొందరు అధికారులకు, రాజకీయనేతలకు కూడా సొమ్ము ముట్టజెప్పారు. ఒక క్వార్టర్ సీసా మద్యం తయారీకి రూ.20-30 ఖర్చు చేసి, రూ.50-60కు విక్రయించారు. కల్తీ మద్యం తయారీ ఫార్ములా బాలాజీకి మాత్రమే తెలుసని అద్దేపల్లి సోదరులు వెల్లడించారు. "చిత్తూరు జిల్లాకు చెందిన బాలాజీ బెంగళూరులో స్థిరపడ్డారు. గోవాలోని పలు డిస్టిలరీల్లో పనిచేశారు. అక్కడ పనిచేసినప్పుడే.. నకిలీ మద్యం తయారీ ఫార్ములాపై పట్టు పెంచుకున్నారు. ఆ ఫార్ములాతోనే కల్తీ మద్యం తయారు చేశాం." అని జనార్దనరావు అధికారులకు వివరించినట్టు తెలిసింది. నిర్దేశించిన సరుకును తయారు చేసి ఇవ్వడానికి బాలాజీకి రూ.20 లక్షల అడ్వాన్స్‌ను ఇచ్చినట్టు వెల్లడించారు. ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో తయారైన కల్తీ మద్యం సరుకును బార్‌లు, బెల్టు షాపులకు సరఫరా చేసి విక్రయించినట్టు అంగీకరించారు. ముఖ్యంగా ఆదివారాల్లో బార్‌లు రద్దీగా ఉంటాయని, ఆ సమయంలో కల్తీ మద్యాన్ని సరఫరా చేసినట్టు అన్నదమ్ములు అంగీకరించారు. కాగా, కల్తీ మద్యం వ్యవహారంలో వైసీపీ నేత, మాజీమంత్రి జోగి రమేశ్ పాత్ర ఉందని అద్దేపల్లి వెల్లడించిన విషయం తెలిసిందే.



నాకొక గర్ల్ ఫ్రెండ్ కావాలే..!

న్యూఢిల్లీ, అక్టోబరు 26: ఆడపిల్లల దృష్టిలో పడటం కోసం అబ్బాయిలు ఎన్నో పాట్లు పడినట్లే.. ఆస్ట్రేలియాలో ఆడ డాల్ఫిన్లకు నచ్చడం కోసం మగ డాల్ఫిన్లు తలపై రంగురంగుల 'విగ్గులు, నాచు కిరీటాలను' పెట్టుకొని వాటి వెంట తిరుగుతున్నాయి. చదవడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజమే. ఆస్ట్రేలియాలోని ఉత్తర తీరంలో పిల్బారా, కింబర్లీ ప్రాంతాల్లో మగ డాల్ఫిన్లు తమ తలపై సముద్రపు నాచు(సీ స్పాంజ్)ను అలంకారంగా పెట్టుకొని ఆడ డాల్ఫిన్లను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆస్ట్రేలియా జీవ వైవిధ్య సంరక్షణ, ఆకర్షణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త హోలీ రాడినో, ఆమె బృందం గుర్తించారు. డాల్ఫిన్లలో ఇలాంటి వింత ప్రవర్తనను మరెక్కడా తాము గమనించలేదని చెప్పారు.

తరతరాలకు స్ఫూర్తిదాయకం

» 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ/ఆసిఫాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నిజాం దురాగతాలపై యోధుడు కుమ్రం భీమ్ పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. కుమ్రం భీమ్ తన ధైర్యం, త్యాగంతో లక్షలాది మంది హృదయాలపై ముఖ్యంగా గిరిజన సమాజంపై చెరగని ముద్ర వేశారన్నారు. కుమ్రం భీమ్ 40 సంవత్సరాలు మాత్రమే జీవించినా.. ఆయన జీవితం ఎన్నో పాఠాలను నేర్పుతుందని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆదివారం ప్రధాని తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 127వ ఎపిసోడ్‌లో 'జల్, జంగల్, జమీన్ హమారా' నినాదం కోసం ప్రాణాలర్పించిన ఆదివాసీ పోరాట యోధుడు కుమ్రం భీం గురించి ప్రస్తావించి నివాళులర్పించారు. "నేను ఇప్పుడు మిమ్మల్ని గతకాలపు జ్ఞాపకాల్లోకి తీసుకెళతాను. 20వ శతాబ్ద ప్రారంభాన్ని ఊహించుకోండి! అప్పుడు స్వాతంత్ర్యం వస్తుందనే ఆశ కనుచూపు మేరలో లేదు. బ్రిటీష్ వారు భారతదేశం అంతటా అడ్డూఅదుపు లేకుండా దోపిడీ సాగిస్తున్నారు. హైదరాబాద్ ప్రజలకు అణచివేత కాలం మరింత భయంకరం. క్రూరమైన, నిర్దయుడైన నిజాం దురాగతాలను కూడా వారు భరించవలసి వచ్చింది. పేదలు, అణగారిన వర్గాలు, ఆదివాసీలపై దౌర్జన్యాలు వర్ణనాతీతం. వారి భూములను లాక్కున్నారు. భారీగా పన్నులు విధించారు. ఈ అన్యాయాన్ని నిరసించిన వారి చేతులను నరికివేశారు. ఈ దురాగతాలకు వ్యతిరేకంగా 20 ఏళ్ల యువకుడు నిలబడ్డాడు. ఆ పేరు చెప్పే ముందు అతని ధైర్యం గురించి నేను మీకు చెబుతాను. నిజాంకు వ్యతిరేకంగా ఒక్కమాట మాట్లాడటం కూడా నేరంగా పరిగణించే ఆ రోజుల్లో సిద్ధిఖీ అనే నిజాం అధికారిని ఆ యువకుడు బహిరంగంగా సవాలు చేశాడు. రైతుల పంటలను జప్తు చేయడానికి సిద్ధిఖీని నిజాం పంపాడు. కానీ అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో సిద్ధిఖీని ఆ యువకుడు చంపాడు. నిజాం ప్రభుత్వ పోలీసుల నుంచి తప్పించుకుని వందల కిలోమీటర్ల దూరంలోని అసోంకు చేరుకున్నాడు. 1940లో ఆయనను నిజాం మనుషులు హత్య చేశారు. ఆ గొప్ప వ్యక్తి పేరు కుమ్రం భీమ్. ఈ నెల 22న ఆయన జయంతిని జరుపుకున్నాం. కుమ్రం భీమ్ ఎక్కువ కాలం జీవించ లేదు. కానీ తన జీవితకాలంలో అసంఖ్యాక ప్రజల హృదయాలపై.. ముఖ్యంగా ఆదివాసీ సమాజంపై చెరగని ముద్ర వేశారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిలో కొత్త శక్తిని నింపారు" అని ప్రధాని అన్నారు. వచ్చే నెల 15న మనం 'ఆదివాసీ గౌరవ దినోత్సవం' నిర్వహించుకోనున్నామని చెప్పారు. "ఇది భగవాన్ బిర్సా ముండా జయంతి శుభ సందర్భం. దేశ స్వాతంత్ర్యం కోసం, ఆదివాసీ సమాజ హక్కుల కోసం ఆయన చేసిన కృషి సాటిలేనిది" అంటూ నివాళులర్పించారు.



ఆసియాన్ సదస్సులో వర్చువల్‌గా పాల్గొని ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

21వ శతాబ్దం భారత్-ఆసియాన్ దేశాలదే

ఇరవైఒకటో శతాబ్దం భారత్-ఆసియాన్ దేశాలదేనని మోదీ చెప్పారు. ఆసియాన్ దేశాల విజన్ 2045, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలు ఒకటేనన్నారు. రాబోయే తరాలకు సమృద్ధికరమైన, ఉజ్వలమైన భవిష్యత్ అందించే దిశగా చర్యలు తీసుకుందామన్నారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరుగుతున్న ఆసియాన్ దేశాల సదస్సులో ఆయన వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ జనాభాలో నాలుగో వంతు ఆసియాన్ దేశాల్లోనే ఉన్నారని, భారత్-ఆసియాన్ దేశాలు భౌగోళికంగానే కాక ఉమ్మడి చారిత్రక విలువలు, కలిగి ఉన్నాయన్నారు. భారత్-ఆసియాన్ దేశాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంతో ముందడుగు వేస్తున్నాయని, ఈ భాగస్వామ్యం ప్రపంచ సుస్థిర అభివృద్ధికి బలమైన పునాదిగా మారుతుందని మోదీ చెప్పారు. ప్రతి విపత్తులోనూ ఆసియాన్ దేశాలకు భారత్ అండగా ఉందన్నారు.

వందేమాతర గీతం 150 ఏళ్ల వేడుకలు

వందేమాతర గీతం భారతీయుల్లో నిరంతరం దేశభక్తిని, ఐక్యతను నింపుతూ ఉంటుందని, అది భారతీయతకు శక్తిమంతమైన చిహ్నమని మోదీ అన్నారు. వందేమాతరం అనే ఒక్కపదమే మన గుండెల్లో ఎన్నో భావోద్వేగాలను కలిగిస్తుందని, శక్తినిచ్చి భరతమాత బిడ్డలుగా మన బాధ్యతలను గుర్తుచేస్తుందని చెప్పారు. బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతర గీతం వచ్చే నెల 7వ తేదీతో ఈ ఏడాది 150వ ఏట అడుగిడుతుందని, ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'ఆపరేషన్ సిందూర్'తో ఈ ఏడాది పండుగలు మరింత ఘనంగా జరిగాయన్నారు. భారతీయ కాఫీ ప్రపంచవ్యాప్తంగా ఆదరణ సంపాదించుకుంటోందన్న మోదీ.. ఒడిసాలోని కోరాపుట్ సహా అనేక ప్రాంతాలను ప్రస్తావించారు.



టెట్ నుంచి మినహాయించండి

» 2011కు ముందు నియమితులైన టీచర్ల డిమాండ్

న్యూఢిల్లీ, అక్టోబరు 26: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని 2011 జూలై 27కు ముందు నియమితులైన టీచర్లు డిమాండ్ చేస్తున్నారు. దేశవ్యాప్తంగా టీచర్లు వచ్చే నెల 21న ఢిల్లీలో మెగా ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి ఈ మేరకు మెమోరాండం సమర్పించనున్నట్టు తెలిపారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో మెగా ర్యాలీ నిర్వహించనున్నట్టు భారత ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు దినేశ్ చంద్ర శర్మ వెల్లడించారు. 2011 జూలై 27కు ముందు నియమితులైన టీచర్లకు టెట్ తప్పనిసరి చేయడం న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఏ చట్టాన్ని అయినా అమల్లోకి వచ్చిన తేదీ నాటి నుంచి అమలు చేయాలని, అంతకుముందు నుంచి వర్తింపజేయడం సరికాదన్నారు.

యూపీలో బస్సుకు మంటలు

లఖ్‌నవూ, అక్టోబరు 26: యూపీలో ఓ ప్రైవేటు ఏసీ స్లీపర్ బస్సు మంటల్లో చిక్కుకుంది. ఢిల్లీ నుంచి లఖ్‌నవూ మీదుగా గోండాకు 70మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆగ్రా- లఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్‌వేపై రెవ్రీ టోల్‌ప్లాజాకు 500 మీటర్ల దూరంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. మంటలను గమనించిన బస్సు డ్రైవర్, కండక్టర్ వెంటనే అప్రమత్తమై ప్రయాణికులందరినీ కిందికి దించివేయడంతో పెను ప్రమాదం తప్పింది. వారందరూ ప్రాణాలతో బయటపడ్డారు. మొదట బస్సు చక్రాలకు అంటుకున్న మంటలు తర్వాత బస్సు మొత్తం వ్యాపించినట్లు బస్సు డ్రైవర్ జగత్ సింగ్ తెలిపాడు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఎస్‌సీవో సదస్సు వేళ.. మోదీపై హత్యాయత్నం.. భగ్నం?

» భారత్, రష్యా సంయుక్త ఆపరేషన్!

» 'మాతృభూమి' వార్తా సంస్థ కథనం

» సోషల్ మీడియాలోనూ వైరల్

న్యూఢిల్లీ, అక్టోబరు 26: దాదాపు రెండు నెలల క్రితం చైనాలో 'షాంఘై సహకార సంస్థ' సదస్సు జరిగిన సమయంలో.. ప్రధాని మోదీపై హత్యాయత్నం జరిగిందా? దాని వెనుక అమెరికా హస్తం ఉందా? భారత్, రష్యా గూఢచార సంస్థలు ఆ కుటిల యత్నాన్ని భగ్నం చేశాయా? ...నాలుగైదు రోజులుగా సోషల్ మీడియాలో ఇవే అంశాలతో కూడిన ఒక కథనం విస్తృతంగా వైరల్ అవుతోంది. కేరళకు చెందిన 'మాతృభూమి' వార్తాసంస్థ కూడా ఈ మేరకు ఒక కథనాన్ని ప్రచురించడం గమనార్హం. ఆ కథనం ప్రకారం ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన మోదీ ఆగస్టు 31న టియాన్జిన్‌లో ఉన్నప్పుడు ఢాకాలోని ఒక హోటల్‌లో.. అమెరికాకు చెందిన ప్రత్యేక దళాల అధికారి టెర్రెన్స్ జాక్సన్ అనుమానాస్పద స్థితిలో మరణించారు. బంగ్లాదేశ్ సేనలకు శిక్షణ ఇచ్చేందుకు ఆయన అక్కడకు వచ్చినట్టు అధికారికంగా రికార్డుల్లో ఉన్నప్పటికీ.. భారతదేశ ప్రధాన నాయకత్వంపై దాడి జరిగే ప్రమాదం ఉందంటూ నిఘా వర్గాలకు ఉప్పందిన సమయంలో జాక్సన్ ఢాకాలో ప్రత్యక్షం కావడం రకరకాల అనుమానాలకు తావిచ్చింది. ఈ క్రమంలోనే మన రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్(రా), రష్యా 'ఫారిన్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (ఎస్‌వీఆర్)' కలిసి ఉమ్మడిగా కౌంటర్ ఇంటెలిజెన్స్ ఆపరేషన్ చేపట్టాయని 'మాతృభూమి' వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది. అటు చైనాలో.. రష్యా అధ్యక్షుడు పుతిన్ మోదీని తన కారులో కూర్చోబెట్టుకుని దాదాపు గంటసేపు చర్చించారు. ఆ సమయంలో కారులో వారిద్దరు మాత్రమే ఉన్నారు. ఒకరు చెప్పే మాటలను మరొకరికి అనువదించడానికి దుబాసీలు కూడా లేరు. ఆ సమయంలో పుతిన్.. తమ నిఘా వర్గాల సమాచారాన్ని మోదీకి తెలియజేశారని 'మాతృభూమి' కథనం. ఆ సదస్సు నుంచి భారత్‌కు తిరిగి వచ్చిన మోదీ.. సమీకాన్ ఇండియా సమావేశంలో పాల్గొన్నప్పుడు చప్పట్లు కొడుతున్న ఆహూతులను ఉద్దేశించి.. 'నేను (చైనాకు) వెళ్లినందుకు చప్పట్లు కొడుతున్నారా? లేక తిరిగొచ్చినందుకా?' అని నవ్వుతూ సర్వగర్భ వ్యాఖ్యలు చేశారని ఆ కథనంలో గుర్తుచేసింది. కనిపించని ఆపదలను తాను తప్పించుకున్నానే విషయాన్ని ప్రధాని అలా సంకేత భాషలో వివరించారని పేర్కొంది.

మునీర్, షరీఫ్ గొప్పవాళ్లు

» మలేసియా పర్యటనలో ట్రంప్ ప్రశంస



కౌలాలంపూర్, అక్టోబరు 26: పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గొప్పవాళ్లని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీర్తించారు. పాక్-అఫ్గాన్ సంక్షోభాన్ని తాను సునాయాసంగా పరిష్కరించగలనని చెప్పారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన ఆసియాన్ సదస్సులో భాగంగా థాయ్‌లాండ్-కాంబోడియా దేశాల మధ్య శాంతి ఒప్పందంపై సంతకాల వేళ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తాను 8 నెలల్లో నెలకొకటి చొప్పున మొత్తం 8 యుద్ధాలు ఆపానని చెప్పారు. ఇప్పటివరకు ఏ ఇతర అమెరికా అధ్యక్షుడు కూడా ఒక్క యుద్ధం కూడా ఆపలేదన్నారు. మిగతా అధ్యక్షులు యుద్ధాలు చేస్తే తాను యుద్ధాలు ఆపి లక్షల మంది ప్రాణాలు కాపాడానని చెప్పారు. చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదని, భవిష్యత్తులో కూడా జరిగే అవకాశం లేదన్నారు. అంతకుముందు ఆసియాన్ సదస్సులో పాల్గొనేందుకు కౌలాలంపూర్‌కు చేరుకున్న ట్రంప్‌నకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తనను ఆహ్వానించేందుకు ఎయిర్‌పోర్ట్‌లో ఏర్పాటు చేసిన సంప్రదాయ నృత్య బృందాన్ని చూసి ట్రంప్ ఆగలేకపోయారు.వారి దగ్గరకు వెళ్లి హుషారుగా స్టెప్పులేశారు. మలేసియా ప్రధాని కూడా స్టెప్పులేశారు.

భారత్‌తో బంధాన్ని పణంగా పెట్టం

» పాక్‌తో సంబంధాలపై రుబియో

వాషింగ్టన్, అక్టోబరు 26: పాకిస్థాన్‌తో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు భారత్‌తో తమకు ఉన్న బంధాన్ని పణంగా పెట్టబోమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పష్టం చేశారు. ఉగ్రవాదులకు పాక్ ఓ స్వర్గమని పేర్కొన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇటీవల ఆ దేశానికి మరింత దగ్గరవుతున్నారు. పాక్‌తో వరుస ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా, పాక్‌కు దగ్గరవుతుండడంపై భారత్ నుంచి అభ్యంతరాలు వ్యక్తమవ్వడం లేదా ? అంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు మార్కో రుబియో స్పందించారు. దౌత్యపరమైన విధానాల్లో భారత్ చాలా పరిణితి చెందిన దేశమన్న రుబియో.. భారత్ నుంచి తమకు ఎలాంటి అభ్యంతరాలు రాలేదని తెలిపారు.

రష్యా అమ్ములపొదిలో అణు క్రూయిజ్ క్షిపణి

(మొదటిపేజీ తరువాయి)

సైనికాధికారులను ఆదేశించారు. పరీక్షల్లో భాగంగా అక్టోబరు 21న బురేవెస్నిక్‌ను ప్రయోగించగా.. అది 15 గంటలపాటు 14 వేల కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించిందని రష్యా మిలటరీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వెలెరీ గెరాసిమోవ్ తెలిపారు. 14 వేల కిలోమీటర్లు దాని గరిష్ఠ పరిధి కాదని.. బురేవెస్నిక్ సాంకేతిక సామర్థ్యాలు ఎంత గొప్పవంటే ప్రపంచంలో ఎంత దూరంలో, ఎంత సురక్షిత ప్రదేశంలో ఉన్న లక్ష్యాన్నైనా అది గురితప్పకుండా ఛేదించగలదని ఆయన వివరించారు. రష్యా వద్ద ఇప్పటి వరకూ ఉన్న క్రూయిజ్ క్షిపణుల్లో అత్యధిక రేంజ్ కలిగినది.. కేహెచ్-102 క్రూయిజ్ మిస్సైల్. దాని పరిధి 4500 కిలోమీటర్లు అంటే.. బురేవెస్నిక్ సత్తా ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అణు ఇంధనంతో నడిచే శక్తి, వార్‌హెడ్ సామర్థ్యాలను కలిగిన ఈ క్షిపణి గురించి పుతిన్ 2018లోనే ప్రపంచానికి తొలిసారి తెలియజేశారు. బురేవెస్నిక్‌ను ఆయన అజేయమైన ఆయుధంగా అభివర్ణించారు. 50 నుంచి 100 మీటర్ల ఎత్తులో ప్రయాణించే ఈ క్రూయిజ్ క్షిపణిని గుర్తించి, అడ్డుకోవడం అత్యంత అధునాతనమైన క్షిపణి నిరోధక రక్షణ వ్యవస్థలకు సైతం చాలా కష్టమని వివరించారు.



పరీక్షల్లో ప్రమాదాలు..

ఈ క్షిపణిని అభివృద్ధి చేసి, పరీక్షించే క్రమంలో రష్యన్ శాస్త్రవేత్తలకు పలు సాంకేతిక సవాళ్లు ఎదురయ్యాయి. 2016 నుంచి ఈ క్షిపణిని పదిసార్లకు పైగా పరీక్షించారు. 2019 ఆగస్టులో నెనోక్సా వద్ద నిర్వహించిన రికవరీ ఆపరేషన్ (అంటే క్షిపణి పరీక్ష అనంతరం దాని భాగాలను సేకరించే) సమయంలో పేలుడు సంభవించి ఏడుగురు శాస్త్రజ్ఞులు చనిపోయారు. సెవరోడ్‌విన్స్క్ ప్రాంతంలో రేడియేషన్ స్థాయిలు పెరిగాయి. ఆ తర్వాత 2021, 2022, 2023లో దీన్ని పలుమార్లు పరీక్షించారు. ఇప్పటికే రష్యా వద్ద ఉన్న పొసెయిడాన్ అణు టార్పెడోతో ఇది కూడా కలిస్తే.. ఆ దేశ సెకండ్ స్ట్రైక్ క్యాపబిలిటీస్ పెరుగుతాయని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. రష్యా భూభాగంలోని ఏ బేస్ నుంచి ప్రయోగించినా అది అమెరికాలోని ఏ లక్ష్యాన్నైనా చేరుకోగలదని 'ద ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ (ఐఐఎస్ఎస్)' తెలిపింది.

మయన్మార్ సైబర్‌క్రైమ్ స్థావరం నుంచి వందల మంది భారతీయులు పరార్

న్యూఢిల్లీ/బ్యాంకాక్, అక్టోబరు 26: మయన్మార్‌లోని సైబర్‌క్రైమ్ అడ్డాల నుంచి థాయిలాండ్‌కు పారిపోయిన వెయ్యిమందిలో వందలాది మంది భారతీయులు కూడా ఉన్నట్టు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అంతర్జాతీయంగా ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో సైబర్ ముఠాలకు అడ్డాగా మారిన కేకే పార్క్‌లో సైన్యంతో సోదాలు చేయించనున్నట్టు గత సోమవారం మయన్మార్‌లోని జుంటా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో బుధ-శుక్రవారాల మధ్య మయన్మార్ నుంచి సరిహద్దు గుండా థాయిలాండ్‌లోకి వెయ్యిమందికిపైగా పారిపోయారు. వీరంతా థాయిలాండ్‌లోని కరేన్ రాష్ట్రం మాయిసోట్ జిల్లాలోకి ప్రవేశించారు. వారిలో 399 మంది భారతీయులు, 147 మంది చైనీయులు, 31 మంది థాయిలాండ్ జాతీయులు కూడా ఉన్నట్టు థాయిలాండ్‌కు చెందిన ఖావ్‌సోద్ దిన పత్రిక ప్రచురించింది. దీన్ని థాయిలాండ్ అధికారులు కూడా నిర్ధారించారు. మయన్మార్‌లో కేకే పార్క్ వంటి విశాలమైన కాంపౌండ్‌ల అడ్డాగా సైబర్ ముఠాలు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నాయి. ఈ కాంపౌండ్‌లలో వేలాది మంది పనిచేస్తున్నారు. వీరిలో కొందరిని ఉద్యోగం పేరిట రప్పించి సాయుధ సిబ్బంది పర్యవేక్షణలో నిర్బంధంగా సైబర్ నేరాలు చేయిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్నవారిలో వియత్నాం, ఫిలిప్పీన్స్, ఇథియోపియా, పాకిస్థాన్, ఇండోనేసియా, నేపాల్ జాతీయులు కూడా ఉన్నారు. ఈ ఏడాది మార్చిలోనూ మయన్మార్-థాయిలాండ్ సరిహద్దు వెంబడి సైబర్ అడ్డాలపై దాడులు చేసి కాపాడిన 549 మంది పౌరులను భారత్ రెండు మిలిటరీ విమానాల్లో తీసుకువచ్చింది.

కరోనా వ్యాక్సిన్‌తో క్యాన్సర్‌కు చెక్!

» ఎంఆర్ఎన్ఏ టీకాలు వేయించుకున్న క్యాన్సర్ పేషంట్ల జీవితకాలం పెరిగినట్టు తాజా అధ్యయనంలో వెల్లడి

వాషింగ్టన్, అక్టోబరు 26: కొవిడ్ సమయంలో అమెరికాలో విస్తృతంగా తీసుకున్న ఎంఆర్ఎన్ఏ టీకాలు.. క్యాన్సర్‌పై పోరాటంలో రోగనిరోధక వ్యవస్థకు ఊతమిస్తున్నట్టు తాజా అధ్యయనంలో వెల్లడైంది. చివరి దశల ఊపిరితిత్తుల క్యాన్సర్, చర్మ క్యాన్సర్ బాధితులకు ఇమ్యూనోథెరపీ ప్రారంభించిన 100 రోజుల్లోపు ఫైజర్ లేదా మోడెర్నా కంపెనీలు తయారుచేసిన కరోనా టీకా (ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్) వేస్తే.. వారి రోగనిరోధక వ్యవస్థ చికిత్సకు మరింత మెరుగ్గా స్పందించి వారి జీవితకాలం పెరుగుతోందని యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా, ఎండీ ఆండర్సన్ క్యాన్సర్ సెంటర్‌లకు చెందిన శాస్త్రజ్ఞులు తెలిపారు. "ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్.. శరీరంలోని రోగనిరోధక కణాలను మేల్కొలిపే యుద్ధ భేరిలాగా పనిచేస్తోంది. రోగనిరోధకశక్తికి లొంగని కణితులు.. దీనివల్ల ఇమ్యూన్ చికిత్సకు లొంగుతున్నాయి" అని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన డాక్టర్ ఆడమ్ గ్రిప్పిన్ తెలిపారు. నిజానికి వీరు ఈ పరిశోధన కరోనా టీకాలపై ప్రత్యేకంగా చేయలేదు. క్యాన్సర్లకు చెక్‌పెట్టే ఎంఆర్ఎన్ఏ టీకాల తయారీకి చాలాకాలంగా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే.. గ్రిప్పిన్ బృందం ఇప్పటికే అందుబాటులో ఉన్న కరోనా(ఎంఆర్ఎన్ఏ) వ్యాక్సిన్ ప్రభావం ఆ టీకా తీసుకున్న క్యాన్సర్ పేషెంట్లపై ఏమైనా ఉందా అనే దిశగా అధ్యయనం చేయగా ఈ విషయం యాదృచ్ఛికంగా బయటపడింది. అధ్యయనంలో భాగంగా వారు ఇమ్యూనోథెరపీ తీసుకుంటున్న 1000 మంది క్యాన్సర్ పేషెంట్ల రికార్డులను పరిశీలించారు. వారిలో ఎంఆర్ఎన్ఏ టీకా తీసుకోనివారితో పోలిస్తే.. తీసుకున్నవారు రెట్టింపుకాలం జీవించినట్టు వెల్లడైంది.

రష్యాలో భారత్ యూరియా కర్మాగారం

» నిర్మించాలని ఎరువుల కంపెనీల ప్రతిపాదన

» పుతిన్ పర్యటనలో ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ, అక్టోబరు 26: దేశంలో యూరియా కొరతను నివారించడానికి భారతీయ ఎరువుల తయారీ కంపెనీలు వినూత్నంగా ఆలోచించాయి. ముడిసరకు అధికంగా లభించే రష్యాలోనే ఏకంగా కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాయి. యూరియా సరఫరాపై చైనా ఆంక్షలు విధించడంతో గుణపాఠం నేర్చుకున్న కంపెనీలు రష్యాలో తొలిసారిగా సొంతంగా కర్మాగారాన్ని నిర్మించనున్నాయి. రష్యాలో విస్తారంగా అమ్మోనియా, సహజవాయువు లభిస్తుండడంతో అక్కడే కర్మాగారాన్ని నిర్మించి యూరియా సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని భావిస్తున్నాయి. ఈమేరకు ప్రభుత్వ రంగ సంస్థలైన రాష్ట్రీయ కెమికల్స్, ఫెర్టిలైజర్స్ (ఆర్‌సీఎఫ్), నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్), ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్)లు రష్యన్ భాగస్వాములతో 'గుట్టు ఒప్పందా' (నాన్ డిస్క్లోజర్ అగ్రిమెంట్-ఎన్‌డీఏ)న్ని కుదుర్చుకున్నాయి. అంతా ఖరారయ్యే వరకు వివరాలను బహిర్గత పరచకూడదన్నది ఈ ఒప్పందం సారాంశం. ఏటా 20 లక్షల టన్నుల యూరియాను ఉత్పత్తి చేసే సామర్థ్యం గల కర్మాగారం అక్కడ ఏర్పాటు కానుంది. స్థలం కేటాయింపు, అమ్మోనియా ధర నిర్ధారణ, రవాణా సౌకర్యాల కల్పనపై చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం అమ్మోనియా, సహజ వాయువులను విదేశాల నుంచి దిగుమతి చేసుకొని దేశంలో యూరియాను తయారు చేస్తున్నారు. ముడిసరకు దిగుమతుల్లో ఇబ్బందులు వస్తే దాని ప్రభావం యూరియా లభ్యతపై కనిపిస్తోంది. ఇటీవల యూరియా, ఇతర ముడిసరకులపై చైనా ఆంక్షలు విధించడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో తగినంతగా దొరకక రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలంటే రష్యాలో సొంతంగా కర్మాగారం నిర్మించుకోవడమే మేలని ప్రభుత్వ సంస్థలు భావిస్తున్నాయి.



రామ్మోహన్‌నాయుడు దంపతులను అభినందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు ప్రహ్లాద్ జోషి, ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్, మంత్రి అచ్చెన్న, ఎమ్మెల్యే బండారు తదితరులు

కేంద్ర మంత్రి రామ్మోహన్ ఇంట సందడి

» కేంద్ర మంత్రులు, టీ సీఎం రేవంత్ హాజరు

న్యూఢిల్లీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడి ఇంట సందడి నెలకొంది. ఆదివారం ఢిల్లీలోని కేంద్రమంత్రి అధికారిక నివాసంలో ఆయన కుమారుడి బారసాల వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, మనోహర్ లాల్ ఖట్టర్, ప్రహ్లాద్ జోషి, శ్రీనివాస వర్మ, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్, రామ్మోహన్ బాబాయి మంత్రి అచ్చెన్నతోపాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

చిన్నారి వైద్యానికి

స్పందిస్తున్న దాతలు

» రూ.7 లక్షల వరకు అందిన సాయం

గార్లదిన్నె, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అరుదైన వ్యాధి బారిన పడి చికిత్స చేయించుకోలేని స్థితిలో ఉన్న అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కేశవాపురానికి చెందిన అక్షయ గ్రేస్ (12)కు పలువురు సాయం అందిస్తున్నారు. బాలిక పరిస్థితిపై 'పేదింటి చిన్నారికి అరుదైన వ్యాధి' శీర్షికన ఆదివారంనాడు 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంతో పలువురు ఆపన్న హస్తం అందిస్తున్నారు. చిన్నారి తండ్రి ఆంజనేయులుకు ఫోన్ చేసి, వ్యాధి వివరాలు తెలుసుకుంటున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.7 లక్షలు తమ ఖాతాల్లోకి జమ అయినట్టు చిన్నారి తండ్రి ఆంజనేయులు తెలిపారు. ఇందుకు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలియజేశారు.

15,340 కిలోల గంజాయి స్వాధీనం

గత ఏడాది జూలై నుంచి ఈ ఏడాది సెప్టెంబరు వరకూ అల్లూరి సీతారామరాజు జిల్లావ్యాప్తంగా 246 కేసులు నమోదు చేసి 15,340 కిలోల గంజాయి, 52 లీటర్ల గంజాయి లిక్విడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. 630 మందిని అరెస్టు చేశారు. అలాగే గంజాయి రవాణాకు వినియోగించిన 30 కార్లు, 140 బైక్‌లు, 32 ఆటోలు, 6 భారీ వాహనాలను సీజ్ చేశారు. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉంటూ తప్పించుకు తిరుగుతున్న 195 మందిని అరెస్టు చేశారు.

మత్తు వదిలింది



మన్యంలో ఒకప్పుడు పండిన శీలావతి రకం గంజాయి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. గిరిజన రైతులకు సిల్వర్ ఓక్, సీతాఫలం, జీడిమామిడి, అవకాడో, మెరింగా, డ్రాగన్ ఫ్రూట్, మామిడి వంటి మొక్కలు సుమారు 3,86,772 పంపిణీ చేశారు. వాటిని నాటుకుని పెంచుకునేందుకు జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిదినాలు కల్పిస్తున్నారు. మరోవైపు మైదాన ప్రాంతంలో గంజాయి రవాణాను కట్టడి చేయడానికి తనిఖీలు ముమ్మరం చేశారు.

ఐజీ నేతృత్వంలో ఈగల్

కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా గంజాయి కట్టడికి ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్)ను ఏర్పాటు చేసింది. ఐజీ ర్యాంకు అధికారి ఆకే రవికృష్ణ నేతృత్వంలో 459 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని వివిధ వింగ్‌ల నుంచి డిప్యూటేషన్‌పై అందులో నియమించింది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ ఈగల్ నార్కోటిక్ కేంద్రాలు ఏర్పాటు చేసి కార్యాచరణ మొదలు పెట్టింది. స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని గంజాయి సాగు, రవాణా కట్టడికి చర్యలు చేపట్టింది. ఐజీ రవికృష్ణ పలుమార్లు మన్యాన్ని సందర్శించారు. ఆయన స్వయంగా గంజాయి తోటలు దహనం చేసిన సందర్భాలున్నాయి. డ్రోన్లతో పాటు శాటిలైట్ ఇమేజ్ ద్వారా ఏవోబీ మొత్తాన్ని ఈగల్ డేగ కళ్లతో పర్యవేక్షిస్తోంది. దాదాపు 97 మంది స్మగ్లర్లు జైలుపాలయ్యారు. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి రాష్ట్రంలో గంజాయి సాగు జీరోకు తెచ్చేశామని పోలీసులు, ఈగల్ బృందాలు చెబుతున్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నేతృత్వంలో జరిగిన 12 రాష్ట్రాల ఏఎన్‌టీఎఫ్ సమన్వయ సమావేశంలో నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) శాటిలైట్ ద్వారా పరిశీలించి ఈ విషయాన్ని నిర్ధారించింది. ఇదే సమయంలో పొరుగున ఉన్న ఒడిశా రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగు చేస్తున్నారు. అక్కడ దాదాపు 5 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్టు అంచనా. అక్కడి నుంచి గంజాయిని ఆంధ్రప్రదేశ్ మీదుగా ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో గంజాయి పట్టుబడుతోంది.

ఒడిశా నుంచి రవాణా

ఒడిశా సరిహద్దు మండలాలైన జీకే వీధి, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు ప్రాంతాల ద్వారా అల్లూరి సీతారామరాజు జిల్లాలోకి అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు స్థానిక పోలీసులు, ఈగల్ బృందాల తనిఖీల్లో బయటపడింది. ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ అధికారులతో సమీక్షించి, మూలాల్లో నుంచి సమాచార సేకరణకు ఉపక్రమించారు. అరకు ప్రాంతంలో రాజస్థాన్‌కు చెందిన వ్యక్తుల స్వీటు షాపులు, తమిళనాడుకు చెందిన వారి హార్డ్‌వేర్ షాపుల్లో ఏదో తేడా జరుగుతోందని ఇద్దరు కానిస్టేబుళ్లు సమాచారం సేకరించారు. రోజుల తరబడి స్వీటు, హార్డ్‌వేర్ షాపులపై ఆయన నిఘా పెట్టించారు. అరకులో ఒక స్వీటు షాపు ముందు ఆగిన ఇన్నోవా కారు(ఆర్‌జే50 యూఏ4616)ను గుర్తించిన కానిస్టేబుల్ దానిపై ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అని ఉండటాన్ని గమనించారు. లోపల పోలీసు యూనిఫామ్ చూసి అనుమానం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఈగల్ బృందాలు ఆ కారును అనుసరించాయి. విజయనగరం మీదుగా వెళుతుండటంతో జొన్నాడ టోల్ ప్లాజా దగ్గర ఆపి తనిఖీ చేయాలని అక్కడి ఈగల్ బృందాలకు సమాచారం ఇచ్చారు. అక్కడ పోలీసులు ఆపగానే అనుమానం వచ్చిన కారు డ్రైవర్ వేగంగా పారిపోయాడు. కిర్లంపూడి పోలీసులు కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద బారికేడ్లతో ఆ కారును అడ్డుకున్నారు. డ్రైవర్ వేగంగా యూ టర్న్ తీసుకుని పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వెంబడించారు. ఆ సమయంలో ఒక సెల్‌ఫోన్, రెండు చాక్లెట్(కిట్ కిట్) కవర్లు కింద పడ్డాయి. మారుమూల ప్రాంతంలో కారు వదిలేసి అందులో ఉన్న మహిళతో సహా డ్రైవర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసిన కిర్లంపూడి పోలీసులు కారు నంబర్‌తో పాటు లభించిన సెల్ ఫోన్ నంబర్ ఆధారంగా డ్రైవర్‌ను రాజస్థాన్‌కు చెందిన శర్వన్‌లాల్ యాదవ్‌గా గుర్తించారు.

వరుస దాడులతో పరారు



గంజాయి మొక్కలను కత్తితో నరుకుతున్న ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ

ఈగల్ పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేయడంతో అప్పటికే అనకాపల్లి జిల్లాలో శర్వన్‌లాల్ యాదవ్‌పై రెండు కేసులు నమోదైనట్లు తేలింది. స్వీటు షాపు తనిఖీ చేయగా చాక్లెట్ కవర్లలో ప్యాక్ చేసిన గంజాయి వందల కిలోలు దొరికింది. ఒడిశాలోని కోరాపుట్ నుంచి గంజాయి తీసుకొచ్చిన స్మగ్లర్లు.. పోలీసులు, ఈగల్ బృందాలకు చిక్కకుండా ఉండేందుకు స్వీట్లు, చాక్లెట్ కవర్ల ప్యాకింగ్‌తో కొత్త ఎత్తుగడ వేస్తున్నట్లు తెలుసుకున్నారు. రాజస్థాన్, తమిళనాడుకు చెందిన స్మగ్లర్లు గంజాయి స్మగ్లింగ్‌కు అడ్డాగా అరకు ప్రాంతంలో స్వీటు షాపులు, ఐరన్ మార్ట్‌లు పెట్టుకున్నట్లు గుర్తించారు. ఆ రెండు రాష్ట్రాలకు చెందిన 265 మందికి పైగా స్వీటు, హార్డ్ వేర్ వ్యాపారులు(గంజాయి స్మగ్లర్లు) అల్లూరి జిల్లా వదిలి పరారయ్యారు. పోలీసుల వద్ద ఉన్న సమాచారం మేరకు తమిళనాడు, రాజస్థాన్‌తో పాటు 12రాష్ట్రాలకు చెందిన 350 మందికి పైగా స్మగ్లర్లు టీ కొట్లు, కిరాణా వ్యాపారాల పేరుతో మకాం వేయడంతో పాటు సీలేరు ప్రాంతంలో కూలీలుగానూ ఉండేవారు. స్మగ్లర్లలో అల్లూరి జిల్లాకు చెందినవారు కూడా కొందరు ఉన్నారు.

పోలీసు, ఈగల్ ఉమ్మడి చర్యలు: డీజీపీ



జి.మాడుగుల మండలం మారుమూల ప్రాంతాల్లో గంజాయిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

గంజాయి సాగు కట్టడికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని.. పోలీసు, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో ఈగల్ ప్రత్యేక ప్రణాళికతో ఉక్కుపాదం మోపుతోందని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. బస్తర్‌లో ఆపరేషన్ కగార్ విజయం సాధించే నాటికి ఏపీలో గంజాయి వాసన లేకుండా చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి ఏపీ మీదుగా గంజాయి సరఫరా అవుతోందని, పూర్తిగా కట్టడి చేసేందుకు ఒడిశాతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నట్లు చెప్పారు. స్మగ్లర్లపై ఎన్‌డీపీఎస్ కింద కేసులు నమోదు చేసి, ఆస్తులు జప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాదిలోనే 130 మందికి పైగా అరెస్టు చేశామని, కరుడు గట్టిన స్మగ్లర్లపై పీడీ యాక్టు నమోదు చేసినట్లు తెలిపారు. మత్తుకు అందరూ దూరంగా ఉండాలని, ఎటువంటి సమాచారం తెలిసినా పోలీసులకు చెప్పాలని డీజీపీ సూచించారు.

గూగుల్ డేటా సెంటర్‌పై

ప్రజలకు వాస్తవాలు చెప్పండి

» సీఎంకు సీపీఎం బహిరంగ లేఖ

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఏర్పాటుచేయనున్న గూగుల్ డేటా సెంటర్‌కు రాష్ట్రప్రభుత్వం ఇస్తున్న రాయితీలతోపాటు దానివల్ల భవిష్యత్తులో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం, ఉద్యోగ అవకాశాలు గురించి వాస్తవాలను ప్రజలకు వివరించాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు బహిరంగలేఖ రాశారు. విశాఖలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో లేఖను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...గూగుల్ డేటా సెంటర్ రాబోయే ఐదేళ్లలో రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టబోతున్నట్టు సీఎం వెల్లడించారని, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ 1.8 లక్షల ఉద్యోగ అవకాశాలు వస్తాయని ప్రకటించారని, అయితే కూటమిలో భాగస్వామ్య పార్టీగా ఉన్న బీజేపీ నేతలు అన్ని ఉద్యోగాలు రావని, పర్యావరణానికి నష్టం జరుగుతుందని చెబుతుండడం గందరగోళానికి గురిచేస్తోందని వ్యాఖ్యానించారు. గూగుల్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.22 వేల కోట్ల రాయితీలు ప్రకటించిందని, దీనివల్ల గూగుల్‌కు లాభాలు వస్తాయి తప్ప, రాష్ట్రప్రభుత్వానికి వచ్చే ఆదాయం ఏమిటో చెప్పడం లేదన్నారు. గూగుల్ డేటా సెంటర్‌కు రెండు వేల మెగావాట్ల విద్యుత్, రోజుకు 80 ఎంజీడీల నీళ్ల ఎక్కడి నుంచి వస్తాయో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రజలకు నష్టం జరగని విధంగా గూగుల్‌డేటా సెంటర్‌పై తుదినిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

కనురెప్పే కాటేసింది!

» కుమార్తెపై తండ్రి పలుమార్లు లైంగిక దాడి

» ప్రకాశం జిల్లా కొండపిలో అమానుష ఘటన

» తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు

కొండపి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కుమార్తెను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్నతండ్రే కాటేశాడు. మైనర్ అయిన ఆ బాలికపై వారం రోజులుగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ అమానుష ఘటన ప్రకాశం జిల్లా కొండపి మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన నిందితుడు తన 12 ఏళ్ల కుమార్తెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. కడుపు నొప్పితో బాధపడుతున్న కుమార్తెను తల్లి శనివారం ఒంగోలు రిమ్స్‌కు తీసుకెళ్లింది. అక్కడ పరీక్షించిన వైద్యులు.. ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు నిర్ధారించారు. తల్లి గట్టిగా ప్రశ్నించడంతో తండ్రే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు బాలిక చెప్పింది. దీంతో బాధితురాలి తల్లి ఆదివారం కొండపి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలికను తల్లి ఒంగోలు తీసుకెళ్లిన తర్వాత తండ్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడని సమాచారం.

ఇక ఆన్‌లైన్‌లో భూ వినియోగ మార్పు

45 రోజుల్లోపు అనుమతులిచ్చేలా ఆదేశాలు
ఒక్కో దరఖాస్తుకు రూ.10 వేల ఫీజు
ఎస్‌వోపీ విడుదల చేసిన మున్సిపల్‌శాఖ

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూ వినియోగ మార్పు(చేంజ్ ఆఫ్ లాండ్ యూజ్-సీఎల్‌యూ)లకు ఇకనుంచి ఆన్‌లైన్‌లో అనుమతి ఇవ్వనున్నారు. గతంలో ఉన్న సీఎల్‌యూ ప్రక్రియను రద్దు చేసిన మున్సిపల్ శాఖ.. ఇటీవల కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఆ మేరకు అసెంబ్లీలో చట్ట సవరణ కూడా చేశారు. వ్యాపార సౌలభ్యం కోసం ఈజీ ఆఫ్ డూయింగ్‌లో భాగంగా దీన్ని అమల్లోకి తెచ్చారు. వ్యక్తులు, రియల్ ఎస్టేట్ సంస్థలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు రూ.10 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఏపీ డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా దరఖాస్తు చేసిన 45 రోజుల్లోపు అనుమతులు ఇస్తారు. ఆ మేరకు మున్సిపల్‌శాఖ ప్రామాణిక కార్యాచరణ విధానం(ఎస్‌వోపీ) విడుదల చేసింది. డాక్యుమెంట్ అప్‌లోడ్, ఫీజు చెల్లింపులు, రియల్ టైం ట్రాకింగ్, ఈ-మెయిల్/ఎస్ఎంఎస్ అలర్ట్ సౌకర్యం కల్పించారు. గ్రామ, పట్టణ స్థానిక సంస్థలు దరఖాస్తుల పరిశీలన కోసం 3 రోజులు, పరిశీలించి డీటీసీపీకి పంపించేందుకు 3 రోజులు, డీటీసీపీ పరిశీలన, సూచనలకు 3 రోజులు, సీఎల్‌యూ సమావేశం నిర్వహణ 5 రోజులు, మంత్రి ఆమోదం కోసం 3 రోజులు, రాష్ట్ర గెజిట్‌లో అభ్యంతాల కోసం 18 రోజులు, అభ్యంతరాల సమీక్ష, సీఎల్‌యూ చార్జీల సేకరణ 5 రోజులు, ప్రభుత్వానికి డీటీసీపీ సిఫారసులకు 2 రోజులు, ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చేందుకు 3 రోజుల గడువును ఎస్‌వోపీలో ప్రకటించారు.

వృద్ధ దంపతుల బలవన్మరణం

» కొడుకుల ఆదరణ లేకపోవడంతోనే...

» కందుకూరులో ఘోరం

కందుకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఒకపక్క వయోభారం, అనారోగ్య సమస్యలు కుంగదీస్తుంటే...కొడుకులు ఉన్నా చూసే దిక్కులేకపోవడంతో విరక్తి చెంది వృద్ధ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం...నెల్లూరు జిల్లా కందుకూరులోని కోవూరు రోడ్డులో పువ్వాడి పున్నయ్య (81), రోశమ్మ(76) దంపతులు నివసిస్తున్నారు. ఆదివారం ఓఆర్ఎస్ పొట్లాలలో విష గుళికలు కలుపుకుని తాగారు. తాగిన కొద్దిసేపటికే భర్త ప్రాణాలు విడవగా, రోశమ్మను ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందారు.

అన్నంతపనీ చేశారు...

పున్నయ్య, రోశమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు కొన్నేళ్ల క్రితమే మృతిచెందాడు. మిగతా ఇద్దరూ కందుకూరులోనే ఉంటున్నారు. ఆస్తి పంపకాల విషయంలో కుమారుల మధ్య భేదాభిప్రాయాలు రావడంతో, తమను ఎవరూ ఆదరించకపోవడంతో ఇక తనువు చాలించాలన్న నిర్ణయానికి వారు వచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు. చుట్టుపక్కలవారితో 'ఎవరూ చూడకపోతే.. ఇంత విషం పుచ్చుకుని తనువు చాలిస్తాం'అని ఆ దంపతులు మాట్లాడుతుండేవారని అంటున్నారు.

రఘురామపై అనుచిత పోస్టులు

» వైసీపీ 'సోషల్' కార్యకర్త విజయ్ అరెస్టు

విజయవాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న అంబోజి విజయ్ అనే వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను పోలీసులు అరెస్టు చేశారు. అతడ్ని ఆదివారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. విజయ్‌ను ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం మల్కాపురం గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు.

కరూర్ దుర్ఘటనపై రంగంలోకి సీబీఐ

» సుప్రీం ఆదేశాలతో పూర్తిస్థాయి దర్యాప్తుపై దృష్టి

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాట కరూర్‌లో సినీ నటుడు, తమిళ వెట్రిగ కళగం (టీవీకే) అధిపతి విజయ్ రోడ్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతి చెందిన ఘటనపై దర్యాప్తు బాధ్యతలను స్వీకరించినట్లు సీబీఐ అధికారులు ఆదివారం తెలిపారు. దుర్ఘటన జరిగిన కరూర్ వేలుచ్చామిపురంలో సీబీఐ ప్రత్యేక బృందం ఇదివరకే పరిశీలన జరిపిందని పేర్కొన్నారు. ఈ దుర్ఘటనపై రాష్ట్ర పోలీసుల ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్)ను సీబీఐ మళ్లీ నమోదు చేసుకుని ఆ విషయాన్ని కరూర్ కోర్టుకు తెలియజేసినట్లు తెలిపారు. ఈ దుర్ఘటనపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ టీవీకే దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగిస్తూ ఉత్తర్వు జారీ చేసిన విషయం తెలిసిందే. అంతే కాకుండా సీబీఐ దర్యాప్తు తీరుతెన్నులను పర్యవేక్షించడానికి సుప్రీం మాజీ న్యాయమూర్తి అజయ్ రస్తోగి నేతృత్వంలో ఓ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఆ సందర్భంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జేకే మహేశ్వరి, ఎన్‌వీ అంజారియాతో కూడిన ధర్మాసనం.. కరూర్‌లో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసిందని వ్యాఖ్యానించింది. మృతుల కుటుంబాల ప్రాథమిక హక్కులను అమలు చేయడమే ప్రధానమని పేర్కొంది. పోలీసులు ఈ ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకోకుండా మీడియా ముందు వ్యాఖ్యలు చేశారని, అవి నిష్పాక్షిక దర్యాప్తునకు సంబంధించి ప్రజల మనస్సులో లేనిపోని అనుమానాలను రేకెత్తించవచ్చని అభిప్రాయపడింది. నిష్పాక్షిక దర్యాప్తు పౌరుడి ప్రధాన హక్కుగా పరిగణించే ఈ కేసు దర్యాప్తునకు తగు ప్రాధాన్యతనిచ్చినట్లు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

మహిళపై మరో మహిళ దాష్టీకం

» వివస్త్రను చేసి చిత్రహింసలు.. వీడియో వైరల్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఓ మహిళపై మరో మహిళ దాష్టీకం ప్రదర్శించింది. పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా రావినూతల గ్రామానికి చెందిన లక్ష్మీచౌదరి, ఒంగోలు రంగుతోటకు చెందిన పూజిత నగరంలోని ఒక క్యాటరింగ్ సెంటర్‌లో పనిచేస్తుంటారు. ఇద్దరూ ఆటో డ్రైవర్ అయిన సుభాని అనే వ్యక్తిని ఇష్టపడ్డారు. అతను ఓ కేసులో ఒంగోలులోని జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. ఆయన్ను లక్ష్మీచౌదరి అప్పుడప్పుడూ వెళ్లి కలిసి వస్తోంది. దీన్ని చూసి ఓర్వలేని పూజిత ఆమెతో పలుమార్లు గొడవకు దిగింది. అయితే లక్ష్మిలో ఎలాంటి మార్పూ కన్పించలేదు. దీంతో తనతో క్యాటరింగ్ పనిచేసే చక్రి, నాని, వినయ్‌తో కలిసి ఆమెను పిలిపించి మిరియాలపాలెం వద్ద ఓ ఇంట్లో బంధించింది. అందరూ కలిసి ఆమెను వివస్త్రను చేసి చిత్రహింసలకు గురిచేశారు. విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ దాష్టీకాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. స్నేహితురాలి సాయంతో బయటపడిన లక్ష్మి ఒంగోలు టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఆమెను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

కొడుకు కాదు క్రూరుడు!

» ఆస్తికోసం తండ్రిని, మారు తల్లిని కడతేర్చాడు

» ఆన్‌లైన్ గేమ్స్ ఆడి అప్పులపాలు.. డబ్బులు ఇవ్వనందుకు దురాగతం

» పోలీసుల అదుపులో నిందితుడు.. జమ్మలమడుగులో దారుణం



నాగప్ప, పెద్దక్క (ఫైల్)

ప్రొద్దుటూరు/జమ్మలమడుగు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్ ఆడి అప్పుల పాలై.. వాటిని తీర్చడానికి ఆస్తి అమ్మి డబ్బులు ఇవ్వలేదన్న కక్షతో కన్నతండ్రిపైనే కక్ష పెంచుకున్నాడు ఓ ఉన్మాది. తండ్రితోపాటు.. సహజీవనం చేస్తున్న మారుతల్లిని కూడా క్రూరంగా హతమార్చాడు. కడప జిల్లా జమ్మలమడుగులో శనివారం రాత్రి ఈ దారుణం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు.. జమ్మలమడుగు మండలం మోరగూడి గ్రామంలో సిమెంటు ఇటుకల బట్టీలో శనివారం రాత్రి షెడ్డు కింద కూడేటి నాగప్ప (63), పాముల పెద్దక్క (48) దంపతులు హత్యకు గురయ్యారు. వారు మంచంపై నిద్రిస్తున్న సమయంలో చిన్నకొడుకే తలలపై కర్రతో బలంగా మోది దారుణంగా హత్య చేసినట్లు పెద్ద కొడుకు పెద్ద వెంకటేశ్ సైతం చెబుతున్నారు.

కొన్నేళ్లుగా విడిగా జీవిస్తున్న నాగప్ప

నాగప్ప పాతికేళ్లుగా పాముల పెద్దక్కతో కలిసి సహజీవనం చేస్తూ మోరగుడిలో ఇటుకల బట్టీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మొదటి భార్య ఓబులమ్మకు పెద్ద వెంకటేశ్, చిన్న వెంకటేశ్ ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఇరువురికీ వివాహాలై వేర్వేరుగా ఉంటున్నారు. నాగప్పకు జమ్మలమడుగులో నాలుగు సొంతిళ్లు, స్థలాలు ఉన్నాయి. చిన్న కుమారుడు వెంకటేశ్ ఒక ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తూ ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి రూ.22 లక్షల మేర అప్పులు చేశాడని చెబుతున్నారు. అప్పులు తీర్చడానికి రెండు కోట్ల విలువైన 8 సెంట్ల స్థలం అమ్మి డబ్బులు ఇవ్వాలని తండ్రితో ఘర్షణ పడేవాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఈ హత్య జరిగింది. దంపతులు హత్యకు గురైన సమాచారం తెలియడంతో పెద్దకొడుకు సహా బంధువులు, గ్రామస్థులు ఘటనా స్థలం వద్ద రాగా, చిన్నకొడుకు మాత్ర రాలేదు. దీంతో పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించ గా.. తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రకృతి ఒడిలో పరుగు..!

ఆహ్లాదకర వాతావరణంలో 'హ్యాపీ ఫారెస్ట్ రన్'


» మూలపాడు వద్ద 16కే, 8కే విభాగాల్లో నిర్వహణ

» పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఉత్సాహంగా పరుగు



పరుగు ప్రారంభం

విజయవాడ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉరుకుల పరుగుల జీవితం.. వాయు, శబ్ద కాలుష్యంతో సహజీవనం కారణంగా తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఈ రోజుల్లో కాంక్రీట్ జంగిల్ లాంటి నగరాలకు దూరంగా.. ప్రశాంతమైన ప్రకృతికి దగ్గరగా.. ఒక్కరోజైనా గడపాలని ప్రతి ఒక్కరికీ అనిపిస్తుంది..! ట్రైమెట్రిక్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'హ్యాపీ ఫారెస్ట్ రన్' అలాంటి మధురానుభూతినే అందించింది. విజయవాడ నగరానికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న మూలపాడు బటర్‌ఫ్లై పార్క్ వద్ద ఈ ట్రయల్ రన్‌ను నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు కొండ కోనల్లో ప్రశాంత వాతావరణంలో సాగిన ఈ రన్‌కు స్పందన లభించింది. 16కే, 8కే విభాగాల్లో సాగిన ఈ రన్‌లో వివిధ ప్రాంతాల నుంచి 160 మందికిపైగా ఔత్సాహికులు పాల్గొన్నారు. మూలపాడులోని కనువిందు చేసే బటర్‌ఫ్లై పార్క్‌లో సాగిన ఈ పరుగులో చిన్నారులు, యువకులు, గృహిణులు, వృద్ధులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పచ్చని చెట్ల మధ్య సాగుతూ, మట్టి రోడ్లపై నడుస్తూ, చిన్నిచిన్న మడుగులు దాటుకుంటూ ముందుకు కదిలారు. పక్షుల కిలకిలరావాలు, అందమైన పూల సువాసనలు, సెలయేటి సవ్వడులు, సీతాకోక చిలుకల సోయగాలను ఆస్వాదిస్తూ.. పచ్చదనం నిండిన ప్రకృతిలో స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటూ... హ్యాపీ ఫారెస్ట్ రన్‌ను ఎంచక్కా ఆస్వాదించారు. పరుగు దిగ్విజయంగా ముగించాక మెడల్ అందుకొని హ్యాపీగా తిరుగు ప్రయాణమయ్యారు.





పరుగు ముగించిన ఆనందం

తిరుమలలో తొమ్మిది నెలలకు సరిపడా నీరు

తిరుమల: తిరుమలలోని ఐదు జలాశయాల్లో తొమ్మిది నుంచి పది నెలలకు సరిపడా నీరు వచ్చిందని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఆదివారం పాపవినాశనం డ్యాం వద్ద అర్చకులు నిర్వహించిన గంగపూజలో ఆయనపాల్గొన్నారు. జలాశయాలు దాదాపు 95 శాతం నిండిపోవడం సంతోషంగా ఉందన్నారు.

వాహనాలు అమ్మకము

Vehicle No.	Make & Model	Year
AP16TC0929	LPT 3118 CUMMINS FBT	2018
AP16TH5297	TATA LPK 2518 FBT	2016
AP16TJ6486	TATA LPK 2518 FBT	2016
AP15TA5042	TATA LPK 2518 FBT	2010
AP31TB1699	TATA LPK 2518 FBT	2011

AUCTION PLACE :
SHRIRAM AUTO MALL INDIA LTD., SURVEY NO. 79, MUSTABAD ROAD, KESARAPALLI - 521 102. GANNAVARAM MANDAL, KRISHNA DISTRICT, AP
AUCTION DATE: 27-10-2025
AUCTION START AT 10 AM
Cont : SHRIRAM FINANCE LIMITED
D No:- 27-12-34, BSN REDDY COMPLEX, 3rd Floor, Gudavallivari Street, VIJAYAWADA. Ph: 0866-2579197
9949911574, 9704184786



ఈ రాత్రికి నది చెప్పే కథ విందామా?

సుదీర్ఘ ఎడబాటు తర్వాత నదిని కలిశాను..
కలసినప్పుడల్లా కాళ్ళను చుట్టుకుని
చల్లని ప్రేమై ముంచెత్తేది
నేను తనలోకి తను నాలోకి
ప్రవాహం అయ్యేవాళ్ళము

ఉరిమే ఉత్సాహమై
ఊళ్లను చుట్టేసిన నది
అడవిలో కాసే వెన్నెలను
వెన్నెల్లో విప్పారిన మనుషులను
తనలో నింపుకున్న నది
ఊటలై ఉరకలేసి
అడవిని చైతన్యపరిచిన నది

ప్రవాహాన్ని వేటాడిన వేటగాడి దాడికి గురై
గాయాల నడకలో ఒంటరి పాయగా
నా వైపు చూడకుండానే
దుఃఖ ప్రయాణంలో ఉన్నది

ఎడారి చేసిన గాయాలతో నేను
అడవిని తగలేసి తనలో కలిపిన
కమురువాసనతో నది
పరస్పరం కౌగిలించుకున్నాము

నది మౌనరోదన నా చెవుల్లోకి పారుతున్నది
తన కోసమే ప్రవహిస్తున్నా..

తను ఎవరో తెలియని ఈ ప్రపంచానికి
నది ఏదో చెప్పాలనుకొంటున్నది

తనకే ప్రవాహం నేర్పిన అడవి చైతన్యం గురించో
పొద్దుపొడుపు మీది ఆశతో
అనంత ప్రయాణాన్ని ప్రకటించుకున్న
వీరుల గురించో
నది ఏదో చెప్పాలనుకుంటున్నది

మీరు చూడని మీకు తెలియని
అనేక కథలు నింపుకొని ఉన్నాను
ఈ దిగ్మండలాన్ని వెలిగించే
మరుగునపడ్డ సూర్యుళ్ల కథలను దాచుకొని ఉన్నాను

నువ్వు, నీతో పాటుగా ఉన్న ఈ ప్రపంచం
నా కథ వింటారా?
ఈ రాత్రికి నా కథ చెప్పాలి
నది తెలియని ప్రపంచానికి
ప్రవాహం తెలియని అమాయకులకు
నా కథ చెప్పాలి
చివరి పొద్దు వెలుగుతున్నప్పుడే
పసికందు కళ్ళు తెరుచుకునే తొలి వెలుగులోనే
నా కథ చెప్పాలి

నేనింకా ఆగిపోలేదని..
అనేక పాయలతో ప్రవహించడానికి సిద్ధపడ్డానని

నేను చెప్పబోయే నా అనుభవాల కథ వింటారా?

ఈ రాత్రికే..
ఈ రాత్రికే..
కాలాన్ని మరిచి నిద్రించే మీ అచేతన సమయాల్లో
నా కథ చెపుతాను
కాలము, నేను, మీరు వేరు కాదని
మీరు గ్రహించే వరకు నా కథ చెపుతాను

మరి.. ఈ రాత్రికి నది చెప్పే కథ విందామా?


■ చెమన్
✆ 9440385563

వివిధ
vividha@andhrajyothy.com సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

కళింగాంధ్ర నేల సారంతో రామకృష్ణకవి 'నలచరిత్ర'

దార్శనికుడు గురజాడ, గిడుగు, శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణ బాబు, తాతాజీ, ఆరుద్ర, చాసో, రావిశాస్త్రి, కారా లాంటి ఉద్ధండుల్ని కళింగాంధ్ర సాహిత్యం అందించింది. వీరు ఆధునిక సాహిత్యస్రష్టలు. అనేక ప్రక్రియలకు ఆదిగురువులు. కాగా ఇక్కడే మూడువందలయేళ్ళ క్రిందట పుట్టిన బెహరా రామకృష్ణ వెయ్యేళ్ళ పద్య కవులెవరికీ తీసిపోని విధంగా, నల చరిత్రను కమనీయ ప్రబంధంగా మృదుమధురంగా రచించ డాన్ని ఇక్కడి మట్టిసారంగా భావించవచ్చు.

బెహరావారు శ్రీకాకుళం జిల్లాకేంద్రానికి సమీపంలోని బొంతలకోడూరు మిరాసీదార్లు. కటకం గజపతుల ఆదరణతో వారితోపాటు పఠననాయకులుగా వచ్చి ఈ ప్రాంతంలో స్థిరపడ్డారు. పట్నాయకులుగా, శిష్టు కరణాలుగా పిలవబడుతున్నారు. నలచరిత్రలో ఈయన వాడిన లాంతరు, ముక్కాలు వంటి పదాలవలన ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో జీవించాడని విమర్శకులు అభిప్రాయపడుతు న్నారు. అందుచేత క్రీ.శ.1800లకు ముందే ఈ గ్రంథాన్ని రాశాడని చెప్పవచ్చు.



గతంలో సంస్కృతాంధ్ర సాహిత్యాల్లో వచ్చిన నల చరిత్రలను బెహరా రామకృష్ణకవి చదివే ఉంటారు. ఈ గ్రంథంలో నన్నయ నుండి చేమ కూర వరకూ తారసపడుతున్న పద్యసరళులు ఈ విషయాన్నే చెబుతున్నాయి. గ్రంథాన్ని పరిపుష్టం చేయడా నికి నలుడి వేట ఘట్టంతోపాటు మరికొన్ని కల్పనలు, తదితర వర్ణనలను కథానుకూలంగా మూలానికి జోడించారు. మూత్ర విసర్జన తరువాత కాళ్ళు కడుక్కోకుండా సంధ్యావందనం చేయడం వల్ల నలుని శరీరంలోకి శని ప్రవేశించాడని నన్నయాదులు రాశారు. నలుడు వంటి నిష్ఠాగరిష్ఠునికి అలాంటి నైచ్యాన్ని అంటగట్టడం సరికాదని భావించి, "ఒగిఁ బదమున సూచికమోపఁగలట్టి ప్రదేశమపు డపరిశుద్ధత నుండఁగ సంధ్యోపాసన"– అని సవరించాడితడు. నలుడు కాళ్ళు కడుక్కున్నప్పుడు సూదిమోపినంత చోటు తడవ కుండా ఉండిపోయిందట. దానిలోంచి శని లోపలికి ప్రవేశిం చాడని మార్చి, కథను ఔచిత్యవంతం చేశారు. 1511 పద్యగ ద్యాలతో ఈ ప్రబంధాన్ని రచించారు రామకృష్ణకవి. నగర, ఋతు, పుష్పాపచయ, సూర్యోదయ, సూర్యా స్తమయాది అష్టాదశ వర్ణనలలో ఒకటి రెండు తప్ప అన్ని రకాల వర్ణనలూ హృదయాహ్లా దంగా రచించారు రామకృష్ణకవి.

"వనరమాయువతి పుష్పవతి యయ్యె" – ఈ పాదంలో శ్లేష ఉంది. తోటంతా పుష్పిం చింది అని ఒక అర్థం, పుష్పించడంవల్ల వన లక్ష్మి ఈడేరిందని వేరే అర్థం స్ఫురిస్తోంది కదూ! కనకకారవృత్తిని వాడుకుంటూ ఇంకొక అద్భుత వర్ణన. "కరగిన పూదెఁ దాఁ గనకకారుఁడు నీటనుముంచు మాడ్కి భాస్కరుఁ డపరాబ్ధి లోనఁ దిగఁజారెఁ"–. నలుడి వేటవర్ణనలో సాయంసంధ్యను వర్ణిస్తున్నాడు. కరిగించిన బంగారుముద్దను స్వర్ణకారుడు నీటిలోముంచుతున్నాడా అన్నట్టు సాయంసం ధ్యావేళ సూర్యుడు పశ్చిమసముద్రంలో మునిగిపోతున్నాడట. ఉత్ప్రేక్ష ఎంత అద్భుతమో అంత రమణీయం.

ఏ గ్రంథంలోనైనా రచయిత అస్తిత్వం ఎక్కడో ఓచోట పట్టు బడుతుంది. బెహరావారు గ్రీష్మఋతు వర్ణనలో "గావిరి యీవలి గలియఁగ్రమ్మె" అని రాశారు. ఈ సీసపద్య చివరిదళా నికి 'నల్లని వేడిపొగలు అంతటా కమ్మాయి' అని అర్థం.



ఈ పాదంలో ఈవలి అని ఉంది. వేసవి వేడి వేళ కలిగే దాహాన్నే ఈవలి, ఈష్ట అని కళింగాంధ్రలో అంటారు. దాహం వేస్తుంది అనడానికి ఈవలేస్తుంది, ఈష్టగా ఉంది అని వాడు తారు. బలహీనుడిమీద కోపంవస్తే 'కొంకులిరగ్గొట్టి గల్ను' అని ఇక్కడివారి వాడుక. ఈ గ్రంథంలో నలుడి వేటవర్ణనలో రెండుసార్లు కొంకులు పదాన్ని వరసపద్యాలలో వాడారు కవి. "నడుములు దును మాడి తొడలుచెండాడి కొంకులుదెగ వ్రేసి చెంపలనుగోసి... అత్తటి ముక్కులు చెక్కులు కుత్తుక లంసములు తలలు కొంకు లురములున్". ముంగాలి ఎముకల్నే కళింగాంధ్రులు కొంకులని అంటారు. పెళ్ళికి వచ్చిన బంధువులు వధూవరు లకు ఈడు చదివించడం ఈ ప్రాంతంలో నేటికీ ఉంది. దీనినే బెహరావారు "వీడు/ చెలగి చదివించిరి వధూవరులకు నపుడు" అని ఒక పద్యంలో రాశారు. వీడు అంటే కట్నం.

> **ఏ గ్రంథంలోనైనా రచయిత అస్తిత్వం ఎక్కడో ఓచోట పట్టుబడుతుంది. బెహరావారు గ్రీష్మ ఋతు వర్ణనలో "గావిరి యీవలి గలియఁగ్రమ్మె" అని రాశారు. ఈ సీసపద్య చివరిదళానికి 'నల్లని వేడిపొగలు అంతటా కమ్మాయి' అని అర్థం. ఈ పాదంలో ఈవలి అని ఉంది. వేసవి వేడి వేళ కలిగే దాహాన్నే ఈవలి, ఈష్ట అని కళింగాంధ్రలో అంటారు. దాహం వేస్తుంది అనడానికి ఈవలేస్తుంది, ఈష్టగా ఉంది అని వాడుతారు.**

అందమైన వర్ణనలూ, అలంకారాలతోపాటు, వారి శబ్ద చమత్కారమూ ఉంది. "ఈయదు తనభావము చనవీయదు సఖులకును గోర్కులీయదు శుకి కం/ దీయదు ఫలములు తన పొందీయదు కేకులకుఁ జేరనీయదు గోరన్". ఇలా శబ్దిస్తూ, పద్యాలను జవనాశ్వాల్లా పరుగెత్తిం చడం ఈ కవికి వెన్నతోపెట్టిన విద్య. ఇలాంటి లయవిన్యా సమే ఈతని వచనరచనలోనూ గమనిస్తాం: "పుష్కరువలను నక్షంబులు పక్షంబులై యుండుటయు, నిజాధ్యక్షుని పక్షం బున విపక్షంబు లగుటయు, సమక్షంబునన్ బరీక్షించి".

గ్రంథం అంతటా అలంకారాలను విరివిగా వెదజల్లినా ఎక్కడా వ్యర్థపదాలుగానీ, ఊతపదాలుగాని తారసపడవు. అందుచేతనే బెహరా రామకృష్ణకవి 'నలచరిత్ర' మధుర ప్రబంధం. ఈ గ్రంథానికి సాహిత్యచరిత్రలలో తగు స్థానం లభించలేదు. 1933లో చివరిసారిగా ముద్రించారు. ఇన్ని ప్రత్యేకతలుగల గ్రంథం ఇటీవల పునర్ముద్రణ పొందిన విష యాన్ని సాహిత్యలోకానికి తెలియజేయాలనే ఈ ప్రయత్నం.

■ గార రంగనాథం
✆ 98857 58123

ఇలాంటివి అనువదించటమంటే ఇంగ్లీష్ ప్రపంచాన్ని కల్లోలపరచడమే!

తెలుగులో కథలు ఎప్పుడూ సమకాలీన వస్తువును ఎంచు కోవడంలోనూ, సామాజికాంశాలను ప్రస్తావించడంలోనూ, శిల్ప వైవిధ్యాన్ని ప్రదర్శించడంలోనూ ముందున్నాయి. కానీ వాటిని తెలుగు నేలను దాటించి, ఇతర భాషల పాఠకులకి చేరవేయటంలో మనం అంతగా విజయం సాధించలేదు.



ఈ నేపథ్యంలో అఫ్సర్ కథా సంకలనం 'సాహిల్ వస్తాడు' ఇంగ్లీష్‌లోకి 'Sahil will come'గా అనువాదం కావటం, ఓరియంట్ బ్లాక్‌స్వాన్ లాంటి ప్రముఖ పబ్లిషింగ్ హౌస్ ద్వారా విడుదల కావటం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా పుస్తకం అనువాదకులు **అల్లాడి ఉమ, యం. శ్రీధర్** లతో జరిపిన సంభాషణ ఇది.

అఫ్సర్ 'సాహిల్ వస్తాడు' పుస్తకాన్ని అనువాదానికి ఎన్నుకోడానికి ప్రేరేపించిన అంశాలేమిటి?


ఇందులోని కథలు చాలావరకు ముస్లిం జీవితాల గురించి మనకు ఉన్న మూస భావనలకు భిన్నంగా ఉన్నాయి. అవి కేవలం గ్రామీణ జీవితాలకో లేదా నగర జీవితాలకో మాత్రమే పరిమితం కాలేదు. ఒక తరం వాళ్ళకి మాత్రమే సంబంధించిన కథలు కాదు. ముందుగా నిర్ణయించుకున్న భావజాలానికి మాత్రమే ఒదిగి ఉండే కథలు కాదు. ఈ లక్ష ణాలు మమ్మల్ని ఆకట్టుకున్నాయి. ఉదాహరణకు ఏ మతా నికి చెందిన మూఢత్వాన్నయినా వ్యతిరేకించడం ఈ పుస్త కంలో ప్రత్యేకంగా కనపడుతుంది. ఇవన్నీ కాక, 1980ల తర్వాత తెలుగు సాహిత్యాన్ని కుదిపేసిన స్త్రీవాద, దళిత/ బహుజన, మైనారిటీ, ఇతర అస్తిత్వ వాదాలు లేవనెత్తిన ఎన్నో ప్రశ్నలను ఈ కథలు స్పృశించడం మాకు నచ్చింది.

ఈ కథల్లో సాంస్కృతిక అంశాలు, కుల మత ప్రస్తావ నలు చాలా ఉన్నాయి. ఆ భావాలకు ఆంగ్లంలో సమా నార్థకాలు లేకపోయినా అంతర్జాతీయ పాఠకులకు అర్థమయ్యేలా అనువాదం ఎలా చెయ్యగలిగారు?

సంస్కృతి, కుల మతాలకు సంబంధించిన ప్రత్యేకతలు ఏ ఒక్క భాషకో పరిమితం కాదు. అయినా ఇలాంటి అంశాలు అనువదించటంలో కొంత సమస్య ఉంటుంది. ఇక్కడ అఫ్సర్ విషయంలో మనం గుర్తించవలసింది– తాను ముస్లిం అయినప్పటికీ ప్రధానంగా హిందూ పాఠకులను ఉద్దేశించే రాస్తుండడం. అందుకే అఫ్సర్ కూడా తన పాఠకులకులందరికీ ఆ సాంస్కృతికాంశాలు అర్థమయ్యేలా ఫుట్‌నోట్స్ వాడారు. మేము కూడా అదే పద్ధతి పాటించాం.

ఇలాంటి ప్రత్యేక అనుభవాలను చదివిన ఆంగ్ల పాఠ కులకు ఎలాంటి అనుభూతి కలుగుతుందని భావిస్తు న్నారు?

అఫ్సర్ లాంటి ఒక ప్రత్యేక సాంస్కృతిక నేపథ్యానికి చెందిన రచయితను ఇంగ్లీష్‌లోకి అనువాదానికి ఎంపిక చేసుకోడమంటే ఇంగ్లీష్ ప్రపంచాన్ని కల్లోలపరచడమే. ఇలాంటి బాధ్యత చాలా బరువైనదే. అంతర్జాతీయ స్థాయిలో యుద్ధ పోరాటాలు చేస్తున్న వివిధ జాతుల, మతాల మధ్య నెలకొన్న రాజకీయ వాతావరణంలోకి మన భాషలలో జరు గుతున్న చర్చలను చొప్పించడమే ఇలాంటి అనువాదాలు చేసే పని.



భారత ప్రాంతీయ భాషల నుంచి ఆంగ్లంలోకి సాహి త్యాన్ని అనువాదం చేయడం గురించి మీ దృక్పథం ఏమిటి? ఇలాంటి అనువాదాల విజయానికి మీ దృష్టిలో గీటు రాయి ఏమిటి?

తెలుగు కానీ, మరే ఇతర భారతీయ భాష కానీ 'ప్రాంతీయ' భాష కాదు. జాతీయ, అంతర్జాతీయ అంశా లను చర్చించే ఏ భాషైనా ప్రాంతీయమెలా అవుతుంది? సాహిత్య అనువాదాలు మూల రచనల నైసర్గిక, సాంస్కృ తిక, శైలీ సంబంధమైన ప్రత్యేకతలను ప్రతిబింబించాలి. అలాంటి ప్రత్యేకతలను ఇంగ్లీష్ అనువాదం ఏ మేరకు తీసు కెళ్లగలిగిందీ, పాఠకులను ఎంతమేరకు ప్రభావితం చేయగ లిగింది అనేది ఆ అనువాదం సాధించిన విజయంగా భావించవచ్చు.

ఇంటర్వ్యూ ■ అరిపిరాల సత్యప్రసాద్

చకితం!

మూడ్ అనేది చిన్నమాట
ఇదొక తుఫాను!

గొప్ప కవిత చదివితే
అది గడ్డపారగా మారి
నిన్ను తవ్వితవ్వి పొయ్యాలి
నీలోంచి ఆవిరి జ్వాలలు ఎగయాలి.

ఇవాళ
నాయింటి ముందు
నేనే పచారులు చేస్తున్నాను
లోపలి ఆలోచనలు
బయటి కెగిరిపోకుండా
కాపలా కాస్తున్నాను.

జీవితం ఒక జ్ఞాపకాల పెట్టె
బాధల ఖజానా
నిశ్శబ్దానికి
కొత్తనోరు మొలుస్తున్న భావన
ప్రతి కవితా
అనుభవాల విముక్తికి దీవెన.

జీవితంలో సింహభాగం
ఆభాసమే
షుగర్ ఫ్రీ లాగ
అసలు రుచి కోసమే తండ్లాట!

పడుకునేటప్పుడు
పుస్తకం తలాపున పెట్టుకునేవాడిని
తెల్లారగట్ల
దిండులోంచి ఏవో మాటలు వినపడేవి.
కలవరిస్తుంటే
వీనికి పిచ్చిమళ్లీ మొదలైంది అనేది మా అమ్మ.

నిజంగా
అలాంటి మానసికస్థితే
ఇవాళ కలిగింది
అహంకార రాహిత్యమే కవిత్వమని తెలిసింది.

■ ఎన్. గోపి





కొంటపోతే...

తొమ్మిది పదులు దాటిన పండు ముదితల
సంభాషణల సారం వినడమొక కవి సమయమే
జీవన గీతికల చివరి చేరికల వలయాలు

+++

"నన్నింక ఎందుకు ఉంచుతండో
మీది మొకాన కొంటపోక

జల్ది తీసుకపొమ్మని మొక్కుతన్న
భూమీ్మద ఇంక ఎందుకు ఉండుడు

నడువస్తలేదు, కూసోవస్తలేదు
లేశి నిలవడ శాత కాదు

ఆరు నెల్ల సంది అన్నీ మంచంలనే
నిద్ర పట్టది, పెయ్యి తిరుగుతది

ఆస్తులెన్ని ఉన్నా, అన్ని అవస్థలేనే
కొసాకరుకు ఏవీ అక్కరకు రావు

ఎవ్వలున్నా వెంట దుఃఖమే ఉన్నట్టు
ఎల్లిపోతేనే పాణానికి సుఖం

కండ్లు పురాగ మస్క మస్క
ఎవ్వలను ఏర్పాటు చెయ్యరాదు

మాటలతోనే జర ఎరుక పడుత
ముచ్చట పెట్టేటోళ్లు ఎవ్వలు రారు

కాళ్లు రెక్కలు గుంజుక పోవుడు
తలకాయ గిర గిర తింపుడు

దూప అయితది, తాగబుద్ధి కాదు
మెతుకు ముట్టక వారం దాటింది

గిన్ని ఏండ్లు బతుకుడు ఎందుకే
బతుకు యాష్టనే వస్తుంది చెల్లె!

గా దేవుడు కొంటపోతే బాగుండు
జీవునం ఉన్నట్టే గని లేనట్టే లెక్క.

ఎండిపోయి బొక్కలు తెల్లగ తేలినయి
ఎల్లెం కొంటపోతేనే బాగుండు గదా!
తీసుకపోవాల్నని చూస్తున్నవ్వ"

+++

చెట్టు మీద బుర్ర పండిన పండు నేలరాలి
విత్తనమయ్యే తాదాత్మ్యతనే వృద్ధాప్యం
పరిపక్వత చెందడం దేహ జీవ సూత్రం.


■ అన్నవరం దేవేందర్
✆ 94407 63479

ఆ లేఖల్ని ఇప్పటికీ తీసి చదువుకుంటాను!

నా మొదటి పుస్తకం

దర్భశయనం శ్రీనివాసాచార్య

1974లో తొమ్మిదవ తరగతిలో రాసిన తొలి కవితతో నా సాహిత్య ప్రయాణం మొదలయింది. 1984లో కలకత్తాలో బ్యాంకు ఉద్యోగంలో చేరినప్పటి నుంచి నా అధ్యయనమూ సృజనా వేగవంతమవుతూ వచ్చాయి. 1987లో గుంటూరులో పని చేస్తున్నపుడు ఒక రోజు 'నవోదయం' అనే సాహిత్య పత్రికలో ఒక పురస్కార ప్రకటన చూసాను. కవుల నుంచి అముద్రిత కవితా సంపుటాలను ఆహ్వానిస్తూ, ఉత్తమ కవితా సంపుటికి 'గ.న.రా' పేరిట సాహిత్య పురస్కారాన్ని ఇస్తా మని, ఎంపికైన సంపుటిని తామే ప్రచురిస్తామని చెబుతూ జి.వి.బి. నరసింహారావు అనే తెలుగు టీచర్ ఇచ్చిన ప్రకటన అది. ఆయన మరెవరో కాదు, ఆ తర్వాతికాలంలో మహాసహస్రావధానిగా ప్రసిద్ధుడు గరికపాటి నరసింహారావు.



1974 నుంచి 1981 వరకు నేను రాసిన దాదాపు వంద కవితలను పూర్తిగా పక్కకు పెట్టి, 1982 నుంచి 1987 వరకు రాసిన వంద కవితల నుంచి నాకు నాణ్యంగా అనిపించిన 28 కవితలను ఎంపిక చేసుకుని సంపుటిగా కూర్చి 'రాబందుల రెక్కల చప్పుడు' అనే టైటిల్‌తో 'గ.న.రా. సాహిత్య పురస్కారం' కోసం పంపాను. నా సంపుటి అవార్డుకు ఎంపికైందని తెలిసి చాలా సంతోషించాను.

సంపుటిలోని కవితల సారంతో అన్వయంగా వుండాలని కవితా సంపుటి టైటిల్‌ను 'జీవన వీచిక'గా మార్చాను.

ముందుమాట రాయమని కళావేత్త సంజీవదేవ్‌ను కోరాను. ఆయన అందమైన కాగితం మీద అందమైన చేతి రాతతో 'ధ్వని' శీర్షికతో ముందుమాటను రాసి పంపారు. కొల్లూరు వెంకట్ అనే సాహిత్య మిత్రుడు అందించిన కవర్ పేజీ బొమ్మ నాకు బాగా నచ్చింది. ముఖ్యంగా అందులోని కన్ను. పుస్తకాన్ని మా అమ్మకూ నాయినకూ అంకితమిచ్చాను. నరసింహారావు గారి కోరిక మేరకు గుంటూరులోనే 'శంకర్ ప్రింటర్స్'లో పుస్తకాన్ని ముద్రణకు ఇచ్చాను. ప్రూఫ్ రీడింగ్ పనిని నేనే చూసుకున్నాను. 500 ప్రతులకు అయిన రూ.1800 ప్రింటింగ్ ఖర్చును పురస్కార ప్రదాత ప్రెస్సుకు చెల్లించారు. పుస్తకం ధర అయిదు రూపాయలు. ప్రెస్ నుంచి వచ్చిన పుస్తకాన్ని చూడగానే నేను అనిర్వచనీయ ఆనందోద్వేగాన్ని పొందాను.

తెనాలిలో 'చైతన్య కళా స్రవంతి' సంస్థ నిర్వహణలో 1988 జనవరి 10న పుస్తకావిష్కరణ జరిగింది. సంజీవ దేవ్ పుస్తకాన్ని ఆవిష్కరించి లలితంగా ప్రసంగించారు. పాపినేని శివశంకర్, హితశ్రీ, పురస్కార న్యాయ నిర్ణేత తమ్మా సత్యనారాయణ పుస్తకం గురించి వివరంగా ప్రసంగించారు. పురస్కారం గురించీ పుస్తకం గురించీ నరసింహారావు ఎంతో నమ్రతతో మాట్లాడారు. నా సంపుటి లోని 'రాబందుల రెక్కల చప్పుడు' అనే కవితను గాయకుడు సాంబశివరావు సభలో అర్థవంతంగా పాడాడు.



'జీవన వీచిక' సంపుటిని మిత్రు లకూ, ప్రసిద్ధ కవులకూ పంపాను. "హరితం మీ కవితల్లో స్ఫురితమ వుతోంది," అన్నారు ఆరుద్ర ఓ కార్డు ద్వారా. "మీ 'జీవన వీచి క'లో పెట్టిన శీర్షికకు, సాగిన కవి తకు అర్థం వుంది. అన్వయం వుంది. మీ కవిత్వానికున్న మంచి గుణం స్పష్టత," అంటూ సినారె ఉత్తరం రాశారు. ఇంకా ఎందరో పెద్దలూ మిత్రులూ లేఖలు రాశారు. ప్రతీ లేఖా కొత్త ఉత్తేజాన్నిచ్చింది. ఆ లేఖల్ని ఇప్పటికీ అప్పుడప్పుడూ తీసి చదువుకుంటూ, నాటి ఉత్సవ జ్ఞాపకాన్ని నెమరేసుకుంటాను.

✆ 94404 19039

దళిత కవితా సంపుటుల పరిచయం

అంబేద్కర్ విద్యార్థి సంఘం, హైదరాబాద్ విశ్వ విద్యాలయం (హెచ్‌సీయూ) ఆధ్వర్యంలో కేశవ కుమార్ రెండు కవితా సంపుటాలు 'ఆదిమ పౌరుడు', 'ఎగిరే పళ్లెం నడిచే మంచం ఓ కూని రాగం' పరి చయ సభ అక్టోబర్ 27 సాయంత్రం 5గం.లకు అంబేద్కర్ ఆడిటోరియం, హెచ్‌సీయూలో జరుగు తుంది. అధ్యక్షుడు ప్రొ.బి.ఈశ్వరరావు, ముఖ్య అ తిథి గోరటి వెంకన్న. సతీష్ చందర్, పిల్లలమర్రి రాములు, కందుకూరి అంజయ్య, మెర్సీ మార్గరెట్, పసునూరి రవీందర్ తదితరులు పాల్గొంటారు.

తాటిపెల్లి తిరుపతి

పద్యాల పోటీల బహుమతి ప్రదానం

తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 13వ వార్షికోత్సవాన్ని నవంబర్ 2తేదీన పలమనేరు లోని సొంత కళా మందిరంలో నిర్వహిస్తున్నాం. పద్యాల పోటీల్లో గెలుపొందిన 50 మంది పిల్ల లకు బహుమతులతో పాటు 13 మందికి వార్షికోత్సవ పురస్కారాలు అందిస్తున్నాం. ముఖ్య అతిథులుగా గార్లపాటి దామో దర్ నాయుడు, ఆముదాల మురళి, దశ రథ రెడ్డి తదితరులు పాల్గొంటారు.

పి. తులసినాథం నాయుడు

విద్యార్థులకు కవిత, కథ, నాటికల పోటీలు

బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహిస్తున్న పోటీకోసం 25 పంక్తులు మించని పద్యం/ కవిత/ గేయం; ఏ4 సైజు లో 3 పుటలు మించని కథ; 6 పుటలు మించని నాటికలను స్వదస్తూరితో పేజీకి 20 పంక్తులకు మించకుండా– దేశభక్తి, దేశ సమగ్రత, తెలంగాణ వైశిష్ట్యం, పర్యావరణం పచ్చదనం లాంటి అంశాలపై– రాయాలి. రచన పైన ఏ సమాచారమూ ఉండరాదు. విద్యార్థి పేరు, తరగతి మొదలైన సమాచారమంతా పాఠశాల ప్రధానాచార్యులు ధ్రువీకరించే పత్రంలో మాత్రమే ఉండాలి (వారి ఫోన్ నంబర్‌తోసహా). రచనలను నవంబర్ 5 లోపు చిరునామా: కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి, రవీంద్ర భారతి ప్రాంగణం, హైదరాబాద్ 500004కు పంపాలి.

తెలంగాణ సాహిత్య అకాడమి

అనువాదం, కవిత్వ ప్రక్రియల పోటీ

మాధవరావు జ్ఞాపకార్థం తెలుగు అనువాద సాహిత్యం, పద్య కవిత్వం, హైకూలు, మినీకవిత, దీర్ఘకవితల పోటీ నిర్వహిస్తున్నాం. ఉత్తమ అను వాదానికి, ఉత్తమ కవితా ప్రక్రియకు చెరో రూ.5,116 బహుమతి ఉంటుంది. 2018 తర్వాత ముద్రితమైన 2 కాపీలను నవంబర్ 25లోపు పంపాల్సిన చిరునామా: నిర్వాహకులు, శ్రీ సూర్య రాయ విద్యానంద గ్రంథాలయం, పాత బస్టాండు వద్ద, మెయిన్ రోడ్, పిఠాపురం – 533450. వివరా లకు: 94945 53425.

పిఠాపుర సాహితీ కళావేదిక



చల్లపల్లి గురుకుల బాలికల కళాశాల నుంచి తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు వెళ్తున్న బాలికలు



మొంథా టెన్షన్!



ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు!

వాతావరణ శాఖ అంచనా మేరకు కృష్ణాజిల్లా పూర్తిగా ఎల్లో అలెర్ట్‌లో ఉండగా.. ఎన్టీఆర్ జిల్లాలో మాత్రం విజయవాడ నగరం, ఎన్టీఆర్ జిల్లా వాయువ్య ప్రాంతాలైన ఇబ్రహీంపట్నం, జీ కొండూరు, మైలవరం, ఏ కొండూరు, తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట మండలాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించారు. ఎల్లో అలెర్ట్ ప్రకటించడంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే ప్రమాదం ఉంది. ఆదివారం రెండు జిల్లాల్లో వాతావరణ మార్పులు పెద్దగా జరగలేదు. ఎన్టీఆర్ జిల్లాలో యథాతథ పరిస్థితులు ఉన్నాయి. కృష్ణాజిల్లాలో మాత్రం స్వల్పంగా మబ్బులు అలుముకున్నాయి. అక్కడక్కడ అతి స్వల్ప వర్షం పడింది. సోమవారం మాత్రం కృష్ణాజిల్లాలో భారీ వర్షాలు పడతాయని, ఎన్టీఆర్ జిల్లాలో మాత్రం ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. మంగళ, బుధవారాలు మాత్రం ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో రెండు చోట్ల భారీ వర్షాలు పడతాయని రెడ్ అలెర్ట్‌ను ప్రకటించింది. దీంతో మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు పడే ప్రమాదం ఉంది.

అందరిలో ఒక్కటే టెన్షన్.. అదే మొంథా టెన్షన్. ఇప్పటికే కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ అయ్యింది. మంగళవారం రెడ్ అలెర్ట్ రానుంది. తుఫాను ప్రభావంతో కృష్ణా జిల్లాలో పూర్తిగా, ఎన్టీఆర్ జిల్లాలో వాయువ్య ప్రాంతం, నగరంలో భారీ వర్షాలు పడనున్నాయి. వ్యవసాయ, ఆక్వా రంగాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రత్యేక అధికారులను నియమించింది. తక్షణ అవసరాల కోసం నిధులు కేటాయించింది. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది.

6

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

రేపు రెడ్ అలెర్ట్ హెచ్చరికలు • భారీ వర్షాలు కురిసే అవకాశం

కృష్ణా పూర్తిగా.. విజయవాడ, వాయువ్య ఎన్టీఆర్ ప్రాంతాల్లో ప్రభావం

- వ్యవసాయ, ఉద్యాన పంటల రైతుల్లో ఆందోళన
- ఆక్వా రంగంపై తీవ్ర ప్రభావం చూపనున్న తుఫాను
- మండల స్థాయిలో ప్రత్యేకాధికారుల నియామకం
- ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల ప్రత్యేక అధికారులుగా శశిభూషణకుమార్, అమ్రపాలి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి జిల్లా వాసులను మొంథా తుఫాను టెన్షన్ వెంటాడుతోంది. అతి భారీ వర్షాల హెచ్చరికలతో జిల్లా అధికార యంత్రాంగాలు అప్రమత్తం అయ్యాయి. ప్రభుత్వం ప్రతి జిల్లాకు ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించింది. ఎన్టీఆర్ జిల్లాకు పంచాయతీరాజ్ - మిగతా 6లో..



ముంచుకొస్తున్న మొంథా వాయుగుండం శాటిలైట్ చిత్రం

పంటలపై ప్రభావం

రెండు జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి కనిపిస్తోంది. కృష్ణాజిల్లాలో 1.61 లక్షల హెక్టార్లలో వరి పంట ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో వరి 1.21 లక్షల ఎకరాలు, పత్తి 80 వేల ఎకరాలలో సాగు జరుగుతోంది. ఇవి కాకుండా ఎన్టీఆర్ జిల్లాకు అత్యంత ప్రధానంగా ఉద్యాన పంటలైన అరటి, చెరకులతో పాటు కంది, మినుము, పెసర వంటి పంటలు కూడా భారీ వర్షానికి నష్టపోయే అవకాశం ఉంది.

● సన్డే సందడి



నగరంలోని గాంధీ హిల్‌కు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ఏర్పాటు చేసిన సౌకర్యాలను చూసి సంతోష పడ్డారు. కుటుంబ సభ్యులతో ఆద్యంతం ఆనందంగా గడిపారు. గాంధీ విగ్రహం వద్ద సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ర్యాంప్‌పై నుంచి నగర అందాలను ఆశ్వాదించారు.

శివతాండవం!

విజిలెన్స్ కానిస్టేబుల్ రూటే సపరేటు



- అడ్డగోలు వ్యవహారాల్లో తెరవెనుక పాత్ర
- ఉన్నతాధికారుల పేషీలోని అధికారులతో సంబంధాలు
- వారి ద్వారా పలువురి బదిలీలకు సిఫార్సులు
- కమిషనరేట్ నుంచి విజిలెన్స్‌కు వెళ్లిన సదరు కానిస్టేబుల్
- కమిషనరేట్‌లో మూడుసార్లు వీఆర్‌కు పంపిన అధికారులు
- పీడీఎస్, బెట్టింగ్, ఇసుక మాఫియాతో సత్సంబంధాలు!

ఆయన ఐపీఎస్ అధికారి కాదు. అలాగని డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అంత కన్నా కాదు. సబ్‌ఇన్‌స్పెక్టర్ వద్ద పనిచేసే కానిస్టేబుల్. ఉద్యోగం కానిస్టేబుల్ స్థాయి అయినా వ్యవహారాలు మాత్రం ఐపీఎస్ స్థాయిలో ఉంటాయి. ఎవరిని పట్టుకుంటే ఏ పని సులువుగా అవుతుందో కనికట్టు తెలిసిన మహా ముదురు. ఇప్పుడు ఈ కానిస్టేబుల్ పేరు అటు విజిలెన్స్‌లోను, ఇటు డీజీపీ కార్యాలయంలోను చర్చనీయాంశమవుతోంది. ఐపీఎస్ స్థాయి అధికారులతో సంబంధాలు లేకుండా వారి పేషీల్లో పనిచేసే అధికారులతో సత్సంబంధాలు నడుపుతూ కాగల కార్యాలను పూర్తి చేయించుకుంటున్నాడు.

(ఆంధ్రజ్యోతి- విజయవాడ): వైసీపీ హయాంలో విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేశాడు. ఇక్కడ కీలకమైన నిఘా విభాగంలో పనిచేస్తూ అక్రమ వ్యాపారులు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారితో మంచి సంబంధాలు పెట్టుకున్నాడు. ఇక్కడ అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండానే మొత్తం వ్యవహారాలను చక్కబెట్టేవాడు. ఇక్కడ పనిచేసినంత కాలం పీడీఎస్‌ను అక్రమంగా తరలించే ముఠాలు, బెట్టింగ్‌ను జోరుగా నిర్వహించే ముఠాలతో మంచి స్నేహబంధాలను కొనసాగించాడు. ఈ వ్యవహారాలు ఉన్నతాధికారులకు తెలియడంతో అతడిని మూడు సార్లు వీఆర్‌కు పంపారు. తర్వాత అప్పటి రాజకీయ నేతలు, ఉన్నతాధికారులను ఉపయోగించుకుని తిరిగి అదే కీలకమైన విభాగంలో పోస్టింగ్ సంపాదించుకుని చెలరేగిపోయాడు. సరిగ్గా ఎన్నికలకు ఏడాది సమయం ఉందనగా ఇక్కడి నుంచి తెలివిగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ అయ్యాడు. అక్కడే ముఖ్యఅధికారి పేషీ వద్ద విధులను కుదుర్చుకున్నాడు. అక్కడ నుంచి మళ్లీ చక్రం తిప్పడం మొదలుపెట్టాడు. పీడీఎస్ అక్రమ రవాణా, బెట్టింగ్ ముఠాలకు తాను ఉన్నానంటూ అభయహస్తం ఇచ్చాడు. కల్తీ వ్యాపారాలు చేసే ముఠాలతో నిత్యం సంప్రదింపులు చేస్తున్నాడని వ్యాపార వర్గాలు బహిరంగంగా చెబుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి ఎలాంటి వే బిల్లులు, రశీదులు లేకుండా రాకపోకలు సాగించే వాహనాలకు నగరం దాటే వరకు ప్రత్యేకంగా ఎస్కార్ట్‌ను ఇప్పిస్తున్నట్టు వినికిడి.

బాగోతం ఇలా బయట పడింది..

విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఈ కానిస్టేబుల్ డీజీపీ కార్యాలయంలోని ఉన్నతాధికారుల పేషీల్లో ఉండే అధికారులకు దగ్గరయ్యాడు. వారు చెప్పిన పనులు చేసిపెట్టి వారికి నమ్మినబంటుగా మారిపోయాడు. దీంతో ఇతడు చెప్పిన పనులు చేయించుకోవడం మొదలుపెట్టాడు. వివిధ జిల్లాల్లో ఉన్న ఐపీఎస్ అధికారులకు ఈ పేషీ అధికారులతో ఫోన్లు చేయించి తనకు కావాల్సిన వారికి అనుకూలంగా ఉన్న విభాగాల్లో పోస్టింగ్‌లు ఇప్పించుకున్నాడు. ఈ తతంగం గుంటూరు జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు సాగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల విజయవాడలో క్రమశిక్షణ చర్యలు కింద బదిలీ అయిన కానిస్టేబుల్‌ను తిరిగి కీలకమైన మిగతా 6లో..



గతేడాది బుడమేరుకు కాల్వకు ఏర్పడిన గండిని పూడుస్తున్న అధికారులు (ఫైల్)

- ఎన్టీఆర్ వాయువ్య ప్రాంతాల్లో పడనున్న వర్షాలు
- 15 వేల క్యూసెక్కుల వరద వరకు ఇబ్బంది లేదు..

బుడమేరుకు యాక్షన్‌ప్లాన్ అవసరం!

మొంథా ప్రభావంతో జాగ్రత్తలు అవసరం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తుపాను ప్రభావంతో విజయవాడతో పాటు వాయువ్య ఎన్టీఆర్ జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం బుడమేరు యాక్షన్ ప్లాన్‌కు సంసిద్ధం కావాల్సిన అవసరం ఉంది. గతేడాది సెప్టెంబరులో కేవలం రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకే బుడమేరు మహోగ్రరూపం దాల్చింది. మొంథా తుపాను వల్ల మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్న నేపథ్యంలో బుడమేరుకు వరద వచ్చే అవకాశం ఉంది. వాయువ్య ఎన్టీఆర్ జిల్లాలో గంపలగూడెం, తిరువూరు, ఏ.కొండూరు, మైలవరం, జి.కొండూరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో భారీ వర్షం కురిస్తే బుడమేరు ఉప్పొంగుతుంది. బుడమేరు అనేది అనేక వాగుల సమాహారం. ఏ.కొండూరు మండలం జమ్మలోయిదుర్గం దగ్గర బుడమేరు ప్రారంభమవుతుంది. ఇలా మొదలైన బుడమేరుకు వెలగలేరు వరకు ఎన్నో భారీ వాగులు కలుస్తాయి. చీమలపాడు దగ్గర పాలవాగు, రెడ్డిగూడెం నుంచి కోతులవాగు, మెర్సుమిల్లి, అనంతవరం, మిగతా 6లో..

ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్తులు
6
ఉమ్మడి కృష్ణాకు రూ.1.50 కోట్లు

స్పాట్ బేరసారాలు!

అధికార పార్టీ నేతతో స్పా డాన్ భార్గవ్ సంప్రదింపులు!

- కేసులో చార్జిషీటు దాఖలు చేయాలని ఒత్తిళ్లు
- కొన్ని నెలలుగా అజ్ఞాతంలోనే భార్గవ్
- వరుసగా డిస్మిస్ అవుతున్న ముందస్తు బెయిల్ పిటిషన్లు
- నగరంలో స్పా ఏర్పాటుకు మరో ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్న భార్గవ్

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): చలసాని ప్రసన్న భార్గవ్... ఈ పేరు వినిపించని ప్రదేశం విజయవాడలో ఉండదు. పోలీసులు రికార్డులు తిరగేస్తే స్పా సెంటర్ల నిర్వాహకుల్లో మొదటిగా కనిపిస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 27న మాచవరం పోలీసులు పక్కాగా వ్యూహం రూపొందించి భార్గవ్ నిర్వహిస్తున్న స్పా సెంటర్ బాగోతాన్ని బట్టబయలు చేశారు. పోలీస్ కమిషనర్‌గా రాజశేఖర్‌బాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత ముందుగా స్పా సెంటర్ల నిర్వాహకులకు గట్టిగా హెచ్చరికలు జారీ చేశారు. స్పా ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు. చలసాని ప్రసన్న భార్గవ్ వెటర్నరీ కాలనీలో రియల్ ఎస్టేట్ ఆఫీసు ముసుగులో పై అంతస్తులో అత్యాధునిక టెక్నాలజీతో తలుపులు లాక్ చేసి స్పా సెంటర్‌ను నిర్వహించాడు. ముంబై, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మిగతా 6లో..


ప్రైవేటు బస్సులపై కొరడా!

- ఉమ్మడి జిల్లాలో 50 బస్సులపై కేసులు నమోదు
- ఐదు బస్సులు సీజ్.. గత శనివారం నుంచి విస్తృతంగా తనిఖీలు
- వివరాలు వెల్లడించిన రవాణాశాఖ అధికారులు

విజయవాడ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ప్రైవేటు బస్సు దగ్ధమైన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో రవాణాశాఖ కొరడా ఝుళిపించారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో గత శనివారం రాత్రి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. ఈ వివరాలను రెండు జిల్లాల రవాణా శాఖ అధికారులు ఆదివారం వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లాలో 42 బస్సులపై కేసులు మిగతా 6లో..



నందిగామలో ఆదివారం రాత్రి ప్రైవేటు బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు





అడవి మధ్యలో సాగుతున్న రన్





రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువతీ యువకులు

ప్రకృతి ఒడిలో పరుగు

మూలపాడులో ట్రైమెట్రిక్స్ హ్యాపీ ఫారెస్ట్ రన్

ప్రకృతి ప్రేమికులతో ఆహ్లాదకర వాతావరణంలో కొండ కోనల సవ్వడులను ఆస్వాదిస్తూ.. పక్షుల కిలకిలరావాలు.. సీతాకోకచిలుకల సోయగాల మధ్య మధురానుభూతిని అనుభవించాలనుకునే ప్రకృతి ప్రేమికుల హ్యాపీ ఫారెస్ట్ రన్ అద్భుతంగా సాగింది. పర్యాటకులకు ప్రకృతి మధురానుభూతులను పంచేందుకు 'ట్రైమెట్రిక్స్' సంస్థ మూలపాడు వద్ద నిర్వహించిన ఈ ట్రయల్ రన్ ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు కొండ కోనల్లో ఆదివారం జరిగింది. అటవీ శాఖ అధికారుల సహకారంతో రేస్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో 'ట్రైమెట్రిక్స్' హెడ్ కోచ్ బి.రుషిల్ యాత్రను నిర్వహించారు. - (ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)





ఫారెస్ట్ రన్‌లో చిన్నారులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దర్శనానికి కార్తీకమాసం ఆదివారం కావటంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి కుటుంబాలతో సహా తరలివచ్చారు. కొందరు మొక్కుబడుల మేరకు తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. కొండపైన క్యూలైన్లలో చేరి కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రంగా జరిగేందుకు ఈవో వీకే శీనానాయక్, అధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం సత్వరం అందేలా ఈవో తగు చర్యలు తీసుకున్నారు.



మాట్లాడుతున్న విద్యాసాగర్

ఉద్యోగుల గొంతుకగా ఎన్జీవో

● రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

గాంధీనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఇటీవల ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం జరిపిన చర్చల్లో ముందడుగు పడిందని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా సర్వసభ్య సమావేశం గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభించే దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. నిరంతర ఐక్యత పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా సంఘాలకు సూచించారు. గత ప్రభుత్వం పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌కు కోత విధించిందన్నారు. తమ ఆకాంక్షలను కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందనే ఆశాభావంతో ఉద్యోగులు ఉన్నారన్నారు. డీఏ విడుదల చేసిన జీవోల్లోని గందరగోళాన్ని సరిచేయాలని ఎన్జీవో సంఘం ప్రభుత్వం దృష్టికి వెళ్లిందని దీంతో 24 గంటల్లోనే సవరించిన జీవోను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ఉద్యోగులకు చట్టపరంగా లభించాల్సిన హక్కుల కోసం వారి గొంతుకగా తమ సంఘం పని చేస్తుందని ఉద్ఘాటించారు. రానున్న రోజుల్లో సంఘం నాయకత్వంలో యువతకు ప్రాధాన్యత ఇచ్చేలా జిల్లా నాయకత్వాలు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమణ మాట్లాడుతూ 11 వేల మంది ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తేవాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రనేతలు కే జగదీశ్వరరావు, జానకీ రాజ్యలక్ష్మీ, కాపిటల్ సిటీ కార్యదర్శి సరస్వతి, జిల్లా అధ్యక్షుడు డీఎస్ఎన్ రెడ్డి, సహాధ్యక్షుడు వీవీ ప్రసాద్, కార్యదర్శి రమేష్, సతీష్‌కుమార్, రాజుబాబు పాల్గొన్నారు.

బొలేరో వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతి

విద్యాధరపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ బైపాస్ ప్లై ఓవర్‌పై బొలేరో వాహనం ఢీకొనటంతో ఈలప్రోలు ఇందిరమ్మ కాలనీకి చెందిన లారీ డ్రైవర్ ఇమ్మనేని శ్రీనివాసరావు (59) మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. మృతుడు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు ఇందిరమ్మకాలనీలో ఇమ్మనేని శ్రీనివాసరావు భార్య, కుమారుడితో కలిసి ఉంటున్నాడు. ఇతడు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం శ్రీనివాసరావు తన బైక్‌పై ఎనికేపాడులోని బంధువుల వద్దకు వెళ్లాడు. అక్కడ పనిచూసుకుని తిరిగి బైక్‌పై హెల్మెట్ ధరించి వెస్ట్ బైపాస్ మీదుగా ఈలప్రోలుకు బయలుదేరాడు. ఈ క్రమంలో వెస్ట్ బైపాస్ నల్లకుంట సమీపంలోకి వచ్చేసరికి అంబాపురానికి చెందిన పీ జోజ్ సుదర్శన్ బొలేరో వాహనం నడుపుకుంటూ వెనక నుంచి వేగంగా వచ్చి శ్రీనివాసరావు బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో శ్రీనివాసరావు రెండు పల్టీలు కొట్టి అతను ధరించిన హెల్మెట్ కూడా దూరంగా పడిపోయి తలకు తీవ్ర గాయాలవటంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసరావు మృతికి కారణమైన సుదర్శన్‌ను, బొలేరో వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు.

సహాయ కార్మిక అధికారుల రాష్ట్ర సంఘం ఎన్నిక

విజయవాడ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్మిక అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.కిషోర్‌కుమార్ (రాజమండ్రి), ప్రధాన కార్యదర్శిగా ఎస్.రామకృష్ణ (ఒంగోలు) ఎన్నికయ్యారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం జరిగిన ఈ ఎన్నికల్లో నూతన ప్రతినిధులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షులుగా ఎన్వీ రమణారెడ్డి (హిందూపురం), కోశాధికారిగా ఎస్.దుర్గారావు (విజయవాడ), మహిళా కార్యదర్శిగా కె.అన్నపూర్ణ (విజయవాడ), జోనల్ కార్యదర్శులుగా బి.కొండలరావు (రాజాం), పి.మహేశ్వరరెడ్డి (భీమవరం), వై.సుబ్బారాయుడు (మార్కాపురం), ఏఎండీ సమీర్ (కర్నూలు) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా డి.శ్రీనివాసరావు వ్యవహరించారు. 2028 వరకు నూతన ప్రతినిధులు సంఘ కార్యకలాపాలు నిర్వహిస్తారు.


హంసలదీవికి తుఫాన్ హెచ్చరికలు

కోడూరు: మొంథా తుఫాన్ నేపథ్యంలో హంసలదీవి బీచ్‌కి పర్యాటకులు రావద్దని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీసాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హంసలదీవి బీచ్ వద్ద తుఫాన్ ప్రభావంతో అలలు ఎగసిపడుతున్నందున 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు పాలకాయితిప్ప హంసలదీవి బీచ్ గేట్లను మూసివేస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి

● తుఫాన్‌పై నిరంతరం అప్రమత్తంగా ఉండాలి ● ప్రజలకు అవగాహన కల్పించండి ● ఆస్తి, ప్రాణ నష్టం సంభవించరాదు: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా మండల స్థాయిలో విపత్తు స్పందన బృందాలతో పాటు గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా సిబ్బంది పటిష్ఠ సమన్వయంతో, ముందు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఆదివారం ఆయన ఆర్డీవోలతో పాటు రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, పౌరసరఫరాలు, ఆర్ అండ్‌బీ, పంచాయితీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణానదితో పాటు వాగులు వంకల్లో నీటి ప్రవాహాలను పర్యవేక్షిస్తూ, అటువైపుగా ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. వర్షాలు, గాలుల సమయంలో ప్రయాణాలు చేయకుండా అవగాహన కల్పించాలని, పశువులను చెట్ల కింద, స్తంభాలతో కట్టకుండా చూడాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వైద్య సంరక్షణ అవసరమైన రోగులు, గర్భిణులను సమీప ఆసుపత్రుల్లో చేర్చాలని సూచించారు. అధికారులు, సిబ్బంది 24/7 పాటు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని, ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే కమాండ్ కంట్రోల్ కేంద్రానికి (9154970454) నివేదించాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థలోని భవంతులను గుర్తించి అందులో ఎవరూ ఉండకుండా, పునరావాస శిబిరాలకు తరలించి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మత్స్యకారులు చేపల వేటకు నదిలోకి వెళ్లకుండా ఆయా గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. ఒకవేళ చెట్లు, స్తంభాలు ఎక్కడైనా పడిపోతే వెంటనే తొలగించేందుకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ముందు జాగ్రత్తగా కొత్త స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. విధుల నిర్వహణలో నిబద్ధత, నిరంతర అప్రమత్తతే ప్రజల భద్రతకు భరోసానిస్తుందని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. టీసీలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కే బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కే మాధురి పాల్గొన్నారు.



కృష్ణా జిల్లాలో పూర్తిగా.. విజయవాడ, వాయువ్య ఎన్టీఆర్ జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచిస్తున్న వాతావరణ నిపుణులు విడుదల చేసిన మ్యాప్

తుఫాను కమాండ్ కంట్రోల్ కేంద్రాల ఫోన్ నెంబర్లు :

- కలెక్టర్ కార్యాలయం - 9154970454
- విజయవాడ ఆర్డీఓ కార్యాలయం - 0866 2574454
- నందిగామ ఆర్డీఓ కార్యాలయం - 7893053534
- తిరువూరు ఆర్డీఓ కార్యాలయం - 8309836215, 08673251235
- విజయవాడ సెంట్రల్ తహసీల్దార్ కార్యాలయం 9849903993
- విజయవాడ పశ్చిమ తహసిల్దార్ కార్యాలయం 9121284800
- విజయవాడ ఉత్తర తహసీల్దార్ కార్యాలయం 9849903979
- విజయవాడ తూర్పు తహసీల్దార్ కార్యాలయం 6305598505 / 9121284808
- విజయవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయం 8555841358 / 9849903997
- ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం 8008362172 / 9849903999
- జి.కొండూరు తహసీల్దార్ కార్యాలయం 8985818829 / 9908664616
- మైలవరం తహసీల్దార్ కార్యాలయం 9849903972
- ఎ.కొండూరు కంట్రోల్ రూమ్ నెం. 9949063837
- గంపలగూడెం కంట్రోల్ రూమ్ నెం. 79811 31013
- తిరువూరు కంట్రోల్ రూమ్ నెం. 8096587174
- రెడ్డిగూడెం కంట్రోల్ రూమ్ నెం. 9182679512
- వినన్నపేట కంట్రోల్ రూమ్ నెం.9703983505

జాగ్రత్త చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ లక్ష్మీశకు ఎంపీ కేశినేని ఫోన్

వన్‌టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదివారం కలెక్టర్ లక్ష్మీశతో ఫోన్‌లో మాట్లాడి తుఫాన్ జాగ్రత్తలు చేపట్టాలన్నారు. గత అనుభవాలు దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో చేపడుతున్న ముందస్తు చర్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ రావటానికి ముందే ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు అధికార వ్యవస్థ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించి పునరావాస శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. కొండ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, గర్భిణులు, వృద్ధులకు పరిస్థితిని బట్టి ముందే పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పించాలని సూచించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదమున్న ఆవాసాల్లోని ప్రజలకు ముందుజాగ్రత్తగా పునరావాస కేంద్రాల్లో ఉంచి సౌకర్యాలు కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగానే ప్రజలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్య సేవలు అందించాలన్నారు. ప్రజలు నదీ తీరాలకు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. బుడమేరు, మునేరులోని ప్రవాహాలను పర్యవేక్షించాలన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, ఆరోగ్యం, అగ్నిమాపక, పౌర సరఫరాలు, మునిసిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలని, అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.



ఉమ్మడి కృష్ణాకు రూ.1.50 కోట్లు

విజయవాడ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో ముంపు ప్రాంతాలకు అత్యవసర సహాయం అందించేందుకు రూ.1.50 కోట్లను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. విస్తారమైన సముద్ర తీర ప్రాంతం కలిగి, ముంపు ప్రభావితం ఎక్కువగా ఉన్న కృష్ణాజిల్లాకు రూ. కోటి కేటాయించింది. అలాగే ఎన్టీఆర్ జిల్లాకు రూ.50 లక్షలను మంజూరు చేసింది. ఈ అత్యవసర సాయాన్ని కలెక్టర్లు వినియోగించేలా ఆదేశాలు జారీ చేసింది. పునరావాస కేంద్రాల ఏర్పాటునకు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు, సముద్ర తీరంలోని గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిచేందుకు, వారికి భోజనం వసతి కల్పించేందుకు, ముంపులో చిక్కుకున్న ప్రజలను రక్షించేందకు, అవసరమైతే జాలర్లను, బోట్లను సమకూర్చేందుకు, నీటి ఉధృతికి తెగిన రోడ్లు, వంతెనలను తాత్కాలికంగా నిర్మించేందుకు ఈ నిధులను వినియోగించాల్సి ఉంటుంది.



విమల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ విశ్రాంతి అధికారి సూయిజ్

పరుల సేవకే విమల జీవితం అంకితం

● సంస్మరణ సభలో వక్తలు

గవర్నర్‌పేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సొంత లాభం అంతా మానుకుని పరుల సేవకే జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మానవతా మూర్తి విమల అని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల కన్నుమూసిన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్, వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు సూరపనేని విమల సంస్మరణ సభ ఆదివారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో జరిగింది. విమల చిత్రపటానికి ఆమె సహచరి ఉమాదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ విశ్రాంత అధికారి సూయిజ్ మాట్లాడుతూ విమల ఉద్యోగ జీవితంలోనూ, తరువాత చేసిన సేవా కార్యక్రమాలను మనసుపెట్టి చేశారన్నారు. రాష్ట్రంలో తెలుగు బాల మహిళా ప్రగతి ప్రాంగణాల నిర్మాణానికి విమల పడిన శ్రమను గుర్తు చేశారు. ఎంబీవీకే కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి నిరంతరం తపిస్తూ, మదర్ థెరిసా వలే తన జీవితాన్నే అంకితం చేసిన విమల గొప్ప దేశభక్తురాలన్నారు. ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాలినాయుడు మాట్లాడుతూ విజయవాడ, గుంటూరు పెన్షనర్స్ కార్యాలయాల్లో ట్రస్ట్ నుంచి నిధులు మంజూరు చేశారని, సౌకర్యాలు కల్పించారని గుర్తు చేశారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ బీబీఎఫ్ఎస్ గ్రంథాలయ నిర్మాణానికి విమల, ఆమె సోదరుడు ఇచ్చిన భూరి విరాళంతోనే తొలి అడుగులు పడ్డాయన్నారు. ఉద్యోగ జీవితంలోనూ, ఉద్యోగ విరమణానంతరం విమల చేసిన సేవా కార్యక్రమాలను ట్రస్ట్ సభ్యురాలు వీ పద్మ వివరించారు. దివ్యాంగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, విజయమేరీ బ్లైండ్ స్కూల్ ప్రిన్సిపాల్ నిర్మల ప్రసంగించారు.

ప్రైవేటు బస్సులపై కొరడా!

(5వ పేజీ తరువాయి)

నమోదు చేశారు. రవాణా చట్టాన్ని ఉల్లంఘించి అనధికారికంగా నడుస్తున్న ఒక బస్సును సీజ్ చేసినట్లు ధ్రువీకరించారు. కృష్ణాజిల్లాలో ఎనిమిది బస్సులపై కేసులు నమోదు చేశారు. వీటిలో అనధికారికంగా నడుస్తున్న నాలుగు బస్సులను సీజ్ చేశారు. రవాణా చట్టం ప్రకారం సరైన ధ్రువీకరణ పత్రాలు లేని, అధిక సీటింగ్ ఉన్న బస్సులపై కేసులు నమోదు చేశారు.

బుడమేరుకు యాక్షన్‌ప్లాన్ అవసరం!

(5వ పేజీ తరువాయి)

మైలవరం నుంచి కొండవాగులు, కుంటముక్కల కొండవాగు, కొండపల్లి రిజర్వు ఫారెస్టు నుంచి పులివాగు, కప్పలవాగు, తొమ్మండ్రు వాగులన్నీ ఉధృతంగా ప్రవహించి బుడమేరులో కలుస్తాయి. కాబట్టి ఈ వాగుల పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగం అంచనా వేస్తుండాలి. కృష్ణానదికి వచ్చే వరద మాదిరిగా బుడమేరుకు ఎన్ని క్యూసెక్కుల వరద వస్తుందనేది.. వచ్చే వరకు కూడా తెలియదు. బుడమేరును అంచనా వేయాలంటే పైన చెప్పుకున్న వాగులన్నింటినీ ఎప్పటికప్పుడు అంచనా వేస్తుండాలి. వాగుల ఉధృతిని బట్టి బుడమేరు డైవర్షన్ చానల్ (బీడీసీ)కి ఎంత వరద వస్తుందన్నది అంచనా వేయటం సాధ్యమతుంది. ఒక్కో వాగును ఒక్కో ప్రత్యేకాధికారి ద్వారా మానిటరింగ్ చేయించగలిగితే త్వరగా అంచనా వేయించటం ద్వారా రాబోతున్న ఉపద్రవాన్ని అర్థం చేసుకోవటానికి అవకాశం ఉంటుంది. గతేడాది 45 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. వెలగలేరు దగ్గర బుడమేరు హెడ్‌రెగ్యులేటరీ కేవలం 15 వేల క్యూసెక్కుల వరదను మాత్రమే కృష్ణానదిలోకి డైవర్షన్ చేయగలదు. అంతకు మించి వరద వస్తే మాత్రం గేట్లు ఎత్తాల్సి ఉంటుంది.

స్పాట్ బేరసారాలు!

(5వ పేజీ తరువాయి)

యువతులతో కాంట్రాక్ట్ కుదుర్చుకుని వారి అందాలను ఆదాయ వనరుగా మార్చుకున్నాడు. పక్కాగా సమాచారం రావడంతో మాచవరం పోలీసులు స్పా సెంటర్ తలుపులు పగలుగొట్టి యువతులను రక్షించారు. వారిని కౌన్సెలింగ్ కేంద్రాలకు తరలించారు. పోలీసుల దాడి గురించి తెలుసుకున్న భార్గవ్ విజయవాడ నుంచి పరారయ్యాడు. పోలీసులను బెదిరించి లొంగ దీసుకోవాలని భార్గవ్ అజ్ఞాతంలో ఉండి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

అధికార పార్టీ నేతతో మంతనాలు

అనేక మార్గాల్లో పోలీసులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించిన భార్గవ్ ఇప్పుడు కొత్త మార్గాలను ఎంచుకున్నాడు. ఓ అధికార పార్టీ నేతతో సంప్రదింపులు మొదలుపెట్టాడు. వెటర్నరీ కాలనీలో స్పా సెంటర్ వ్యవహారం బట్టబయలైన తర్వాత భార్గవ్ కర్ణాటకకు పారిపోయాడు. ఇందులో పనిచేస్తున్న ఒక్కొక్కరిని పోలీసులు అరెస్టు చేసినా భార్గవ్ మాత్రం చిక్కలేదు. పొరుగు రాష్ట్రాల్లో ఉంటూ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయిస్తున్నాడు. భార్గవ్ దాఖలు చేసిన ప్రతి పిటిషన్‌ను కోర్టు తిరస్కరిస్తోంది. కేసులో చార్జిషీటు దాఖలు చేయకపోవడంతో ముందస్తు బెయిల్ ఇవ్వడానికి న్యాయస్థానం నిరాకరిస్తోంది. స్పా సెంటర్‌లో అమ్మాయిలతో వ్యభిచారం చేయిస్తున్న కేసులు భార్గవ్‌పై అనేకం ఉన్నాయి. ఈ మొత్తం రికార్డులను పోలీసులు కోర్టుకు అందజేశారు. ఇప్పుడు పోలీసులతో కోర్టులో చార్జిషీటు దాఖలు చేయించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడని తెలియజేస్తూ అబ్‌స్కాండింగ్ చార్జిషీట్‌ను దాఖలు చేయించుకునేందుకు అధికార పార్టీ నేతలతో సంప్రదింపులు చేస్తున్నాడు. ఈ విధంగా పోలీసులు చార్జిషీటు దాఖలు చేస్తే కోర్టులో ముందస్తు బెయిల్ మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నాడు. ఇందుకోసం అధికార పార్టీ నేతతోపాటు మరో నేతను పోలీసులపై ప్రయోగించినట్టు తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత కొత్తగా మరో స్పా సెంటర్‌ను తెరవడానికి రంగం సిద్ధం చేసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే ఒక ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నాడని సమాచారం.

శివతాండవం!

(5వ పేజీ తరువాయి)

విభాగంలో నియమించుకున్నాడు. డీజీపీ కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారి పేషీలోని అధికారితో ఈ సిఫార్సు చేయించాడు. ఈ వ్యవహారం రచ్చకావడంతో ఆ పేషీ అధికారి మొత్తం చరిత్రను తెలుసుకున్నారు. అసలు విషయాలను తొక్కిపెట్టి తనతో సిఫార్సు చేయించుకున్నాడని ఆయన ఆగ్రహంతో ఊగిపోయారు. అప్పటి నుంచి తన పేషీలోకి అడుగుపెట్టవద్దని హెచ్చరించారు. సాధారణంగా విదేశాలకు వెళ్లినప్పుడు ఆ శాఖలోని ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలి. అటువంటి ఈ కానిస్టేబుల్ ఎలాంటి అనుమతులు లేకుండానే బ్యాంకాక్ ట్రిప్పులు పలుమార్లు వేశాడని అతడి స్నేహితులే చెబుతున్నారు. కమిషనరేట్‌లో మూడు సార్లు వీఆర్‌లోకి వెళ్లిన అతడికి విజిలెన్స్‌లో చోటు ఎవరి ద్వారా వచ్చిందా అన్న అంశంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

మొంథా టెన్షన్!

(5వ పేజీ తరువాయి)

గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, కృష్ణాజిల్లాకు ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి నియమతులయ్యారు. ఆదివారం రాత్రి 9 గంటల సమయానికి కాకినాడకు తూర్పు - ఆగ్నేయంగా 720 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన వాయుగుండం గంటకు 6 కిలోమీటర్ల వేగంతో ముందుకు కదులుతూ వస్తోంది. దీనిని బట్టి చూస్తే ఈ నెల 28వ తేదీ నాటికి తుఫాను ప్రభావం కనిపించే అవకాశం ఉంది. వాయుగుండం దగ్గర పడుతున్న కొద్దీ బలమైన గాలులు, అతి భారీ వర్షాలు రెండు జిల్లాల్లో పడనున్నాయి. వాయుగుండం మచిలీపట్నం, కళింగపట్నం మధ్యన కాకినాడను తాకేలా తీరాన్ని దాటనుందని చెబుతున్నప్పటికీ.. దగ్గరగా వస్తున్నకొద్దీ దిశ మార్చుకుంటే మాత్రం కష్టమవుతుంది. మచిలీపట్నం వైపు దిశ మార్చుకుంటే మాత్రం మనకు ప్రమాదం పొంచి ఉన్నట్టే.

ఆక్వా రైతుల్లో ఆందోళన

కృష్ణాజిల్లాలో ప్రధానంగా ఆక్వాకు తీరని నష్టం కలిగించే పరిస్థితులున్నాయి. చేపలు, రొయ్యలు, పీతల సాగు లక్షలాది ఎకరాల చెరువుల్లో జరుగుతోంది. భారీ వర్షాలకు ఉష్ణోగ్రతలు పడిపోతాయి. దీంతో ప్రత్యేకంగా పెంచుతున్న చేపలు, రొయ్యలు ఎక్కువగా చనిపోవటానికి అవకాశం ఉంటుంది. బలమైన గాలులు కారణంగా విద్యుత్ వ్యవస్థ స్తంభిస్తే మాత్రం ఆక్వా రంగానికి పెద్ద నష్టం జరుగుతుంది. చేపలు, రొయ్యలకు ఆక్సిజన్ అందకపోతే మాత్రం అవి చనిపోతాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఫ్లాష్ ఫ్లడ్స్ భయం

రెండు జిల్లాలో ఫ్లాష్ ఫ్లడ్స్ వస్తే పరిస్థితి ఏమిటన్నది కూడా ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల కాలంలో క్లౌడ్ బరస్ట్‌ జరుగుతున్నాయి. కుండపోతగా వర్షాలు కురిస్తే.. రెండు జిల్లాలో ఆక్రమణలో ఉన్న డ్రైనేజీ కాల్వల కారణంగా ఎటు నుంచి ఫ్లాష్ ఫ్లడ్స్ వస్తాయో తెలియని దుస్థితి నెలకొంది. రెండు జిల్లాల అధికారులు గ్రామ, మండల స్థాయిలో డ్రెయిన్ల ఆక్రమణల తొలగింపు, పూడికతీత పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. కృష్ణాజిల్లాలో దివిసీమ, నాగాయలంక, అవనిగడ్డ, సొర్లగొంది వంటి ప్రాంతాలు ముంపులో చిక్కుకుంటే అనేక గ్రామాలకు రాకపోకలు తెగిపోయే ప్రమాదం ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో వాగుల కారణంగా రోడ్లు దెబ్బతింటే అనేక గ్రామాల రాకపోకలకు అవాంతరాలు ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి. వీటన్నింటినీ అధికారులు ఎదుర్కోవాలంటే.. క్షేత్ర స్థాయిలో తక్షణ సన్నద్ధత కోసం చర్యలు చేపట్టేలా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. కాగా, మొంథా తుఫాను నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సోమవారం నుంచి మూడు రోజుల పాటు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్ 140,149, 160
చికెన్ విత్ స్కిన్ 270
చికెన్ స్కిన్‌లెస్ 280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

నేటి పీజీఆర్ఎస్ రద్దు : కలెక్టర్

కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను కారణంగా సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధికారులతో పాటు డివిజన్, మండల స్థాయి అధికారులు అందరూ క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో వుండాల్సిన అవసరం ఉందన్నారు. దానివల్ల పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేశామని తెలిపారు.



బాధితులకు నగదు సాయాన్ని అందజేస్తున్న గద్దె క్రాంతికుమార్

బాధితులకు ఆర్థిక సాయం

మాచవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కొండ చరియలు విరిగిపడి నిర్వాసితులైన బాధితులకు ప్రభుత్వ సాయం అందేలా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చర్యలు తీసుకుంటున్నారని గద్దె క్రాంతికుమార్ తెలిపారు. ఆరో డివిజన్‌లో బాధితులను ఆదివారం పరామర్శించారు. బాధితులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున క్రాంత తన సొంత నిధులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుపాను కారణంగా రానున్న మూడు రోజులు అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని కొండ ప్రాంతాల ప్రజలకు సూచించారు. డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్, దాసరి గాబ్రియేలు, మొకర గురునాధం, వనము దుర్గారావు, వడ్డేపల్లి కేశవ్, సుగసాని కృష్ణప్రసాద్, వడ్డేపల్లి సుబ్బారావ తదితరులు పాల్గొన్నారు.

● **రాణిగారితోట :** ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా ముందుండే వ్యక్తి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్ని 18వ డివిజన్ టీడీపీ నాయకులు పేర్కొన్నారు. రమాదేవి అనే మహిళకు గుండె ఆపరేషన్ నిమిత్తం మంజూరైన రూ.1.75 లక్షల చెక్‌ను ఆదివారం అందజేశారు. రమాదేవి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే సీఎం సహాయ నిధి సహాయాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారని, దానిలో భాగంగా అందజేసినట్టు తెలిపారు.



తుమ్మల శ్రీకుమార్‌ను సన్మానిస్తున్న పటమట సీనియర్ సిటిజన్స్ పొన్నగంటి సాంబశివరావు, కొల్లిపర రామ్మోహన్‌రావు, తదితరులు

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదీ!

» అధ్యాపకులు తుమ్మల శ్రీకుమార్

భారతీనగర్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిక్షణ బాధ్యత అందరూ తీసుకోవాలని అధ్యాపకులు తుమ్మలశ్రీకుమార్ అన్నారు. 11వ డివిజన్‌లో పీఅండ్‌టీ కాలనీలోని పటమట సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆదివారం సభ్యులు పొన్నగంటి సాంబశివరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లైలా కళాశాల హెచ్‌వోడీ తుమ్మలశ్రీకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. సభ్యులు కొండపల్లి మాధవరావుచే కవి సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో కార్యదర్శి కొల్లిపర రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి టీటీడీ ఆధ్వర్యంలో కార్తీకమాస మహోత్సవాలు

విజయవాడ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాస మహోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ తెలిపారు. వెంకటేశ్వరపురంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్, కరపత్రాలను ఆలయ చైర్మన్ చిలుకూరి రామ్మోహన్‌రావు, జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు బాల కోటేశ్వరరావు, నండూరి వెంకట తాండవ కృష్ణలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ 'ప్రతి సంవత్సరం టీటీడీ మన గుడి అనే పేరుతో కార్తీక పురాణ విశిష్టతను ఏడు రోజుల పాటు ప్రవచనాలుగా భక్తులకు అందించడం జరుగుతుందన్నారు. ఈనెల 30 నుంచి నవంబరు 5 వరకు ఈ ప్రవచనాలు చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు శివ సహస్రనామ / విష్ణు సహస్ర నామ స్తోత్రం పారాయణ ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రెంటచింతల శర్మ, శివాలయ ఆలయ అర్చకులు గంటి నరసింహమూర్తి, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

తప్పుడు ఎస్టీ సర్టిఫికెట్లు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలి

గాంధీనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బీసీ కులానికి చెందిన కొందరు బోగస్ ఎస్టీ సర్టిఫికెట్లు పొంది తమకు రాజ్యాంగం ప్రకారం రావాల్సిన లబ్ధిని పొందుతూ తమకు తీరని అన్యాయం చేస్తున్నారని ఎరుకుల సంఘాల ప్రతి నిధులు ఆవేదన వ్యక్తం చేశారు. తిమ్మసర్తి నాగేశ్వ రరావు, ఉప్పు శ్రీనివాస్ ఆదివారం గాంధీ నగర్‌లో మీడియాతోమాట్లాడారు. పరికిముగ్గుల, పాముల, సొయిాలు, పెద్దింటి గొల్లలు, వడ్డెర, కత్తెర కులా లకు చెందిన వారు తప్పుడు ఎస్టీ (ఎరుకుల) సర్టిఫికెట్లతో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కించుకుంటున్నారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులుగా, రాజకీయ పదవులు పొందుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తక్ష ణమే స్పందించి రాష్ట్రవ్యాప్తంగా తప్పుడు సర్టిఫి కెట్లు పొందిన వారిని గుర్తించి, రద్దుచేసి ఎరు కులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సర్టిఫికెట్లు మంజూరు చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రమాదకరంగా కేబుల్ వైర్లు

» తెగిపడి ఉన్న కేబుల్ వైర్లతో ప్రజల పాట్లు
» రాత్రి వేళల్లో రాకపోకలు సాగించాలంటేనే హడల్
» పట్టించుకోని సంబంధిత అధికారులు

(భారతీనగర్,ఆంధ్రజ్యోతి)

ప్రధాన, అంతర్గత రోడ్లలో తెగిపడిఉన్న కేబుల్ వైర్లుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూర్పు నియోజక వర్గంలోని పీఅండ్‌టీ కాలనీ, విజయనగర్ కాలనీ, ఏపీఐఐసీ కాలనీ, గురునానక్, విజయలక్ష్మి కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీ, తదితర కాలనీ లో స్తంభాలకు కేబుల్ వైర్లు ఏర్పాటు చేశారు. అవి పలు చోట్ల తెగిపోయాయి. కిందకు వేలాడడంతో ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయంలో రాకపోకలు సాగించాలంటే భయంగా ఉందని పాదచారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పంట కాలువ రోడ్లోని హైస్కూల్ సెంటర్ నాలుగు రోడ్ల కూడలి వద్ద తెగిప్రమాదకరంగా కేబుల్ వైర్లు

దాతల సాయాన్ని అందిపుచ్చుకోవాలి

» కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి

మొగల్రాజపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దాతల నుంచి సహాయం పొందిన ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని, వారి స్ఫూర్తితో మరి కొందరికి సాయం చేయాలని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి అన్నారు. మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం కమ్మ విద్యార్థి సహాయక సంఘం ఆధ్వర్యంలో 440 మందికి రూ.30 లక్షల ఉపకార వేతనాలను అందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రహ్మం చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. సంఘ అధ్యక్షుడు ముత్తవరపు మురళీకృష్ణ, కార్యదర్శి పర్వతనేని ప్రభాస్ మాట్లాడుతూ 31 సంవత్సరాల నుంచి కుల మతలాలకు అతీతంగా ఆర్థికంగా వెనుక బడిన అన్ని వర్గాల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి చనుమోలు కృష్ణారావు, ఉపాధ్యక్షులు పొట్లూరి భాస్కర్‌రావు, మక్కెన ఆంజనేయులు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్ అందజేస్తున్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, మురళీకృష్ణ, భాస్కర్‌రావు, ప్రభాస్ తదితరులు

దుర్గగుడిలో ఊంజల్ సేవ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం రాత్రి సహస్రలింగార్చన సేవ, సహస్రదీపార్చన, ఊంజల్ సేవలు జరిగాయి. అర్చకులు నమక, చమక పారాయణలతో సహస్రలింగార్చన చేశారు. సహస్రలింగార్చన, సహస్ర దీపార్చన, ఊంజల్ సేవల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఇంద్రకీలాద్రిపై అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని సూర్యనారాయణమూర్తి ఆశీస్సులు అందుకున్నారు.



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

పారిశుధ్య కార్మికులకు కేన్సర్ పరీక్షలు

కానూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన నెల సందర్భంగా రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అను ఒమేగా హాస్పిటల్, వైఎస్ఆర్ చారిటీస్, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సహకారంతో ఆదివారం కానూరులోని వరలక్ష్మీపురం రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాలులో తాడిగడప మున్సిపాలిటీలో పనిచేసే మహిళా పారిశుధ్య కార్మికులకు రొమ్ము కేన్సర్, గర్భశయ కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల ద్వారా కేన్సర్‌ను ముందే గుర్తించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి. విజయభాస్కర్, కనకదుర్గ దేవస్థానం సభ్యుడు వెలగపూడి శంకరబాబు, డి. రవికిరణ్, వైద్యనిపుణులు డాక్టర్ నాదేళ్ల ఆదిత్య, బత్తుల కవితతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. 113 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

నాయకులు మార్గదర్శిగా ఉండాలి

విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీకాంతం

గవర్నర్‌పేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నాయకుడు ఎల్లప్పుడూ మార్గదర్శిగా ఉండాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి బి. లక్ష్మీకాంతం అన్నారు. లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 316డీ ఆధ్వర్యంలో ఆదివారం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో బీ యూనిక్ ఇన్ లీడర్‌షిప్ అనే అంశంపై సెమినార్ జరిగింది. డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ రామిశెట్టి కొండలరావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంతం మాట్లాడుతూ ఒక చిరునవ్వుతో ఎంత దూరం అయినా విజయంతో ముందుకు వెళ్లవచ్చన్నారు. సమాజ సేవలో లయన్స్ క్లబ్ సభ్యులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎం. గేయానంద్ మాట్లాడుతూ మనిషి మారితే సమాజం మారుతుందని అన్నారు. జిల్లా గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్స్ ప్రసాద్, చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, దామర్ల శ్రీశాంతి, గద్దె శేషగిరి, శంకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. సెమినార్ అనంతరం సభ్యులు లక్ష్మీకాంతంను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.



ఎంబీవీకేలో విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీకాంతంకు సత్కారం



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విజయవాడ కల్చరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దృశ్య వేదిక ఆధ్వ ర్యంలో నిర్వహించిన నెలవారీ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంత రాయ గ్రంథాలయంలో ఆదివారం 'శాస్త్రీయం-జానపదం' కార్యక్రమం నిర్వహిం చారు. నాట్యాచార్య రాయన శ్రీనివాసరావు బృందం ప్రదర్శించిన ఆంధ్ర నాట్యం ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. కుంభ హారతి, శివకైవారం, ముద్దుగారే యశోధ వంటి అంశాలతో చక్కగా నాట్యాన్ని ప్రదర్శించారు. తదుపరి ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాల నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్ శిష్య బృందం 50 మంది చేసిన బృంద నాట్యాలు ఆకట్టుకున్నాయి. శీరం బ్రహ్మణ్యం పేరిట స్మారక పురస్కారాన్ని ప్రముఖ నాట్యాచార్యుడు హేమంత్‌కుమార్‌కు ప్రదానం చేసి సత్కరిం చారు.

కార్యక్రమంలో అంబటి మధుమోహన్‌కృష్ణ, దొంతల ప్రకాష్, ఇ.విజయ సాగర్, పి.విజయభాస్కర్, రమేష్‌బాబు, డాక్టర్ సుమసాగర్, ఎన్.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో భక్తి సంగీతం

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానం కళావేదికపై కాకినాడకు చెందిన స్వరరాగ సుధ సంగీత విద్యాలయం విద్యార్థులు ముత్తుస్వామి దీక్షితార్ ఆరాధనోత్సవం సందర్భంగా ఆదివారం భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కె. శీనానాయక్ జ్యోతి వెలిగించారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మాట్లాడుతూ కనకదుర్గ అమ్మవారు లలిత కళలకు అధిష్టానదేవత కాబట్టి అమ్మ ముందు సంగీతాలాపన చేయడం కళాకారులకు గొప్ప భాగ్యమని తెలిపారు. ఈవో మాట్లాడుతూ సంగీత త్రిమూర్తులుగా పిలవబడే త్యాగరాజు, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రివార్లలో ముత్తు స్వామి దీక్షితార్ వారి ఆరాధన సందర్భంగా ప్రసిద్ధ కళాకారులు దుర్గమ్మ సన్నిధిలో గీతాలాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో కీర్తనలు ఆలకించారు.

యనమలకుదురు సూర్య పాఠశాలకు ఎడ్యూకాన్-2025 అవార్డు

పెనమలూరు, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): యనమలకుదురు సూర్య విద్యానికేతన్‌కు రాష్ట్ర స్థాయి ప్రతిష్టాత్మక ఎడ్యూకాన్ అవార్డు లభించిందని సంస్థ డైరెక్టర్ అబ్రార్ అలీ తెలిపారు. విద్యారంగంలో విశేష కృషి చేసి విద్యార్థుల భవిష్యత్తును రూపుదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తున్న సూర్యవిద్యానికేతన్‌కు ఎంపీ, గీతం విశ్వవిద్యాలయం అధినేత ఎం భరత్ చేతుల మీదుగా అవార్డు లభించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ అలీని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

భారతీనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప నగర్ కాలనీలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నాగపంచమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణాజిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, కార్పొరేటర్ పొట్లూరి శివసాయిప్రసాద్ స్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరంచి అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్తీక మొదటి సోమవారం సందర్భంగా శ్రీవల్లిసమేత సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు, రాత్రి 8.30గంటలకు స్వామివారి కల్యాణమహోత్సవం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దనేకుల వెంకట సత్యనారాయణ, కార్యదర్శి అట్లూరి కిషోర్, కోశాధికారి గొల్లపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకంగా అలంకరించిన సుబ్రహ్మణ్యస్వామి

గురునానక్ కాలనీ శివాలయంలో..

గురునానక్ కాలనీలోని శివాలయంలో సోమవారం పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు సభ్యులు తెలిపారు.

విజిలెన్స్ వారోత్సవాలు నేటి నుంచి

లబ్బీపేట, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ వారోత్సవాలు సోమవారం నిర్వహిస్తున్నట్లు పోస్టల్ అధికారులు తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని ప్రతిఏటా వారం రోజులు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజిలెన్స్ - మన అందరి భాగస్వామ్య బాధ్యత అనే అంశంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

కానూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ముంచుకు వస్తున్న మొంథా తుఫాన్ నేపథ్యంలో తాడిగడప మున్సిపాలిటీలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిప ల్ కమిషనర్ షేక్ నజీర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లోని పర్యటించారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ, తుఫాన్ వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలని వారి సహాయం నిమిత్తం తాడిగడప మున్సి పాలిటీలోని పోరంకి, కానూరు, తాడిగడప, యన మల కుదురు గ్రామాల్లోని 19 సచివాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా తాడిగడప మున్సిపల్ కార్యాలయంలో సెంట్రల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

NAVRANG A/C
RUNNING VERY SUCCESSFULLY



హిందీ వెర్షన్ - రోజు 4 ఆటలు
11-30AM, 2-45PM, 6-30PM, 9-45PM
ONLINE TICKETS AVAILABLE IN " BOOK MY SHOW"

నేడే చూడండి
అప్సర సినిమా



రోజూ : 4 ఆటలు
11-30AM, 2-30PM, 6-30PM, 9-45PM
ప్రవేశపు రేట్లు తగ్గింపు:
రూ. 105, రూ.90, రూ. 70
www.bookmyshow.com

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-235849

PLOTS FOR SALE

» విజయవాడ న్యూలాంచింగ్ ఓపెన్ ఫ్లాట్స్ & విల్లాస్. గన్నవరం to పురుషోత్తపట్నం 100 అ. రోడ్ HCL, మేథ, ఎయిర్‌పోర్ట్ 2 KM రాంకీ టవర్స్ ఎదురుగా 10 ఎకరాల CRDA, RERA 50% బ్యాంక్‌లోన్. గజం 21,500/- Hyma Prasad సెల్:99596 45468
AJB-314

WANTED

» విజయవాడ మెట్రోపాలిటన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. ఫ్రంట్ ఆఫీసు అసిస్టెంట్ (Male), HK సూపర్‌వైజర్ (Need Hotel Exp), వెల్డర్, ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 72888 85598
AJB-898

EDUCATION

» ఆంధ్రా, నాగార్జున యూనివర్శిటీల ద్వారా Degree, P.G, MBA, MCA, డైరెక్టు 10th ఒకే సం.లో ఇంటర్, భవ్య అకాడమి (Since : 2001) ✆ 99486 65678
AJB -115

DISTANCE EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA ✆ 99493 08940
AJB-235780

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నిర్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ. 290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868,
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240




ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.
అందిస్తోంది
సిటీ / జిల్లా ప్రకటనలకు 25% డిస్కౌంట్
జోన్ ప్రకటనలకు 15% డిస్కౌంట్
పటమట : 99854 11868, 1 టౌన్ : 99854 09286
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, పెనమలూరు : 99854 09240
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11868, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234

దిక్సూచి

ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ ఎంట్రీ స్కీమ్



మొత్తం ఖాళీలు: 90

ఇండియన్ ఆర్మీలోని 10 ప్లస్ 2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్(టీఈఎస్) కోర్సులో ప్రవేశాల కోసం అవివాహితులైన పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను కోరుతున్నారు. ఇందులో ఎంపికైన వారికి బీటెక్ డిగ్రీతోపాటు, సైన్యంలో లెఫ్టినెంట్ ఉద్యోగంలో చేరవచ్చు.

కోర్సు:

టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ 55 కోర్సు(టీఈఎస్) - 2025 జూలై 2026

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. అయితే ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ తప్పనిసరిగా చదివి ఉండాలి. దీనితోపాటు జేఈఈ మెయిన్ 2025 స్కోరు సాధించాలి.

వయస్సు: 2025 జూలై 1 నాటికి పదహారున్నర సంవత్సరాల నుంచి పంతొమ్మిదిన్నర సంవత్సరాల మధ్యలో ఉండాలి.

వేతనం: మిలిటరీ సర్వీస్ పే కింద చదువుకునే కాలంలో స్టైపెండ్ నెలకు 15,500/- రూపాయలు లభిస్తుంది. తర్వాత 56,000/- వేతనంతో పాటు డీఏ, హెచ్ఆర్ఏ ఇతర ప్రోత్సాహకాలు అందుతాయి.

ఎంపిక విధానం: జేఈఈ(మెయిన్) స్కోరు, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక ఉంటుంది.

కోర్సు శిక్షణ: కోర్సు కాల వ్యవధి నాలుగు సంవత్సరాలు. ఇందులో బేసిక్ మిలిటరీ ట్రైనింగ్, బీటెక్ టెక్నికల్ శిక్షణ ఇస్తారు. మొదటి మూడేళ్లు పుణె, సికింద్రాబాద్, మావ్‌లోని ఆర్మీ కేంద్రాల్లో ఈ శిక్షణ ఉంటుంది. తరవాత డెహ్రాడూన్‌లోని 'ఇండియన్ మిలిటరీ అకాడమీ'లో శిక్షణ కొనసాగుతుంది. ఆపై డిగ్రీతోపాటు, లెఫ్టినెంట్ హోదాలో సైన్యంలో విధుల్లోకి తీసుకుంటారు.



చివరి తేదీ: 2025 నవంబర్ 13

వెబ్‌సైట్: joinindianarmy.nic.in

డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి యూసీడ్ - 2026

డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్'(యూసీడ్)- 2026 నోటిఫికేషన్ వెలువడింది. దీనిని బాంబే ఐఐటీ నిర్వహిస్తోంది. ఈ నోటిఫికేషన్ ద్వారా ఐఐటీలు సహా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ డిజైన్ ఇన్‌స్టిట్యూట్‌లలోని బీడిజైన్ కోర్సుల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఇంటర్ పూర్తి చేసిన వారు యూసీడ్ ఎంట్రెన్స్ రాయడానికి అర్హులు. 'యూసీడ్ స్కోరు వాలిడిటీ ఏడాది. వరుసగా రెండు సంవత్సరాలు మాత్రమే అభ్యర్థులు ఈ ఎంట్రెన్స్ రాయవచ్చు.

వయస్సు: దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2001 అక్టోబర్ 10 తరువాత జన్మించి ఉండాలి. దివ్యాంగులు, ఇతర రిజర్వేషన్ల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయస్సులో సడలింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 అక్టోబర్ 31

పరీక్ష తేదీ: 2026 జనవరి 18 **ఫలితాలు:** 2026 మార్చి 6

పరీక్ష సెంటర్లు: తెలుగు రాష్ట్రాల్లో యూసీడ్ పరీక్ష సెంటర్లు హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్నాయి.

వెబ్‌సైట్: www.uceed.iitb.ac.in/2026/

UCEED 2026

పారా మెడికల్‌లో పీజీ, పీజీ డిప్లొమా

ఆంధ్రా యూనివర్సిటీ, బొల్లినేని మెడ్‌స్కిల్స్ కలిసి పీజీ, పీజీ డిప్లొమా(సెల్ఫ్ సపోర్టెడ్) కోర్సుల్లో అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్: రెండు సంవత్సరాల కోర్సు ఇది. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. కోర్సు ఫీజు 55000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ క్రిటికల్ కేర్ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 60000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 60000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ గ్యాస్ట్రోఎంట్రాలజీ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 40000 రూపాయలు.

వయస్సు: అభ్యర్థుల వయస్సు 20 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

చివరి తేదీ: 2025 నవంబర్ 7

ఫోన్: 7995013421, 7207953919

వెబ్‌సైట్: www.audoa.andhrauniversity.edu.in



డీఆర్‌డీఈలో అప్రెంటిస్‌షిప్

బెంగళూరులోని డీఆర్‌డీఓ ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో ఏడాది కాలానికి గ్రాడ్యుయేట్ డిప్లొమా, ఐటీఐ అప్రెంటిస్‌షిప్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

ఖాళీల వివరాలు:

- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్(ఇంజనీరింగ్)- 23
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్(జనరల్) - 27
- డిప్లొమా(ఇంజనీరింగ్) అప్రెంటిస్‌షిప్ - 27
- ఐటీఐ అప్రెంటిస్‌షిప్ - 30

మొత్తం ఖాళీలు 105

విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, బీకాం, బీబీఏ, బీఎస్సీ, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఆటోమొబైల్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫోటోగ్రాఫర్, ఎలక్ట్రీషియన్ తదితరాలు ఉన్నాయి.

అర్హతలు: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ/డిప్లొమా/గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.

వయస్సు: 18 సంవత్సరాలు పూర్తి కావాలి.

దరఖాస్తు విధానం: ఐటీఐ అభ్యర్థులు ఎన్ఏపీఎస్ పోర్టల్‌లో, ఇతరులు ఎన్ఏటీఎస్ పోర్టల్ దరఖాస్తు చేసుకోవాలి.

ఇంటర్వ్యూ హాజరు కావాల్సిన తేదీ: 2025 నవంబర్ 4

చిరునామా: ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్, సీవీ రామన్ నగర్, బెంగళూరు.

వెబ్‌సైట్: drdo.gov.in/

SCHOLARSHIP ALERT

Mahindra Big Boss Nayi Pehchan Scholarship

Description: The Mahindra Big Boss Nayi Pehchan Scholarship 2025-26 is designed to empower children of freelance tractor mechanics by offering a scholarship of INR 6,000 annually to support their educational journey.

Eligibility:

- Children of freelance tractor mechanics.
- Aged 7 to 21 years, enrolled in school, college, or vocational courses.
- 50% marks (or equivalent) in the previous class/semester.
- Open to students across India.
- SC/ST/OBC reservations available.
- Children of Buddy4Study or Mahindra & Mahindra Ltd. employees are not eligible.

Prizes & Rewards: Students will receive a scholarship amount of INR 6000/-.

Last Date to Apply: 15-11-2025

Application mode: Online applications only

L'Oréal For Young Women in Science Program

Description: L'Oréal India offers the L'Oréal For Young Women in Science Program 2025-26 for young women who have passed Class 12 and wish to pursue higher education in scientific fields.

Eligibility: Open to female students only.

- Annual family income should not exceed INR 6,00,000.
- **UG students:** Must have secured at least 85% marks in Class 12 (Science Stream) and be pursuing an undergraduate degree in a science-related field (except final-year students).
- **PG/PhD students:** Must have secured at least 60% marks in their undergraduate course and be pursuing post-graduation (any year) in fields such as Technology, Science, Pharma, Life Sciences, Biotechnology, etc. (except final-year students).
- Students from PAN India are eligible.
- Children of L'Oréal India and Buddy4Study employees are not eligible.

Prizes & Rewards:

- **UG students:** Fixed scholarship of INR 62,500
- **PG and PhD students:** Upto scholarship of INR 1,00,000

Last Date to Apply: 03-11-2025 *Application mode:* Online only

Short Url: www.b4s.in/aj/LIS6

Muskaan Scholarship Program 2.0

Description: An initiative by Valvoline Cummins Private Ltd. (VCPL) to offer financial assistance and mentorship support to children of commercial drivers (LMV/HMV), mechanics and children belonging to the Economically Weaker Sections (EWS) category, ensuring continuity in their education.

Eligibility: Students in Classes 9 to 12 from the southern, eastern, and northeastern states of India are eligible to apply for the scholarship. The scholarship is available to children of commercial drivers (LMV/HMV), children of mechanics, and students belonging to the Economically Weaker Sections (EWS) category. To be eligible, applicants must have scored above 60% in their previous class. Additionally, the total family income from all sources should not exceed INR 8 lakh per annum. However, children of employees of Valvoline Cummins Private Ltd. (VCPL) and its implementation partner organisations are not eligible for this scholarship.

Prizes & Rewards: Scholarship of up to INR 12,000 and mentorship support

Last Date: 05-11-2025 *Application:* Online only

Short Url: www.b4s.in/aj/MKSP2

buddy4study.com

చిత్రజ్యోతి

SINCE 1965

నా పరువుకు భంగం కలుగుతోంది

● సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులకు చిరంజీవి ఫిర్యాదు



తన రూపాన్ని పోలిన ఏఐ డీప్‌ఫేక్ చిత్రాలను, వీడియోలను సృష్టించి.. వాటికి అసభ్య, అశ్లీల కంటెంట్‌ను జోడించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని హీరో చిరంజీవి శనివారం సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధనార్జనే ధ్యేయంగా నా రూపాన్ని మార్ఫింగ్ చేస్తూ, అసభ్యకరమైన కంటెంట్‌ను అప్‌లోడ్ చేస్తున్న పలు అక్రమ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ చానల్స్‌ను వెంటనే బ్లాక్ చేయాలని కోరారు. తన దృష్టికి వచ్చిన కొన్ని వెబ్ లింక్స్‌ను ఆయన పోలీసులకు అందజేశారు. 'దశాబ్దాల పాటు కష్టపడి నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాను. ఇలాంటి చర్యలతో నా పరువుకు భంగం కలుగుతోంది. కోట్లాది మంది అభిమానాన్ని చూరగొన్న నన్ను కించపరిచేలా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నీచపు పనులకు పాల్పడుతున్నారు. వారిని కఠినంగా శిక్షించండి' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)



హీరో నారా రోహిత్, శిరీషల వివాహం ఈ నెల 30న జరగనుంది. ఆదివారం హల్దీ వేడుకతో పెళ్లి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శిరీషతో దిగిన ఫొటోను నారా రోహిత్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

పోరాటాలే ప్రత్యేకాకర్షణగా

గోపీచంద్ కథానాయకుడిగా సంకల్ప్ రెడ్డి ఓ భారీ యాక్షన్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'గోపీచంద్ 33' అనేది వర్కింగ్ టైటిల్. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బేనర్‌పై శ్రీనివాసా చిట్టూరి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కథానాయకుడు గోపీచంద్, ఇతర తారాగణం పాల్గొంటుండగా వెంకట్ మాస్టర్ నేతృత్వంలో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ యాక్షన్ ఎపిసోడ్ సినిమాకే హైలెట్‌గా నిలవనుందని యూనిట్ తెలిపింది. కాగా, మేకర్స్ విడుదల చేసిన స్పెషల్ పోస్టర్, గ్లింప్స్ వీడియోకు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఆ పోస్టర్‌లో యోధుడిలా కనిపించిన గోపీచంద్ తన పాత్రలోని ఇంటెన్స్‌ని ప్రజెంట్ చేశారు. మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో గోపీచంద్ కనిపించబోతున్నట్లు ప్రచార చిత్రాలను చూస్తే అర్థమవుతోంది. విభిన్నమైన కథలతో, సాంకేతిక నైపుణ్యంతో ప్రత్యేక గుర్తింపు పొందిన సంకల్ప్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటం వల్ల అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఈ చిత్రానికి సౌందర్ రాజన్ డీఓపీగా వ్యవహరిస్తుండగా, అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు.





రజనీ - కమల్ మూవీ పక్కా

రజనీకాంత్, కమల్ హాసన్ కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా ఎప్పుడు ప్రారంభం కాబోతోంది? దర్శకుడు ఎవరు? అనే విషయాలు మాత్రం ఇప్పటి వరకూ వెల్లడి కాలేదు. మొదట్లో ఈ ప్రాజెక్టుకు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తారనే వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ప్రదీప్ రంగనాథన్ పేరు విన్పించింది. కానీ తాను డైరెక్ట్ చేయడంలేదని ప్రదీప్ తెలిపారు. దీంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కుతుందా అన్న అనుమానాలు అభిమానుల్లో కలిగాయి. అయితే రజనీకాంత్ కూతురు సౌందర్య మాత్రం కచ్చితంగా ఈ సినిమా తెరకెక్కుతుందని అంటున్నారు. ఇటీవల ఓ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఆమె ఈ సినిమాని రాజ్ కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తారని స్పష్టం చేశారు. రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ కలసి నటిస్తే చూడాలనే ఆశ తనకూ ఉందని చెప్పారు. ప్రస్తుతం ఆ సినిమాకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి, వివరాలను నాన్నగారు త్వరలో స్వయంగా వెల్లడిస్తారు అని సౌందర్య తెలిపారు. ఆ మధ్య సైమా అవార్డుల వేడుకలో కూడా కమల్ హాసన్ ఈ విషయంపై స్పందించారు. 'ప్రేక్షకులు మా కాంబినేషన్‌ని ఇష్టపడితే మంచిదే కదా, వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. మేమిద్దరం కలసి నటించాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే మీ ముందుకు కలసి రానున్నాం' అని అన్నారు. కాగా, వీరిద్దరూ కెరీర్ తొలినాళ్లలో 'అపూర్వ రాగంగళ్', 'మూండ్రు ముడిచ్చు', 'అంతులేని కథ' వంటి హిట్ చిత్రాలతోపాటు సుమారు ఇరవైకి పైగా చిత్రాల్లో కలసి నటించారు. 1979లో వచ్చిన 'అల్లావుద్దీనుమ్ అద్భుత విళక్కుమ్' తర్వాత రజనీ, కమల్ కలసి నటించలేదు.



నెపోలియన్ రిటర్న్స్

కొన్నేళ్ల క్రితం 'నెపోలియన్' చిత్రంలో 'నా నీడ పోయింది సార్..' అంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అందర్నీ ఆకర్షించిన ఆనంద్ రవి ఈసారి మరో ఉత్కంఠభరితమైన కథతో వస్తున్నారు. ఆయన కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న కొత్త చిత్రం 'నెపోలియన్ రిటర్న్స్'. ఆచార్య క్రియేషన్స్ పతాకంపై భోగేంద్ర గుప్త నిర్మిస్తున్నారు. దివి కథానాయికగా నటిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన వేడుకలో టైటిల్‌ను ఆవిష్కరించి, గ్లింప్స్ విడుదల చేశారు. భోగేంద్ర గుప్తా మాట్లాడుతూ 'ఆనంద్ ఈ కథ కోసం చాలా కష్టపడ్డారు. ఏడాదిన్నరకు పైగా ప్రీ ప్రొడక్షన్ కోసమే పని చేశారు. మంచి కథతో అందరి ముందుకు రాబోతున్నాం' అని చెప్పారు. ఆనంద్ రవి మాట్లాడుతూ 'నేను పేరెంట్స్, ప్రతినిధి, నెపోలియన్, కొరమీను వంటి విభిన్న కథా చిత్రాలను తీశాను. కానీ సరైన సక్సెస్, గుర్తింపు రాలేదు. 'నెపోలియన్ రిటర్న్స్'తో ఆ రెండూ వస్తాయనే నమ్మకం ఇప్పుడు కలుగుతోంది. సినిమా మంచి ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది. తొమ్మిది నెలల పిల్లాడు ఆత్మగా మారే పాయింట్‌తో ఇంతవరకూ ఎక్కడా సినిమా రాలేదు' అని పేర్కొన్నారు. 'ఈ సినిమాలో నా క్యారెక్టర్‌కు మంచి పేరు వస్తుంది' అని చిత్ర కథానాయిక దివి అన్నారు.

లార్డ్ మార్కో?



మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి కొత్త చిత్రం ఖరారైంది. 'మార్కో', 'కట్టలాన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ విషయాన్ని నిర్మాత షరీఫ్ మహ్మద్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. మమ్ముట్టి పాత్ర ఎలా ఉండబోతోందో తెలుపుతూ ఓ ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేశారు. మునుపెన్నడూ పోషించని ఓ విభిన్నమైన పాత్రలో మమ్ముట్టి కనిపించనున్నట్లు షరీఫ్ తెలిపారు. దర్శకుడు, ఇతర తారాగణం వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. అయితే ఈ చిత్రం పేరు 'లార్డ్ మార్కో' అయి ఉంటుందని పలు ఊహాగానాలు విన్పిస్తున్నాయి. 'మార్కో' డైరెక్టర్ హనీఫ్ అదేని, క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థతో కలిసి నెల రోజుల క్రితం కేరళ ఫిల్మ్ ఛాంబర్‌లో 'లార్డ్ మార్కో' టైటిల్‌ని రిజిస్ట్రేషన్ చేయించడం ఈ ఊహాగానాలకు ఊతమిస్తోంది. కాగా, మమ్ముట్టి నటించి, నిర్మించిన 'కలమ్ కావల్' సినిమా నవంబరు 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా విడుదల తర్వాతే మమ్ముట్టి కొత్త ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశాలున్నట్లు సమాచారం.

లవ్ అండ్ వార్ ఇటలీలో క్లైమాక్స్‌కు







దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ గ్రాండియర్‌గా తెరకెక్కిస్తోన్న బాలీవుడ్ చిత్రం 'లవ్ అండ్ వార్'. రణ్‌బీర్‌కపూర్, విక్కీ కౌశల్, అలియాభట్ ప్రధాన తారాగణం. త్వరలో ఇటలీలో ఈ చిత్రం షెడ్యూల్ జరగాల్సి ఉంది. అయితే ఆ షెడ్యూల్‌ను రద్దు చేసి ముంబైలోనే షూటింగ్ జరిపేందుకు మేకర్స్ సిద్ధమైనట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. భారీ సెట్స్ నిర్మించి అందులో ఇటలీకి సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించనున్నారనేది ఆ వార్తల సారాంశం. అయితే ఆ వార్తల్లో నిజం లేదని మేకర్స్ తెలిపారు. అయితే ఆ షెడ్యూల్ రద్దు కాలేదని మేకర్స్ తెలిపారు. కథానుసారం రియల్ లొకేషన్లలోనే చిత్రీకరించనున్నట్లు తెలిపారు. నవంబర్‌లో పది రోజుల షెడ్యూల్‌ను ముంబైలో ప్లాన్ చేస్తున్నారు. అది పూర్తయ్యాక 20 రోజుల పాటు సాగే గ్రాండ్ క్లైమాక్స్ షెడ్యూల్‌ను డిసెంబర్‌లో ఇటలీలో చేయనున్నారు. అక్కడ 45 రోజుల షెడ్యూల్‌ను ప్లాన్ చేసినా చివరకు 20 రోజులకు కుదించినట్లు మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఆర్యన్ ప్రణయ గీతం



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు. ఈనెల 31న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని సుధాకర్ రెడ్డి(శ్రేష్ఠ్ మూవీస్) విడుదల చేస్తున్నారు. ఇటీవలె విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. తాజాగా చిత్రబృందం 'పరిచయమే...' అంటూ హీరో, హీరోయిన్ మధ్య సాగే ప్రణయ గీతాన్ని విడుదల చేసింది. స్వామ్రాట్ రాసిన ఈ గీతానికి జిబ్రాన్ అద్భుతమైన స్వరాలు సమకూర్చారు. వరుస హత్యల నేపథ్యంలో ఉత్కంఠభరితంగా సాగే ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ తెలిపారు. కాగా, ఈ చిత్రానికి హరీశ్ కన్నన్ డీఓపీగా వ్యవహరిస్తున్నారు.

నులిపురుగులకు చెక్ ఇలా...



సాధారణంగా పిల్లలకు కడుపులో నులిపురుగులు చేరుతూ ఉంటాయి. దీంతో పిల్లలు నీరసించిపోతూ ఉంటారు. వారి ఎదుగుదల ఆగిపోతుంది. అనారోగ్యానికి గురవుతుంటారు కూడా. అలా కాకుండా చిన్న చిట్కాలతో ఈ నులిపురుగుల సమస్యను వదిలించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు...

- రోజూ రెండు లేదా మూడు పచ్చి వెల్లుల్లి రెబ్బలను పిల్లలతో తినిపిస్తూ ఉంటే సమస్య తీరుతుంది. వెల్లుల్లిలోని సల్ఫర్ సమ్మేళనాలు, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు... కడుపులోని పురుగులను నాశనం చేస్తాయి.
- గుమ్మడి గింజల్లో కుకుర్‌బిటాసిన్ సమ్మేళనం ఉంటుంది. ఇది జీర్ణాశయంలో చేరే పురుగులను తొలగించడానికి దోహదం చేస్తుంది. రోజూ పిల్లలు తినే ఆహారంలో గుమ్మడి గింజలు చేర్చడం మంచిది.
- నులిపురుగులను తొలగించడంలో బొప్పాయి పండు ఔషధంలా పనిచేస్తుంది. బొప్పాయిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్.. పొట్టతోపాటు జీర్ణవ్యవస్థను పూర్తిగా శుభ్రం చేస్తుంది. బాగా పండిన బొప్పాయి పండు ముక్కలను తరచూ పిల్లలతో తినిపిస్తుంటే ప్రయోజనం కనిపిస్తుంది.
- వాల్‌నట్స్‌లో యాంటీ పారాసైటిక్ గుణాలు ఉంటాయి. రాత్రిపూట వాల్‌నట్స్‌ను నీళ్లలో నానబెట్టి ఉదయాన్నే పిల్లలతో తినిపిస్తూ ఉంటే నాలుగు రోజుల్లో సమస్య తీరుతుంది.
- రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలతో ఒక చెంచా అల్లం రసం తాగించినా ఫలితం ఉంటుంది.
- పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాన్ని పిల్లలతో తినిపిస్తుంటే కడుపులోని నులిపురుగులు విసర్జితమవుతాయి. తృణధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలు, బీన్స్, కేరట్, బీట్‌రూట్, పసుపు, బెల్లం, కొబ్బరి, పెరుగును ఆహారంలో చేర్చడం వల్ల నులిపురుగుల సమస్య వెంటనే తీరుతుంది.

పండ్ల మీద స్టిక్కర్లు ఎందుకు?

మనం బజార్లో యాపిల్స్, నారింజ, కివీ లాంటి పండ్లు కొనేటప్పుడు వాటి మీద చిన్న చిన్న స్టిక్కర్లు అంటించి ఉండడం చూస్తుంటాం. వీటిని పండ్ల మీద ఎందుకు అంటిస్తారో తెలుసుకుందాం..



- ఈ స్టిక్కర్ల మీద పీఎల్‌యూ కోడ్ రాసి ఉంటుంది. దీని ద్వారా పండ్లను సాగు చేసిన విధానం అంటే వాటిని సేంద్రీయ పద్ధతుల ద్వారా పండించారా, రసాయనాలు ఉపయోగించారా, జన్యుపరంగా మార్పులు చేసి ఉత్పత్తి చేశారా అనే సమాచారం తెలుసుకోవచ్చు. పండ్ల నాణ్యతను అంచనా వేయవచ్చు. పీఎల్‌యూ కోడ్‌లో నాలుగు లేదా అయిదు అంకెలు ఉంటాయి.
- స్టిక్కర్ మీద తొమ్మిదితో మొదలై అయిదు అంకెలు ఉంటే ఆ పండ్లను పూర్తిగా సేంద్రీయ విధానంలో పండించారని అర్థం. పంటలో ఎటువంటి పురుగు మందులు, రసాయనాలు ఉపయోగించలేదని గుర్తించాలి. ఈ పండ్లను ఒకసారి మంచినీళ్లతో కడిగి తినవచ్చు. ఆరోగ్యానికి మంచివి.
- స్టిక్కర్ మీద నాలుగు అంకెలు మాత్రమే ఉంటే ఆ పండ్లను పండించేటప్పుడు రసాయనాలు, ఇతర పురుగుమందులు ఉపయోగించారని అర్థం. వీటి ధర కూడా తక్కువగా ఉంటుంది. వీటిని తినేముందు ఉప్పు నీళ్లలో కొద్దిసేపు నానబెట్టి రెండు లేదా మూడుసార్లు శుభ్రంగా కడగాలి.
- స్టిక్కర్ మీద ఎనిమిదితో ప్రారంభమై అయిదు అంకెలు ఉంటే ఆ పండ్లను జన్యుపరంగా మార్పు చేశారని అర్థం.



'వ్యర్థం అనే మాటకు అర్థం లేదు' అంటున్నారు తూర్పు గోదావరి జిల్లా కడియం ప్రాంతానికి చెందిన డ్వాక్రా మహిళలు. విక్రయించగా మిగిలిపోయిన, పాడైపోయిన పూలతో అగరుబత్తీలు తయారు చేసి... ఆదాయంతోపాటు ప్రశంసలనూ పొందుతున్నారు.

వ్యర్థ పుష్పాలతో ఉపాధి పరిమళాలు

'పూలు' అనగానే తూర్పుగోదావరి జిల్లా కడియం పేరు గుర్తుకువస్తుంది. కడియం, కడియపు లంక పరిసరాల్లో దాదాపు అయిదు వేల ఎకరాల్లో నర్సరీలు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాలు ఒకప్పుడు వరద ముంపు ప్రదేశాలు. వరదలతో పాటు వచ్చే ఒండ్రు మట్టితో నేల సారవంతంగా మారింది. 50 ఏళ్ల క్రితం నుంచి ఇక్కడి నర్సరీల్లో పూల సాగు జరుగుతోంది. గతంలో మల్లెలు, బంతి, చామంతి తదితర రకాలను సాగు చేసేవారు. అయితే కాలక్రమంలో నర్సరీ రైతులు వివిధ రకాల మొక్కల పెంపకం, విక్రయం వైపు మళ్లారు. దీంతో చిత్తూరు, కర్నాటక తదితర చోట్ల నుంచి పూలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకొని రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తున్నారు. కడియపులంకలోని హోల్‌సేల్ పూల మార్కెట్‌కు వివాహాలు, పండుగలు, పర్వదినాల్లో రోజుకు 100 టన్నుల వరకూ రకరకాల పువ్వులు వస్తాయి. కాగా అన్‌సీజన్‌లో రోజూ మిగిలిపోయిన, వాడిపోయిన పువ్వులు 10 టన్నుల వరకూ ఉంటాయి. వాటిని కాలువ గట్టున పడేయడం పరిపాటి. వాటి పునర్వినియోగంపై ఎవరూ దృష్టి సారించలేదు. ఈ నేపథ్యంలో... ఆ పువ్వులను ఏదో ఒక విధంగా ఉపయోగించాలని గత ఏడాది అప్పటి కలెక్టర్ ప్రశాంతి భావించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి.వి.ఎ్స.మూర్తికి సంబంధిత కార్యాచరణను అప్పగించారు. దీంతో 'కడియం నాచురల్ అగరుబత్తి' అనే వినూత్న ప్రాజెక్టు పట్టాలెక్కింది.



ఇలా మొదలైంది...

ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా తొలి దశలో 60 డ్వాక్రా మహిళలను ఎంపిక చేశారు. అన్నవరం దేవస్థానంలో వినియోగించిన పూలతో తయారు చేస్తున్న అగరుబత్తీల తయారీ కేంద్రానికి తీసుకువెళ్లి, సంబంధిత ప్రక్రియను పరిచయం చేశారు. తరువాత యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో నడుస్తున్న రీజనల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ సంస్థ ద్వారా... విజయనగరం నుంచి అనుభవం కలిగిన ఒక వ్యక్తిని తీసుకువచ్చి శిక్షణ ఇప్పించారు. 'పీఎం ఈజీపీ పథకం' కింద బ్యాంకు లింకేజీ ద్వారా యంత్రాలు, తొలి దశ పెట్టుబడికి రూ.3 లక్షల రుణం మంజూరు చేయించారు. వర్కింగ్ క్యాపిటల్ కింద మరో లక్ష రూపాయలు మంజూరయ్యాయి. కడియం మండలాధ్యక్షుడు వెలుగుబంటి సత్య ప్రసాద్ చొరవతో సచివాలయంలోని ఒక గది కేటాయింపు జరిగింది. మొదట తొలిగా అయిదుగురు మహిళతో అగరుబత్తీల తయారీ మొదలయింది.

ఆరోగ్యానికి ముప్పు లేదు...

అగరుబత్తీల తయారీ గురించి డ్వాక్రా మహిళలు పి.లక్ష్మీబాయి, వి.వెంకట లక్ష్మి, జె.నాగ లక్ష్మి, కె.శ్రావణి, ఎస్.మల్లేశ్వరి వివరిస్తూ "ఉదయం 9గంటలకు తయారీ కేంద్రానికి చేరుకుంటాం. బంతి, చామంతి, గులాబీ తదితర పూల వ్యర్థాలను తొడిమలతోసహా తొలగిస్తాం. రేకులను వేరు చేస్తాం. 25 కిలోలు ముడి సరుకుగా తీసుకువస్తే... శుభ్రం చేసిన తర్వాత దాదాపు అయిదు కిలోల పూరేకులు వస్తాయి. వాటిని 20 రోజులపాటు ఎండబెట్టి, పొడి చేస్తే 2 కిలోల పొడరు వస్తుంది. దానికి ఎలాంటి రసాయన పదార్థాలను జోడించం. అగరుబత్తి పుల్లకు ఆ పొడి అంటిపెట్టుకొని ఉండడానికి గమ్ పొడరు రాస్తాం. అగరుబత్తి వెలుగుతూ ఉండడానికి రంపం పొడి మాత్రం స్వల్ప మోతాదులో కలుపుతాం. ఆ మిశ్రమంతో యంత్రం ద్వారా అగరుబత్తీలు తయారు చేసి ప్యాక్ చేస్తాం. ఇలా రోజుకు దాదాపు 15 కిలోల చొప్పున నెలకు సుమారు 500 కిలోల వరకూ ఉత్పత్తి చేస్తున్నాం. చేతితో ధూప్‌స్టిక్స్ కూడా తయారు చేస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో లభ్యమవుతున్న అగరుబత్తీల తయారీలో రసాయనాలు వాడడంతో ఆరోగ్యపరమైన ఇబ్బందులు కలుగుతాయి. కానీ కడియం నాచురల్ అగరుబత్తీలలో రసాయనాలు లేకపోవడంతో ఆ పొగతో సమస్య ఉండదు. బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే వీటిని అందిస్తున్నాం. ప్రస్తుతం పెట్టుబడి, బ్యాంకు వాయిదా పోను నెలకు ఒక్కొక్కరికి రూ.12 వేల వరకూ ఆదాయం వస్తోంది. ఆ మొత్తం పెట్టుబడి తదితరాలకు సరిపోతోంది. ఇది కాస్త శ్రమతో కూడుకున్న పనే. కానీ భవిష్యత్తు బాగుంటుందనే ఆశతో కొనసాగిస్తున్నాం" అని చెప్పారు.

ఉపాధికి ఆస్కారం...



ప్రస్తుతం వీటిని జిల్లా మహిళా సమాఖ్య తరపున డీఆర్‌డీఏ కొనుగోలు చేస్తోంది. ఎక్కడైనా ప్రభుత్వ కార్యక్రమాలు ఉంటే తయారీ కేంద్రం తరపున స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ముడిసరుకు ఏడాది పొడవునా లభ్యత ఉండడంతో పాటు డబ్బులు చెల్లించి కొనుగోలు చేయాల్సిన అవసరం లేకపోవడం ఈ ప్రాజెక్టులోని విశేషంగా చెప్పవచ్చు. కొద్ది రోజుల క్రితం కలెక్టర్ కీర్తి చేకూరి ఈ కేంద్రాన్ని సందర్శించారు. సోలార్ డ్రయర్‌తోపాటు అవసరమైన యంత్రాలు సమకూరుస్తామని హామీ ఇస్తూ... వాణిజ్యపరంగా ఇంకా పెద్ద స్థాయిలో తయారీకి సిద్ధం కావాలని, ఆ ఉత్పత్తులను దేవాదాయ శాఖ ద్వారా దేవాలయాల్లో వినియోగించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా... వ్యర్థమవుతున్న పూలలో ఈ విధంగా వినియోగిస్తున్నవి చాలా తక్కువ. వాటిని పూర్తిగా వినియోగించుకోవడంతోపాటు.. దేవాలయాల్లో వాడిన పూలు, పూలమాలలను కూడా జతచేస్తే కడియం పరిసర ప్రాంతాలతో పాటు దగ్గరలో ఉన్న రాజమహేంద్రవరంలోని డ్వాక్రా మహిళలకు కూడా ఉపాధి లభించే అవకాశం ఉంది. అలాగే తక్కువ మంది మహిళలతో చిన్న యూనిట్లను నెలకొల్పి ఆ ఉత్పత్తులను ప్రభుత్వం మార్కెట్ చేయగలిగితే ఎంతోమంది మహిళల జీవితాలు ఆర్థికంగా గుబాళిస్తాయి.

- పి.రమేశ్ నాగేంద్ర

పిల్లలకు ఏ పేరు పెట్టాలా అని తల్లిదండ్రులు పగలనక రాత్రనక ఆలోచిస్తూనే ఉంటారు. కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను సలహా అడగడమే కాకుండా నెట్టింట్లో తెగ వెతికేస్తుంటారు. చివరికి ఓ చక్కని పేరును ఎంపిక చేసి సంబరపడిపోతుంటారు. కానీ ప్రస్తుతం తల్లిదండ్రులు అలా కష్టపడనక్కర్లేదు. పిల్లలకు అందమైన పేర్లు పెట్టడానికి కన్సల్టెంట్లు, బేబీ నేమర్లు వచ్చేశారు. ఈ ట్రెండ్ మరీ కొత్తది కానప్పటికీ ఇటీవల బాగా ప్రాచుర్యంలోకి వస్తోంది. శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన టేలర్ అలెగ్జాండ్రా హంఫ్రీ అనే మహిళ... గత పదేళ్లుగా పిల్లలకు చక్కని పేర్లు సూచిస్తూ విశేష అనుభవం గడించారు. అంతేకాదు ఓ వ్యాపార సంస్థను సైతం నడుపుతూ లక్షలు ఆర్జిస్తున్నారు. ఈ తరహా ట్రెండ్.. మనదేశంలో కూడా ఉందంటే ఆశ్చర్యం కలుగక మానదు.



పేర్లు పెడుతూ లక్షలు సంపాదించేస్తున్నారు!

ఎవరీ టేలర్ ఎ హంఫ్రీ..?

టేలర్... శాన్‌ఫ్రాన్సిస్కోలో పుట్టి పెరిగారు. న్యూయార్క్ యూనివర్సిటీలో బీఏ పూర్తిచేశారు. ఆమెకు చిన్నతనం నుంచీ విభిన్నమైన పేర్ల మీద ఆసక్తి ఉండేది. బంధుమిత్రుల ఇళ్లలో పిల్లలు పుట్టినపుడు వాళ్లకు ప్రత్యేకమైన పేర్లు సూచిస్తుండేవారు. ఎంతో పరిశోధించి తను సృష్టించిన పేర్లను ఆన్‌లైన్లో షేర్ చేసేవారు. వాటికి మంచి ఫాలోయింగ్ వస్తుండేది. చదువు పూర్తయ్యాక అమెరికాలోని ప్రముఖ సంస్థల్లో మార్కెటింగ్, బ్రాండింగ్ విభాగాల్లో పనిచేశారు. మహిళలకు గర్భధారణ, ప్రసవ సమయాల్లో తగిన అవగాహన కల్పించే నిపుణురాలిగా సేవలందించారు. ఈ క్రమంలో.. ఆసుపత్రి నుంచి ఇంటికి వెళుతున్న ఓ జంట తమ బిడ్డకి పెట్టే పేరు గురించి చర్చించుకోవడం విని వాళ్లతో మాటలు కలిపారు టేలర్. ఆ జంట ఇష్టాయిష్టాలు, కుటుంబ నేపథ్యం అడిగి తెలుసుకుని క్షణాల్లో చక్కని పేరును సూచించారు. వెంటనే ఆ తల్లిదండ్రుల ముఖాల్లో కనిపించిన సంతోషం... ఆమెను ఆలోచనలో పడేసింది. ఆ క్షణమే టేలర్ తన అభిరుచిని కెరీర్‌గా మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు. 'వాట్స్ ఇన్ ఎ బేబీ నేమ్' పేరుతో ఓ వ్యాపార సంస్థను ప్రారంభించి దాని ద్వారా తన నైపుణ్యాన్ని సమాజానికి తెలియజేయడంలో విజయం సాధించారు ఆమె. కుటుంబ వారసత్వం, వంశ వృక్షాలకు సంబంధించిన వివరాలను పూర్తిగా తెలుసుకుని వాటికి తగ్గట్టుగా కొన్ని పేర్లను జాబితాగా రాసి తల్లిదండ్రులకు ఈ-మెయిల్ చేస్తానంటున్నారు టేలర్. ఇప్పటి వరకూ.. అమెరికాలోని శ్రీమంతులు, సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తల కుటుంబాలకు చెందిన 500 మంది చిన్నారులకు పేర్లు సూచించానని ఆమె చెబుతున్నారు. జన్మ రాశులకు అనుగుణంగా... పలకడానికి సులభంగా ఉండే స్టయిలిష్ పేర్లను డిజైన్ చేయడంలో ఆమె నిష్ణాతురాలు. ఒక చిన్నారికి పేరు పెట్టడానికి కనీసం 26 లక్షలు వసూలు చేస్తుండడం విశేషం. "పేరంటే వ్యక్తిగత గుర్తింపు మాత్రమే కాదు వారసత్వానికి ప్రతిబింబం, ఓ బ్రాండ్ కూడా!" అంటారామె. టేలర్‌కు సామాజిక మాధ్యమాల్లో లక్షకు పైగా ఫాలోవర్లు ఉన్నారు.

నేమ్ కన్సల్టెంట్స్ సర్వీసులు...

ఒకప్పుడు తల్లిదండ్రులు తమ ప్రాథమిక పరిజ్ఞానంతో కుటుంబంలోని పెద్దల సూచనల మేరకు పిల్లల పేర్లు నిర్ణయించేవారు. కానీ నేటి తల్లిదండ్రులు మాత్రం పిల్లలకు తేలిక పదాలతో కూడిన విలక్షణమైన పేర్లు పెట్టాలనుకుంటున్నారు. అలాంటి పేర్లను వెతకడానికి పరిశోధించడానికి సమయం వెచ్చించాల్సి ఉంటుంది. ప్రస్తుత జీవన విధానంలో ఎప్పుడూ బిజీగా ఉండే తల్లిదండ్రులకు అది సాధ్యం కావడం లేదు. దీంతో వారు నేమ్ కన్సల్టెంట్స్ సర్వీసులవైపు చూస్తున్నారు. మనదేశంలో ఢిల్లీ, నోయిడా, ముంబై, పుణె, కోల్‌కతా తదితర నగరాల్లో ఇలాంటి సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. ఢిల్లీకి చెందిన శివాంగి వర్మే... ఏడేళ్లుగా బేబీ నేమింగ్ సంస్థను నిర్వహిస్తున్నారు. విష్ణు, లలిత సహస్రనామాలతోపాటు వేదాలు, పురాణ గ్రంథాల్లోని ఇతర శ్లోకాలను విశ్లేషించి పిల్లల పేర్లను డిజైన్ చేస్తారామె. ఒక్కోసారి తల్లిదండ్రులే కొన్ని పేర్లను ఎంపిక చేసుకుని వాటి అర్థాలు చెప్పమని అడుగుతుంటారని అలాంటి వాటిని కూడా పరిశీలించి అవసరమైతే మార్పులు, చేర్పులు చేసి చక్కని పేర్లను సూచిస్తామని ఆమె తెలియజేస్తున్నారు. ఒక్కో పేరును డిజైన్ చేయడానికి వారం వరకూ సమయం పడుతుందన్నారు. తమ వద్ద రూ.11,000 నుంచి రూ.51,000 మధ్య మూడు ప్యాకేజీలు అందుబాటులో ఉంటాయనీ, వాటి కింద 25 ఐడియాలతో కూడిన పేర్లు సూచిస్తామనీ, తల్లిదండ్రుల ఇష్టానుసారం మార్పులు చేస్తామనీ శివాంగి చెబుతున్నారు.



ఎన్నారైల కోసం కూడా...

విదేశాల్లో నివసించే భారతీయ కుటుంబాలకు చెందిన పిల్లల కోసం కొంతమంది కన్సల్టెంట్లు ప్రత్యేకంగా సేవలు అందిస్తున్నారు. వీరు... ఎన్నారైలు కోరుకున్నట్లుగా భారతీయత ఉట్టిపడేలా, సులభంగా పిలుచుకొనేట్లుగా వినసొంపుగా, ఉండే పేర్లను డిజైన్ చేస్తున్నారు.

- కోల్‌కతాలోని 'డస్పన్ నామకరణ్' సంస్థ... జ్యోతిష శాస్త్రం, సంఖ్యాశాస్త్రం ఆధారంగా ఆధునిక, సంప్రదాయ పేర్లను డిజైన్ చేస్తోంది. అన్ని వర్గాలవారికి అందుబాటులో ఉండేలా డైమండ్ (రూ.10,999); గోల్డ్ (రూ.6,000); సిల్వర్ (రూ.4,500) ప్యాకేజీలను అందిస్తోంది.
- పుణెలో 'నేమ్ ఇట్ రైట్' సంస్థను నిర్వహిస్తున్న జయ వర్మ... మధ్యతరగతి వర్గాలను దృష్టిలో ఉంచుకుని రూ.4,000కే ప్యాకేజీని అందిస్తున్నారు. ఈ ప్యాకేజీ కింద 15 పేర్లను సూచించడంతోపాటు వాటి అర్థాలు, మతపరమైన సూచనలు, ఆ పేరు పిల్లలకు ఎలా సూటవుతుందో తెలిపే వివరణ ఉంటాయి. ఈ సంస్థకు రోజుకు 40 దాకా ఆర్డర్లు వస్తుంటాయి.

ఆత్మ స్థైర్యమే ఆయుధం...

ఊహించని ప్రమాదం ఆమెను ఏడేళ్లు మంచానికి పరిమితం చేసినా... క్యాన్సర్ మహమ్మారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నా.. ఆత్మస్థైర్యమే ఆయుధంగా పోరాటం సాగించారు పూజా గార్గ్. పారా అథ్లెట్‌గా ఎన్నో పతకాలు సాధించడంతోపాటు... క్యాన్సర్ పై అవగాహన కలిగించడానికి బైక్‌పై 4,500 కిలోమీటర్ల యాత్ర చేశారు. మరోవైపు సామాజిక కార్యకర్తగా, వక్తగా వేలమంది జీవితాల్లో మార్పునకు దోహదం చేస్తున్న పూజ కథ... ఆమె మాటల్లోనే...

"అది 2020 సెప్టెంబర్. అంతకు కొన్నాళ్ల క్రితమే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బిఇ పూర్తి చేశాను. నోయిడాలోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఉద్యోగం వచ్చింది. కోరుకున్న కెరీర్‌ను ఆకర్షణీయమైన జీతంతో ప్రారంభించబోతున్నాననే ఆనందం నన్ను నిలవనివ్వడం లేదు. కానీ విధి నిర్ణయం వేరేగా ఉంది. ఒక రోజు స్నేహితుల్ని కలుసుకోడానికి బయలుదేరాను. అంతకుముందు పడిన వర్షం వల్ల తడిగా ఉన్న మెట్ల మీద నుంచి జారి పడిపోయాను. వెంటనే స్పృహ తప్పింది. ఆ ఏడాది అక్టోబర్ అయిదో తేదీన నేను జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలి. కానీ ఆ రోజు ఆపరేషన్ టేబుల్ మీద... అపస్మారక స్థితిలో ఉన్నాను.



కొత్త దారి తెలిసింది...

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో నేను పుట్టి పెరిగాను. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలనేది నా లక్ష్యం. దానికోసం కష్టపడి చదివాను. కోరుకున్న ఉద్యోగంలో చేరబోతున్న దశలో... ఊహించని ప్రమాదంతో నా కలలన్నీ కరిగిపోయాయి. వెన్నుకు ఫ్రాక్చర్ కావడంతో మంచానికే పరిమితం కావాల్సి వచ్చింది. ఏడేళ్లలో... దేశంలోని వివిధ నగరాల్లో నాకు పదమూడు సర్జరీలు జరిగాయి. నా తల్లితండ్రులు ఎంతో డబ్బు ఖర్చు చేశారు. కానీ ఎలాంటి ప్రయోజనం కనిపించలేదు. హోలీ, దీపావళి లాంటి పండుగలను అందరూ సందడిగా చేసుకుంటూ ఉంటే... నేను నా గదికే పరిమితం కావడం ఎంతో బాధ కలిగించేది. మంచం మీద నుంచి నా అంతట నేను లేచి కూర్చోవడం చాలా కష్టంగా ఉండేది. దాదాపు మూడేళ్ల పాటు ఒకవైపు నుంచి మరోవైపు కదలలేకపోయేదాన్ని. అయితే ఆత్మస్థైర్యాన్ని మాత్రం కోల్పోలేదు. దానికి కారణం నా కుటుంబం. నా తల్లిదండ్రులు, ఇద్దరు చెల్లెళ్లు నన్ను కనిపెట్టుకొని ఉన్నారు. నా ప్రతి అవసరం తీర్చారు. క్రమంగా వీల్‌చైర్‌లో అటూ ఇటూ తిరగడం అలవాటు చేసుకున్నాను. 'నడవలేకపోతేనేం... నేను ఎన్నో సాధించగలను' అని నన్ను నేను ప్రేరేపించుకున్నాను. పారా-షూటింగ్ ప్రాక్టీస్ మొదలుపెట్టాను. కొన్ని నెలలలో నైపుణ్యం సాధించాను. మధ్యప్రదేశ్ రాష్ట్రస్థాయి పారా-షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలిచాను. నేను పయనించాల్సిన కొత్త దారి ఏమిటో అప్పుడు నాకు స్పష్టమయింది.

పాతికకు పైగా పతకాలు

ఆ తరువాత... కేరళలో జరిగిన ప్రీ-నేషనల్స్‌లో, నేషనల్-పారా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు గెలిచాను. 2000 సంవత్సరానికల్లా మన దేశంలోని టాప్-8 పారా షూటర్స్‌లో ఒకరుగా నిలిచాను. ఈ క్రమంలో నా దృష్టి కెనోయింగ్ మీద పడింది. తీవ్ర సాధన తరువాత... ఉజ్బెకిస్తాన్, జపాన్‌లలో నిర్వహించిన ఆసియన్ ఛాంపియన్‌షిప్స్‌లో వరుసగా పాల్గొన్నాను. ఆ రెండిటిలో నాలుగో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కానీ ఈ ఏడాది థాయిలాండ్‌లో జరిగిన 'ఆసియన్ పారా-కెనోయింగ్' పోటీల్లో... రెండు ఈవెంట్లలో కాంస్య పతకాలు సాధించాను. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఇప్పటివరకూ పాతికకు పైగా పతకాలు నా ఖాతాలో ఉన్నాయి. మరోవైపు సామాజిక సేవను కూడా నా జీవితంలో భాగం చేసుకున్నాను. 'పంకోంకీ ఉడాన్' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశాను. దివ్యాంగులకు వివిధ వృత్తుల్లో నైపుణ్యాన్ని కల్పించి, వారు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయం ద్వారా ఆదాయ మార్గం చూపించడం, అణగారిన వర్గాల పిల్లలకు, వయోధికులకు అవసరమైన సాయాలు అందించడం లాంటి కార్యక్రమాలను చేపడుతున్నాను. అలాగే విద్యాసంస్థల్లో వర్క్‌షాప్‌లు, సమావేశాలు నిర్వహిస్తూ... పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాను. 'పంకోంకీ ఉడాన్' ఇప్పటి వరకూ దాదాపు అయిదు వేల మంది జీవితాల్లో మార్పునకు దోహదం చేసింది. ఇది నాకు ఎంతో సంతృప్తి కలిగిస్తోంది.

తొలి మహిళను నేనే...

ఈలోగా మరో సవాల్ ఎదురయింది. రెండేళ్ల క్రితం తరచూ అనారోగ్యానికి గురవుతూ ఉండడంతో... వైద్య పరీక్షలు చేయించుకున్నాను. నాకు ఎముకల క్యాన్సర్ ఉందని వైద్యులు నిర్ధారించారు. అయితే నేను భయపడలేదు. చికిత్స చేయించుకుంటూనే నా కార్యక్రమాలన్నీ కొనసాగిస్తున్నాను. ప్రజల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడం కోసం... కిందటి ఏడాది ఇండోర్ నుంచి... దేశంలో మోటార్ సైకిళ్ల మీద ప్రయాణించగలిగే అత్యంత ఎత్తైన రోడ్లలో ఒకటైన నాథూలా పాస్ వరకూ... 4,500 కిలోమీటర్ల దూరం మోటార్ బైక్‌పై ప్రయాణించాను. జాతీయ పతాకాన్ని చేతపట్టుకొని... అక్కడ శిఖరాగ్రానికి చేరాను. అక్కడికి చేరుకున్న తొలి 'పారాప్లెజిక్' మహిళను నేనే. ఇది ప్రపంచ రికార్డుగా... 'లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నా పేరు చోటుచేసుకుంది. ప్రస్తుతం... వచ్చేఏడాది ఆసియా క్రీడల కోసం, 2028లో జరగబోయే పారాలింపిక్స్ కోసం సన్నద్ధం అవుతున్నాను. ఆత్మవిశ్వాసంతో, నిజాయితీగా పని చేస్తే విజయం తథ్యం అని నేను నమ్ముతాను. నా కథ కొందరిలోనైనా స్ఫూర్తి నింపుతుందనే నమ్మకం నాకుంది."





దీక్ష, షైనాలకు స్వర్ణాలు

● ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్

చెంగ్డు: ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో దీక్ష సుధాకర్, షైనా మణిముత్తు స్వర్ణాలతో మెరిశారు. బాలికల అండర్-17 కేటగిరీలో సహచర భారత ప్లేయర్ల మధ్య జరిగిన ఫైనల్లో దీక్ష 21-16, 21-9తో లక్ష్య రాజేష్‌పై గెలిచింది. దీంతో ఈ చాంపియన్‌షిప్స్‌లో బంగారు పతకం నెగ్గిన తొలి భారత షట్లర్‌గా దీక్ష రికార్డులకెక్కింది. అండర్-15 తుదిపోరులో షైనా 21-14, 22-20తో చిహారు టోమిటా (జపాన్)పై నెగ్గింది. సెమీస్‌లో ఓడడంతో జగ్‌షేర్ సింగ్, మిక్స్‌డ్ జోడీ జగ్జీత్ సింగ్-జననిక రమేష్ కాంస్యాలు దక్కాయి. టోర్నీలో భారత్ రెండు స్వర్ణ, రజత, రెండు కాంస్యాలు సాధించింది. అత్యధిక పతకాల పరంగా ఈ టోర్నీలో భారత జట్టుకిదే అత్యుత్తమ రికార్డు.

వెంకట్రామ్ రెడ్డికి కాంస్యం



రాంచీ: దక్షిణాసియా సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో కర్నూలు అథ్లెట్ ఎం. వెంకట్రామ్ రెడ్డి కాంస్యం కైవసం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఈ పోటీల్లోని 800 మీటర్ల పరుగును వెంకట్రామ్ 1 నిమిషం 52.56 సెకన్లలో పూర్తి చేశాడు. హర్ష (శ్రీలంక) స్వర్ణం, బహదూర్ (నేపాల్) రజతం సాధించారు. భారత్ 32 మెడల్స్ గెలిచి పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలవగా, శ్రీలంక 23 పతకాలతో రెండో స్థానం దక్కించుకుంది.

పసిడిపోరుకు సుజీత్

● అండర్-23 ప్రపంచ రెజ్లింగ్

నోవి సాద్ (సెర్బియా): భారత సుజీత్ కల్కాల్ అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండోసారి పతకం ఖాయం చేసుకున్నాడు. నిరుడు కాంస్యం సాధించిన సుజీత్ ఈసారి ఏకంగా పసిడి పోరులో నిలిచాడు. ఆదివారం జరిగిన ఫ్రీస్టయిల్ 65 కిలోల విభాగం సెమీఫైనల్లో సుజీత్ 3-2తో నిషియుచి (జపాన్)ను ఓడించాడు. సోమవారం జరిగే ఫైనల్లో ఉజ్బెకిస్థాన్ రెజ్లర్ ఉమిజాన్ జలోలోవ్‌తో సుజీత్ తలపడనున్నాడు.

వరుణుడిదే ఆట



భారత్-బంగ్లాదేశ్ మ్యాచ్ రద్దు

మహిళల వన్డే వరల్డ్‌కప్

నవీ ముంబై: మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భారత్ ఆడిన చివరి గ్రూప్ మ్యాచ్‌కు వరుణుడు అడ్డుతగిలాడు. దీంతో ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన ఈ నామమాత్రపు మ్యాచ్ రద్దవడంతో ఇరు జట్లకు చెరో పాయింట్‌ను కేటాయించారు. హర్మన్‌ప్రీత్ సేన ఇప్పటికే సెమీస్‌కు చేరిన సంగతి తెలిసిందే. వర్షంతో అర్ధగంట ఆలస్యంగా ఆరంభమైన ఈ మ్యాచ్‌లో..బంగ్లా ఇన్నింగ్స్ సమయంలో దాదాపు రెండున్నర గంట లపాటు అంతరాయం కలిగించింది. దీంతో మ్యాచ్‌ను 27 ఓవర్లకు కుదించారు. నిర్ణీత ఓవర్లలో బంగ్లా 9 వికెట్ల నష్టానికి 119 పరుగులకే పరిమితమైంది. తాజా ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్ ఆడిన స్పిన్నర్ రాధా యాదవ్‌కు మూడు, శ్రీచరణికి రెండు వికెట్లు దక్కాయి. బంగ్లా ఇన్నింగ్స్‌లో షర్మీన్ అక్తర్ (36), సోభానా మోస్తరి (26) మాత్రమే రాణించారు. స్పిన్నర్ల ధాటికి ఆ జట్టు వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత ఛేదనలో భారత్‌కు డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 126 పరుగుల టార్గెట్‌ను విధించారు. ఓపెనర్ మంధాన (34 నాటౌట్) ఆరంభం నుంచే చెలరేగి నాలుగో ఓవర్‌లో నాలుగు ఫోర్లతో 16 రన్స్ రాబట్టింది. అయితే 8.4 ఓవర్లలో భారత్ వికెట్ నష్టపోకుండా 57 పరుగులు చేసిన వేళ వర్షం మరోసారి ఆటంకం కలిగించింది. ఆ తర్వాత పరిస్థితులు ఆటకు అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన ప్రతీకా స్థానంలో అమన్‌జోత్ (15 నాటౌట్) ఓపెనర్‌గా బరిలోకి దిగింది.

ప్రతీకా రావల్‌కు గాయం



ఆస్ట్రేలియాతో కీలక సెమీఫైనల్స్‌కు ముందు భారత్‌కు ఝలక్ తగిలింది. బంగ్లా ఇన్నింగ్స్ సమయంలో ప్రతీకా రావల్ గాయపడింది. బౌండరీ లైన్ దగ్గర బంతిని ఆపే ప్రయత్నంలో మోకాలికి గాయం కావడంతో పాటు చీలమండ మెలి తిరగడంతో ఆమె మైదానంలోనే కుప్పకూలింది. ఆ వెంటనే ఫిజియో వచ్చి పరిశీలించిన తర్వాత రావల్ నడవడానికి ఇబ్బందిపడుతూనే డగౌట్‌కు వెళ్లింది.

స్కోరుబోర్డు

బంగ్లాదేశ్: సుమయా అక్తర్ (సి) శ్రీచరణి (బి) రేణుక 2, రుబియా హైదర్ (సి) హర్లీన్ (బి) దీప్తి 13, షర్మిన్ అక్తర్ (సి/సబ్) అరుంధతి (బి) శ్రీచరణి 36, నిగర్ సుల్తానా (రనౌట్) 9, సోభానా మోస్తరీ (సి) హర్లీన్ (బి) రాధ 26, షోర్నా అక్తర్ (బి) అమన్‌జోత్ 2, నహిదా అక్తర్ (బి) రాధ 3, రబేయా ఖాన్ (బి) రాధ 3, రీతూ మోని (సి) జెమీమా (బి) శ్రీచరణి 11, నిషితా అక్తర్ (నాటౌట్) 4, మరూఫా అక్తర్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 27 ఓవర్లలో 119/9; వికెట్ల పతనం:** 1-3, 2-34, 3-53, 4-91, 5-94, 6-99, 7-101, 8-105, 9-117; **బౌలింగ్:** రేణుక 5-0-23-1, దీప్తి శర్మ 5-2-24-1, అమన్‌జోత్ 5-0-18-1, శ్రీచరణి 6-0-23-2, రాధా యాదవ్ 6-0-30-3.

భారత్: స్మృతి మంధాన (నాటౌట్) 34, అమన్‌జోత్ (నాటౌట్) 15; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 8.4 ఓవర్లలో 57/0; బౌలింగ్:** మరూఫా అక్తర్ 2-0-15-0, నిషితా అక్తర్ 2-0-18-0, నహిదా అక్తర్ 2-0-12-0, రబేయా ఖాన్ 1.4-0-7-0, రీతూ మోని 1-0-5-0.

ఓటమితో ముగించిన కివీస్

రెండో స్థానానికి ఇంగ్లండ్



విశాఖపట్నం: మహిళల వరల్డ్‌కప్‌ను న్యూజిలాండ్ ఓటమితో ముగించింది. ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఈ జట్టు 8 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. కివీస్ ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క విజయం మాత్రమే దక్కగా.. రెండు వర్షార్పణమయ్యాయి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 38.2 ఓవర్లలో 168 పరుగులకు కుప్పకూలింది. ప్లిమ్మర్ (43), అమేలియా కెర్ (35) రాణించారు. లిన్సేకు మూడు, బ్రంట్.. కాప్సీలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ 29.2 ఓవర్లలో 172/2 స్కోరుతో నెగ్గింది. ఎమీ జోన్స్ (86 నాటౌట్), బ్యూమాంట్ (40), హీథర్ (33) ఆకట్టుకున్నారు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
ఆస్ట్రేలియా	7	6	0	1	13	2.102
ఇంగ్లండ్	7	5	1	1	11	1.233
దక్షిణాఫ్రికా	7	5	2	0	10	-0.379
భారత్	7	3	3	1	7	0.628
శ్రీలంక	7	1	3	3	5	-1.035
న్యూజిలాండ్	7	1	4	2	4	-0.876
బంగ్లాదేశ్	7	1	5	1	3	-0.578
పాకిస్థాన్	7	0	4	3	3	-2.651

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు; ఫ.తే: ఫలితం తేలనవి; ర.రే: రన్‌రేట్

సోఫీ డివైన్ వీడ్కోలు

కివీస్ మహిళల క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన కెప్టెన్ సోఫీ డివైన్ తన 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌తో కెరీర్‌ను ముగిస్తానని 36 ఏళ్ల సోఫీ ఇదివరకే ప్రకటించింది. 2006లో అరంగేట్రం చేసిన తను 159 వన్డేల్లో తొమ్మిది సెంచరీలతో 4,279 రన్స్, 111 వికెట్లు.. అలాగే 146 టీ20ల్లో ఓ సెంచరీతో 3,431 పరుగులు, 119 వికెట్లు తీసి అద్భుత ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకుంది. 2011-12లో క్రికెట్‌కు బ్రేక్ ఇచ్చి కివీస్ హాకీ జట్టుకు ఆడడం విశేషం. మ్యాచ్ ముగిశాక ఇంగ్లండ్ ఆటగాళ్లు తమ సంతకాలతో కూడిన జెర్సీని డివైన్‌కు బహుమతిగా ఇచ్చారు.

ఆంధ్ర 43/2

బరోడాతో రంజీ

విజయనగరం: విష్ణు సోలంకి (131) శతకం నమోదు చేయడంతో.. గ్రూప్-ఎలో ఆంధ్ర జట్టుతో రంజీ మ్యాచ్‌లో బరోడా మెరుగైన స్కోరు సాధించింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 230/6తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బరోడా 363 పరుగులకు ఆలౌటైంది. సాయి తేజ్ నాలుగు, విజయ్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆంధ్ర జట్టు ఆదివారం ఆట ముగిసేసరికి 43/2 స్కోరు చేసింది. రషీద్ (12), కెప్టెన్ రికీ భుయ్ (7) క్రీజులో ఉన్నారు.

63 ఏళ్ల రికార్డు బద్దలు: అత్యంత వేగంగా (540 బంతుల్లోనే) ముగిసిన మ్యాచ్‌గా సర్వీసెస్-అసోం పోరు.. 63 ఏళ్లనాటి రికార్డును బద్దలు కొట్టింది. గ్రూప్-సిలో సర్వీసెస్ 8 వికెట్ల తేడాతో అసోంను చిత్తు చేసింది. ఆటకు రెండో రోజు అసోం నిర్దేశించిన 71 పరుగుల లక్ష్యాన్ని సర్వీసెస్ 13.5 ఓవర్లలో 73/2 స్కోరు చేసి గెలిచింది. అసోం 103, 75 స్కోర్లు చేయగా.. సర్వీసెస్ తొలి ఇన్నింగ్స్‌లో 108 పరుగులకు ఆలౌటైంది. అయితే, మ్యాచ్ ఫలితం 90 ఓవర్ల లోపే.. అంటే 540 బంతుల్లోనే తేలిపోయింది. 1962లో ఢిల్లీ-రైల్వేస్ మధ్య జరిగిన మ్యాచ్ 547 బంతుల్లో ముగిసింది.

రెండు హ్యాట్రిక్‌లతో రికార్డు

ఈ మ్యాచ్‌లో సర్వీసెస్ బౌలర్లు ఏకంగా రెండు హ్యాట్రిక్‌లు నమోదు చేశారు. అసోం స్కోరు 45 వద్ద తొలుత అర్జున్ శర్మ, 103 పరుగులవద్ద మోహిత్ జాంగ్రా హ్యాట్రిక్‌లతో చెలరేగారు. ఇలా ఒకే మ్యాచ్‌లో ఇద్దరు బౌలర్లు హ్యాట్రిక్‌లు సాధించడం రంజీల్లో ఇదే తొలిసారి. కాగా ఓ రంజీ మ్యాచ్‌లో ఒకే బౌలర్ (జోగిందర్‌సింగ్ రావ్-సర్వీసెస్) రెండు హ్యాట్రిక్‌లు తీసిన రికార్డు 1963లో నమోదైంది.

వాలీబాల్ విజేత బెంగళూరు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) సీజన్-4 టైటిల్‌ను బెంగళూరు టార్పెడోస్ జట్టు సొంతం చేసుకుంది. ఆదివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో బెంగళూరు 3-0 (15-13, 16-4, 15-13)తో ముంబై మీటియర్స్‌పై ఘన విజయం సాధించింది. జోయెల్ బెంజిమిన్, సేతు, మాట్‌వెస్ట్ బెంగళూరు గెలుపులో ముఖ్యభూమిక పోషించారు. పీవీఎల్‌లో బెంగళూరు టైటిల్ నెగ్గడం ఇదే తొలిసారి. ఈ సీజన్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు తొమ్మిదో స్థానంతో ముగించింది.



రో-కో మళ్లీ ఆడేదెప్పుడంటే..



న్యూఢిల్లీ : టీమిండియా దిగ్గజ బ్యాటింగ్ ద్వయం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియాతో చివరి వన్డేలో అద్భుత బ్యాటింగ్‌తో తమ అభిమానులను అలరించారు. ఆసీస్‌తో మూడు వన్డేల సిరీసే కావడంతో..అక్కడ వారి పర్యటన ముగిసింది. రోహిత్, కోహ్లీ కేవలం వన్డేలకే పరిమితం కావడంతో వారు మళ్లీ భారత జట్టు తరఫున బరిలోకి దిగేదెప్పుడనే చర్చ ఫ్యాన్స్‌లో మొదలైంది. టీమిండియా తదుపరి వన్డే సిరీస్‌ను స్వదేశంలో దక్షిణాఫ్రికాతో ఆడనుంది. వచ్చే నెల 30న రాంచీలో జరిగే మ్యాచ్‌తో ఈ సిరీస్ ఆరంభమవుతుంది. డిసెంబరు మూడు, ఆరు తేదీలలో మిగిలిన రెండు వన్డేలు జరుగుతాయి.

న్యూజిలాండ్ బోణీ

● బ్రూక్ శతకం వృథా

● తొలి వన్డేలో ఇంగ్లండ్ ఓటమి

మౌంట్ మాంగనూ: ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్ శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి వన్డేలో పేసర్లు రాణించడంతో కివీస్ నాలుగు వికెట్లతో నెగ్గింది. ముందుగా ఇంగ్లండ్ 35.2 ఓవర్లలో 223 పరుగులకు కుప్పకూలింది. 56/6 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ హ్యారీ బ్రూక్ (135) శతకంతో ఆదుకోగా ఒవర్టన్ (46) సహకరించాడు. మిగతా తొమ్మిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడం గమనార్హం. పేసర్లు జకారీ ఫోక్స్‌కు 4, డఫీకి 3, హెన్రీకి 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో కివీస్ 36.4 ఓవర్లలో 224/6 స్కోరుతో నెగ్గింది. మిచెల్ (78 నాటౌట్), బ్రేస్‌వెల్ (51) అర్ధసెంచరీలు సాధించారు. కార్స్‌కు 3 వికెట్లు తీశాడు. తమ జట్టు ఓటమిపాలైనా ఒంటరి పోరాటం చేసిన బ్రూక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' లభించింది.

కేకేఆర్ కోచ్‌గా అభిషేక్ నాయర్?



కోల్‌కతా: ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్రధాన కోచ్‌గా అభిషేక్ నాయర్ ఎంపిక దాదాపుగా ఖరారైంది. మూడేళ్ల నుంచి కోచ్‌గా ఉన్న చంద్రకాంత్ పండిట్‌ను గత జూలైలో కేకేఆర్ తొలగించింది. వారం రోజుల క్రితమే కోచ్ పదవిపై కేకేఆర్ నాయర్‌తో సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. అయితే ఈ విషయమై ఫ్రాంచైజీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. పండిట్ శిక్షణలో జట్టు 2024లో విజేతగా నిలిచినప్పుడు నాయర్ బ్యాటింగ్ కోచ్‌గా ఉన్నాడు. అలాగే ఈ ఏడాది మహిళల ప్రీమియర్ లీగ్‌లో యూపీ వారియర్స్ జట్టుకు చీఫ్ కోచ్‌గా పనిచేశాడు.

క్వాలిఫయర్‌లో టైటాన్స్ గెలుపు




న్యూఢిల్లీ: ఉత్కంఠభరితంగా జరిగిన ప్రో కబడ్డీ మినీ క్వాలిఫయర్‌లో తెలుగు టైటాన్స్ గెలుపొందింది. ఆదివారం జరిగిన ఈమ్యాచ్‌లో టైటాన్స్ 37-32తో బెంగళూరు బుల్స్‌పై నెగ్గింది. ఆల్‌రౌండర్ భరత్ హుడా 12 పాయింట్లతో, కెప్టెన్ విజయ్ మాలిక్ 10 పాయింట్లతో టైటాన్స్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఈ మ్యాచ్‌లో నెగ్గిన టైటాన్స్ మంగళవారం జరిగే ఎలిమినేటర్-3 పోరుకి అర్హత సాధించింది. ఇక, ఎలిమినేటర్-1 మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 48-32తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలిచింది.

బిజినెస్

ఏఐ ఇన్‌ఫ్రాపై రిలయన్స్ రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడి

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక వసతులపై దృష్టి సారిస్తోంది. రాబోయే కొన్నేళ్లలో ఒక గిగావాట్ డేటా సెంటర్ ప్రారంభించడం సహా ఏఐ మౌలిక సదుపాయాలపై 1,200 నుంచి 1,500 కోట్ల డాలర్ల (రూ.1.03-1.29 లక్షల కోట్లు) ఇన్వెస్ట్ చేయనుందని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. రిలయన్స్ ఇంటలిజెన్స్ పేరిట ఒక కొత్త అనుబంధ సంస్థ ప్రారంభించడంతో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా తాము ఏఐకి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు గత ఆగస్టులో జరిగిన వాటాదారుల సమావేశంలో అంబానీ తెలిపారు. రిలయన్స్ ప్రతి దశాబ్దికి ఒకసారి తన సామ్రాజ్యాన్ని అప్పటి పరిస్థితులకు అనుగుణంగా పునర్నిర్మించుకుంటుందని, ఇప్పుడు కంపెనీ ఈక్విటీ కథనాన్ని ఏఐ పునర్నిర్మించనుందని మోర్గాన్ స్టాన్లీ ఆ నివేదికలో తెలిపింది. దేశంలోనే అతి పెద్దదైన డేటా సెంటర్ తొలి దశ నిర్మాణం జామ్‌నగర్‌లో వేగంగా సాగుతోందని, వ్యాపార సంస్థల డిమాండ్‌కు అనుగుణంగా దాన్ని మరింతగా విస్తరించుకుంటూ పోతామని అప్పట్లో రిలయన్స్ చెప్పిన విషయాన్ని గుర్తు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	575
వరంగల్	562	గోదావరి	570
చిత్తూరు	583	విశాఖపట్నం	560
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	117	విజయవాడ	123
వరంగల్	117	గుంటూరు	126
కరీంనగర్	117	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	109
కర్నూలు	117	నెల్లూరు	114
విశాఖపట్నం	119	అనంతపురం	114
గోదావరి	123		

25,500 దిగువన బేరిష్

(అక్టోబరు 27-31 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

నిఫ్టీ గత వారం 25,718-26,099 పాయింట్ల మధ్యన కదలాడి 85 పాయింట్ల లాభంతో 25,795 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,500 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

● 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,230, 25,035, 25,030, 24,269 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 26,100 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25,500

నిరోధ స్థాయిలు: 26,000, 26,100, 26,200 (25,900 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 25,600, 25,500, 25,400 (25,500 దిగువన బేరిష్)

బులియన్ మార్కెట్లో అనిశ్చితి

ధరలు మరింత కిందికే!

● లాభాల స్వీకరణకు అవకాశం

● కేంద్ర బ్యాంకుల వైఖరే కీలకం



న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్లో ఈ వారం కూడా ధరల పతనం కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. గత సోమవారం అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి (24 క్యారట్స్) బంగారం రికార్డు స్థాయిలో 4,398 డాలర్లకు (సుమారు రూ.3.87 లక్షలు) చేరింది. ఆ మరుసటి రోజే గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు 266.4 డాలర్లు (6.11%) పడిపోయింది. వెండిదీ ఇదే పరిస్థితి. ఈ నెల 17న ఔన్స్ వెండి ధర రికార్డు స్థాయిలో 53.76 డాలర్లను తాకింది. ఈ నెల 21న ఈ ధర 47.12 డాలర్లకు పడిపోయింది.

అదే బాటలో దేశీ మార్కెట్

గత వారం బంగారం, వెండికి దేశీయ మార్కెట్ కూడా కలిసి రాలేదు. గత వారం 10 గ్రాముల మేలిమి బంగారం ఒక దశలో రూ.1.32 లక్షలకు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. కిలో వెండి ధరా రూ.1.90 లక్షలు తాకింది. వారాంతానికల్లా లాభాల స్వీకరణతో రూ.1.70 లక్షలకు దిగొచ్చింది. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్‌పైనా ఈ ప్రభావం కనిపిస్తోంది. డిసెంబరులో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి బంగారం గత వారం రూ.3,557 (2.8%) నష్టంతో ముగిసింది. వెండిదీ ఇదే పరిస్థితి. ఎంసీఎక్స్‌లో డిసెంబరులో డెలివరీ ఇచ్చే కిలో వెండి ధర గత వారం రూ.9,134 (5.83%) నష్టపోయింది.

కేంద్ర బ్యాంకులు ఎందుకు కొంటున్నాయంటే?

- డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మారడం
- వడ్డీ రేట్లు భారీగా తగ్గించినా సంపన్న దేశాల్లో వృద్ధి రేటు 2% దిగువకు చేరడం
- ప్రభుత్వ రుణ పత్రాల కంటే పసిడిపై రాబడులు ఎక్కువగా ఉండడం
- అమెరికా ప్రభుత్వ రుణ పత్రాలపై నమ్మకం సన్నగిల్లడం
- ఎగవేతలు, దివాలా బాధ లేకపోవడం
- విలువ పెద్దగా హెచ్చు తగ్గులకు లోనయ్యే అవకాశం లేకపోవడం
- ద్రవ్యోల్బణ సమయంలోనూ పెట్టుబడుల విలువ క్షీణించక పోవడం
- కష్ట సమయాల్లో అమెరికా వంటి దేశాల ఆర్థిక ఆంక్షల నుంచి కాపాడుతుందనే భరోసా
- ఆర్థిక మాంద్యం వంటి ఆర్థిక సంక్షోభాల సమయంలోనూ ఫారెక్స్ నిల్వల విలువకు రక్షణ
- బహుళ ధ్రువ ప్రపంచంలో స్వతంత్ర ద్రవ్య విధానానికి వెసులుబాటు
- డాలర్, పౌండ్ వంటి కరెన్సీలతో పోలిస్తే ఫారెక్స్ నిల్వలకు అధిక రక్షణ
- డాలర్ ఆధిపత్యంపై సన్నగిల్లుతున్న ఆశలు

మరింత దిద్దుబాటు?

ఈ వారం కూడా లాభాల స్వీకరణతో బంగారం, వెండి ధరలు మరింత దిద్దుబాటుకు లోనవుతాయని మార్కెట్ వర్గాల అంచనా. ఈ నెల 28-29న జరిగే అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్ రిజర్వ్ సమావేశం, ఈ నెల 30న జరిగే యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ) సమావేశాల్లో వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయాలు వచ్చే కొద్ది రోజులు బులియన్ మార్కెట్‌ను నడిపిస్తాయని మార్కెట్ వర్గాల అంచనా. ఈ రెండు సంఘటనలకు తోడు గురువారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్-చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య జరిగే భేటీతో రెండు దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధం చల్లబడుతుందని భావిస్తున్నారు. భారత-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) చర్చలు కూడా దాదాపు ఒక కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బంగారం, వెండి ధరలు ఈ వారం మరో 5% వరకు పతనమయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

దిద్దుబాటు తాత్కాలికమే

అయితే బంగారం, వెండి ధరల్లో ఈ దిద్దుబాటు తాత్కాలికమేనని మార్కెట్ వర్గాల అంచనా. దీర్ఘకాలానికి చూస్తే ఈ రెండు లోహాలకు ఢోకా లేదని నిపుణులు చెబుతున్నారు. 'గత వారం బంగారం, వెండి ధరలు తీవ్ర దిద్దుబాటుకు లోనయ్యాయి. అయినా దీర్ఘకాలిక పెట్టుబడులకు ఈ రెండు లోహాలు ఇప్పటికే అనుకూలంగానే ఉన్నాయి' అని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ ఎమ్కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ అనలిస్ట్ రియా సింగ్ తెలిపారు.

26,000 వద్ద అప్రమత్తం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ ప్రారంభమై కీలక నిరోధం 26,000 కూడా దాటింది. కాని ఆ స్థాయిలో నిలదొక్కుకోలేకపోయింది. గత ఏడాది సెప్టెంబరులో ఏర్పడిన గరిష్ఠ స్థాయి 26,100 సమీపంలో రియాక్షన్‌కు గురి కావడం అప్రమత్త సంకేతం. అయితే ముందు వారంతో పోల్చితే మాత్రం 85 పాయింట్ల స్వల్ప లాభంతో 25,800 సమీపంలో క్లోజైంది. నాలుగు వారాల నిరంతర ర్యాలీలో 1,600 పాయింట్ల మేరకు లాభపడిన అనంతరం గరిష్ఠ స్థాయిల్లో ఆకస్మికంగా ఏర్పడిన రియాక్షన్ ఇది. కీలక నిరోధ స్థాయిలో ఏర్పడిన ఈ రియాక్షన్ కారణంగా ఈ వారంలో మరింత అప్రమత్త లేదా కన్సాలిడేషన్ ట్రెండ్‌కు ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ ఉండవచ్చు. పాజిటివ్ ట్రెండ్‌లో పురోగమించినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం తదుపరి నిరోధం 26,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం, జీవితకాల గరిష్ఠ స్థాయి 26,300.

బేరిష్ స్థాయిలు: మరింత రియాక్షన్‌కు గురైనా భద్రత కోసం మద్దతు స్థాయి 25,500 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,000.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ ఫ్లాట్‌గా ట్రేడయి 57,700 వద్ద క్లోజయింది. ముందు వారం జీవితకాల గరిష్ఠ స్థాయిని తాకిన అనంతరం ఏర్పడిన పుల్‌బ్యాక్ రియాక్షన్ ఇది. మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే ప్రధాన నిరోధం 58,200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 59,000. రియాక్షన్‌లో పడినా భద్రత కోసం మద్దతు స్థాయి 57,000 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనత తప్పదు.

పాటర్న్: సానుకూలత కోసం 25,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి. స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిలో ప్రవేశించిన తర్వాత రియాక్షన్ ఏర్పడినందు వల్ల గరిష్ఠ స్థాయిల్లో స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,920, 26,000
మద్దతు	25,700, 25,620

ఆచితూచి వ్యవహరించండి..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం ఉంది. మారుతున్న అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం, అనిశ్చితి ఇందుకు కారణాలు. మరోవైపు మదుపరులు కూడా కొనుగోళ్లకు పెద్దగా ఆసక్తి చూపించటం లేదు. ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

టాటా ఎలెక్సీ: రెండేళ్లుగా పతనమవుతూ వస్తున్న ఈ షేరు ప్రస్తుతం కీలకమైన మద్దతు స్థాయికి చేరుకుంది. ఇక్కడ కాస్త బౌన్స్ బ్యాక్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.5,544 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.5,500 స్థాయిలో అక్యుములేట్ చేసుకుంటూ రూ.5,750/6,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.5,380.

మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్స్: ఈ కౌంటర్ ఆరు నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. ప్రస్తుతం బ్రేకౌట్ అయ్యింది. పైగా రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉంది. గత శుక్రవారం రూ.1,036 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,080/1,150 టార్గెట్ ధరతో రూ.1,020 వద్ద పడుతున్నప్పుడు కొనుగోలు చేయాలి. రూ.990 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా కన్స్యూమర్: ఏడాది గరిష్ఠాన్ని బ్రేక్ చేసిన ఈ కౌంటర్ ప్రస్తుతం పుల్‌బ్యాక్ అయ్యింది. గత శుక్రవారం రూ.1,896 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,860 శ్రేణిలో ప్రవేశించి రూ.2,050/2,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.1,810.

భారత్ డైనమిక్స్ లిమిటెడ్: గత ఆరు నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం బేస్ ఏర్పడుతోంది. ట్రెండ్ రివర్సల్ అయ్యే అవకాశం ఉంది. రక్షణ రంగం మళ్లీ పుంజుకుంటుండటంతో మదుపరులు మళ్లీ ఆసక్తి కనబరుస్తున్నారు. గత శుక్రవారం రూ.1,544 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,500 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.1,650/1,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.1,450 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కేపీఐటీ టెక్నాలజీస్: రెండేళ్లుగా జీరో రిటర్నులు ఇచ్చిన ఈ కౌంటర్ ఏడాది కాలంగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. గత శుక్రవారం రూ.1,178 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,150 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.1,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.1,120.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్

+91 98855 59709

niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ఎస్‌బీఐలో మరో 3,500 ఆఫీసర్ల కొలువులు

న్యూఢిల్లీ: దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బీఐ) తన వ్యాపార, ఖాతాదారుల సేవలను మరింత విస్తృతం చేస్తోంది. ఇందుకోసం వచ్చే ఐదు నెలల్లో మరో 3,500 ప్రొబేషనరీ ఆఫీసర్ (పీఓ) పోస్టులను భర్తీ చేయనుంది. మొత్తం మూడు దశల పరీక్ష తర్వాత వీరి ఎంపిక ఉంటుందని ఎస్‌బీఐ డిప్యూటీ ఎండీ (హెచ్ఆర్) కిశోర్ కుమార్ పోలుదాసు చెప్పారు. ఈ ఏడాది జూన్ నాటికే 505 పీఓ పోస్టుల భర్తీ పూర్తయిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆఫీసర్లు, క్లరికల్ పోస్టులతో కలుపుకుని 18,000 పోస్టులు భర్తీ చేయబోతున్నట్టు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ఇంతకు ముందే ప్రకటించారు. ఐటీ, సైబర్ సెక్యూరిటీ విభాగాల కోసం ఎస్‌బీఐ ఇప్పటికే 1,300 నిపుణుల నియామకం పూర్తి చేసింది.

నేడు, రేపు అవసరమైతే తప్ప బయటికి రావొద్దు: అనిత



అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో అత్యవసరమైతే తప్ప.. బయటకు రావొద్దని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖల మంత్రి వంగలపూడి అనిత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్, విపత్తుల విభాగం ఎండీ ప్రఖర్‌జైన్ ఇతర అధికారులతో ఆమె సమీక్షించారు. 'సాంకేతికతతో తుఫాన్ నష్ట నివారణకు చర్యలు చేపట్టాం. ఇళ్లు ప్రమాదకరంగా ఉంటే సురక్షిత ప్రాంతానికి వెళ్లాలి. స్టేట్ కంట్రోల్ రూమ్ నంబర్లు 112, 1070, 18004250101 సేవ్ చేసి పెట్టుకోవాలి. ఏ సహాయం అవసరమైనా కంట్రోల్ రూమ్‌కు సమాచారమివ్వాలి. అధికారుల సూచనలు పాటిస్తూ, సహకరించాలి. సీఎం ఆదేశాల ప్రకారం మంత్రులు, సెక్రటరీలు, ఐఏఎస్‌లు, కలెక్టర్లు, జిల్లాల యంత్రాంగం తుఫాన్‌పై ఫోకస్ పెట్టాలి. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతింటే వినియోగించేందుకు జిల్లాలకు శాటిలైట్ అందుబాటులో ఉంచాలి. తుఫాన్ ప్రభావం చూపే జిల్లాలకు ఇప్పటికే 6 ఎన్డీఆర్ఎఫ్, 13 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పంపాం. అన్ని చోట్లా హెలీప్యాడ్లను సిద్ధం చేశాం. నేవీ అధికారులను అప్రమత్తం చేశాం. అవసరమైతే పునరావాస కేంద్రాలతో పాటు స్కూల్స్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు వినియోగించుకోవాలి. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే.. కఠిన చర్యలు తప్పవు' అని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

27, 28, 29 తేదీల్లో విద్యుత్తు ఉద్యోగుల సెలవులు రద్దు: గొట్టిపాటి




మొంథా తుఫాను నేపథ్యంలో విద్యుత్తు ఉద్యోగులంతా అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. ఆ శాఖ అధికారులతో మంత్రి ఆదివారం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌తోపాటు మూడు డిస్కంల సీఎండీలు పాల్గొన్నారు. విద్యుత్తు సరఫరాలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని, విద్యుత్తు సమస్యలు తలెత్తితే వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో విద్యుత్తు ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎక్కడైనా విద్యుత్తు సమస్యలు తలెత్తితే ప్రజలు 1912 నంబరుకు సమాచారం అందించాలని మంత్రి కోరారు. కిందపడిన విద్యుత్తు స్తంభాలు, వైర్లు కిందపడిపోతే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొట్టిపాటి సూచించారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం: సత్యకుమార్



తుఫాన్ వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకొవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రామాణిక మార్గదర్శకాలను (ఎస్‌వోపీ) రూపొందించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. వైద్య సేవలు అందించేందుకు ఎలా సిద్ధమవ్వాలి? వచ్చినప్పుడు వైద్యులు ఎలా స్పందించాలి? తుఫాన్ అనంతరం వ్యాధులు ప్రబలకుండా, పునరావాస, ఇతర చర్యలు ఎలా తీసుకొవాలన్న దానిపై ఎస్‌వోపీ సిద్ధం చేశామన్నారు. రాష్ట్రానికి మొంథా తుఫాన్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులకు పంపించామని తెలిపారు. ఆస్పత్రుల్లో సరిపడా యాంటీ బయాటిక్స్, యాంటి స్నేక్ వీనమ్, ర్యాబిస్ డోస్‌లు నిల్వ ఉంచుకోవాలన్నారు. పీహెచ్‌సీల్లో 500 మందికి సరిపడా పాము కాటు మందు డోసులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది పూర్తిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. బాధిత ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణ, అంటు వ్యాధులు ప్రబలకుండా, నీరు కలుషితం కాకుండా, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. 108, 104, 102 అంబులెన్సులు సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు.

అమరావతిలో బ్యాంకుల శంకుస్థాపన వాయిదా



రాజధాని అమరావతిలో ఈ నెల 28వ తేదీన జరగాల్సిన బ్యాంకుల శంకుస్థాపన కార్యక్రమం మొంథా తుఫాన్ కారణంగా వాయిదా పడింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా అమరావతిలో ఒకేసారి 12 జాతీయ బ్యాంకుల రాష్ట్రస్థాయి ప్రధాన కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేయాలని మొదట నిర్ణయించారు. తుఫాన్ పరిస్థితుల నేపథ్యంలో వాయిదా వేశారు. 2014-19 మధ్యకాలంలోనే అమరావతిలో ఉద్దండరాయునిపాలెం వద్ద 12 జాతీయ బ్యాంకుల కోసం స్థలాలు కేటాయించారు. భూముల చదును కూడా పూర్తయింది. కానీ 2019లో జగన్ అధికారంలోకి రావడంతో బ్యాంకులు ఆ స్థలాలు స్వాధీనం చేసుకోవడానికి ముందుకురాలేదు. రాష్ట్రంలో మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక బ్యాంకర్లతో సంప్రదింపులు జరిపి కార్యాలయాల ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు. ఎస్‌బీఐకి 3 ఎకరాలు కేటాయించారు. ఆ స్థలంలో ఎస్‌బీఐ 14 అంతస్థుల భవనం నిర్మించనుంది. కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా కార్యాలయాలు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చాయి.



నరసాపురంలో గోదావరి ఒడ్డున నిలిపివేసిన పంటు

గోదావరిపై పంటు రాకపోకలు నిలిపివేత

భీమవరం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికలతో పశ్చిమగోదావరి జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించింది. తుఫాన్ ప్రభావాన్ని పరిశీలించేందుకు జిల్లా అధికారులకు ఒక్కో నియోజకవర్గ బాధ్యతలు అప్పగించింది. నరసాపురం వద్ద గోదావరిపై ఉన్న పంటు రాకపోకలను నిలిపివేశారు. పేరుపాలెం బీచ్‌లో సందర్శకులు రాకుండా పర్యాటక కేంద్రాలను మూసి వేశారు. కాల్వలు, ఎటిగట్టు కాల్వలకు గండ్లు పడితే తక్షణమే అడ్డుకట్ట వేసేందుకు నీటి పారుదల శాఖ ఇసుక బస్తాలను సిద్ధం చేసింది. వరి, ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొనడంతో వర్షాలు కురిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు జిల్లా శాస్త్రవేత్తలు సూచనలు చేశారు. నిత్యావసర వస్తువులకు ఆటంకం లేకుండా ముందుగానే రేషన్ షాపులకు చేర వేశారు. లోతట్టు ప్రాంతాలు జలమయమైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు చేరవేసేలా చర్యలు తీసుకున్నారు.



గురుకుల బాలికలు ఇంటిబాట

మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సెలవులు ఇవ్వడంతో కృష్ణా జిల్లాలోని చల్లపల్లిలో వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. చల్లపల్లి గురుకుల పాఠశాల, కళాశాలలోని బాలికలు ఆదివారం మధ్యాహ్నం భోజనం చేశాక స్వస్థలాలకు పయనమయ్యారు.

\- చల్లపల్లి, ఆంధ్రజ్యోతి

తుఫాను ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్నేయంగా, కాకినాడకు 780 కి.మీ. ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉంది. గంటకు ఆరు నుంచి 10 కిలోమీటర్ల వేగంతో కోస్తాంధ్ర వైపు వస్తోంది. మంగళవారం ఉదయానికి తీవ్ర తుఫాన్‌గా బలపడి కోస్తాంధ్రకు దగ్గరగా రానున్నది. దీని ప్రభావంతో కోస్తాంధ్రలో కుంభవృష్టిగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. మంగళవారం సాయంత్రం లేదా రాత్రికి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ వద్ద (ఒక అంచనా మేరకు కాకినాడ-తుని మధ్య) తీరం దాటుతుందని ఐఎండీ తెలిపింది. అయితే తీవ్రతుఫాన్ విశాఖపట్నం-కాకినాడ మధ్య తీరందాటే అవకాశం ఉందని కొందరు వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం కోస్తాలో తీరం వెంబడి గంటకు 60 నుంచి 70 కి.మీ. వేగంతో గాలులు వీయనున్నాయి. మధ్యాహ్నం తర్వాత గాలుల వేగం పెరిగి, తుఫాన్ తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కి.మీ., అప్పుడప్పుడు 110 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయి. భారీ నుంచి అతిభారీగా, అక్కడక్కడ కుంభవృష్టి వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో సోమవారం నుంచి పలు జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉంది. బుధవారం వరకు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు వెంటనే తీరానికి రావాలని హెచ్చరించింది. కోస్తాలో విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు అన్ని ఓడరేవుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల ఆదివారం వర్షాలు కురిశాయి. సోమవారం నుంచి బుధవారం వరకు రాష్ట్రంలో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయి. సోమవారం కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కుంభవృష్టిగా, కోస్తాలోని మిగిలిన జిల్లాలు, రాయలసీమలోని తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య, నంద్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీగా, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. కోస్తాలో తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కి.మీ., అప్పుడప్పుడు 65 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయి. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ అంబేడ్కర్, ఉభయ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కుంభవృష్టి, కోస్తాలోని మిగిలిన జిల్లాలు, రాయలసీమలోని తిరుపతి, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అతిభారీ వర్షాలు, రాయలసీమలో మిగిలిన జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయి. బుధవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో కుంభవృష్టి వర్షాలు, అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అతిభారీగా, బాపట్ల, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. గురువారం ఉత్తరాంధ్రలో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తుఫాన్ ప్రభావంతో రానున్న 48గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే, తీరం వెంబటి గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సహాయక చర్యల కోసం తీర ప్రాంత జిల్లా కేంద్రాల్లో 9 ఎస్డీఆర్ఎఫ్, 7 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొంది. తుఫాన్ సహాయ, పునరావాస కార్యక్రమాల కోసం ప్రభుత్వం తక్షణం రూ.19 కోట్లు విడుదల చేసింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు రూ.కోటి చొప్పున, మిగిలిన 14 జిల్లాలకు రూ.50లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ నిధులను జిల్లా కలెక్టర్లు డ్రా చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. బాధితుల్ని సహాయ శిబిరాలకు తరలించడం, వారికి రక్షిత తాగునీరు, ఆహారం, పాలు అందించడం, వైద్య శిబిరాలు నిర్వహించడం, రోడ్లు, ఇతర అత్యవసర సేవలకు ఈ నిధులు వినియోగించుకునేలా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.



ఐఎండీ విడుదల చేసిన తుఫాన్ గమన అంచనా చిత్రం

విద్యా సంస్థలకు సెలవులు

మొంథా తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఉభయ గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, విశాఖపట్నం, అనకాపల్లి, చిత్తూరు, అన్నమయ్య, ప్రకాశం, కడప జిల్లాల్లో పాఠశాలలు, ఇతర విద్యా సంస్థలకు సెలవులిచ్చారు. ఆయా జిల్లాలపై ప్రభావం తీవ్రత ఆధారంగా సోమవారం నుంచి రెండు, మూడు రోజులు సెలవులు ప్రకటించారు.

డిప్లొమా సప్లిమెంటరీ పరీక్షలు వాయిదా

తుఫాను నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో జరగాల్సిన డిప్లొమా సప్లిమెంటరీ పరీక్షలు సి-16, సి-20లను వాయిదా వేసినట్లు సాంకేతిక విద్యాశాఖ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. సవరణ షెడ్యూలను తర్వాత విడుదల చేస్తామని పేర్కొంది.

రైతు కష్టం నీటిపాలు

▸ రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నకు మొలకలు

చాగలమర్రి/రుద్రవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వరుస అల్పపీడనాలు, వాయుగుండాలతో గతకొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న తడిసి మొలకలు రావడంతో నంద్యాల జిల్లాలో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. పంట కోతదశకు రావడంతో ఇప్పటికే కొందరు రైతులు కోత కోయగా, మరి కొందరు ప్రస్తుతం అదే పనిలో ఉన్నారు. మొక్కజొన్న దిగుబడులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, నూర్పిళ్లు చేసుకొని గిట్టుబాటు ధరకు అమ్ముకోవడం రైతులకు కష్టతరంగా మారింది. దీంతో చాగలమర్రి, రుద్రవరం మండలాల్లోని పలు గ్రామాల రైతులు మొక్కజొన్నను రోడ్లపై ఆరబోశారు. అయితే, గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షానికి మొక్కజొన్న తడిసిపోయి మొలకలు వచ్చాయి. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలో రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్నకు వచ్చిన మొలకలను చూపుతున్న రైతు

'మొంథా'ను ఎదుర్కొందాం!

▸ మచిలీపట్నం నుంచి కాకినాడ వరకు తీవ్ర ప్రభావం


▸ తీర ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి

▸ ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

▸ ప్రజలకు ముందస్తు హెచ్చరికలు పంపాలి

▸ ప్రతి విభాగం సమన్వయం చేసుకోవాలి

▸ సీఎం చంద్రబాబు నిర్దేశం... అధికారులతో టెలీకాన్ఫరెన్స్



అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు అప్రమత్తం చేశారు. ఈనెల 27, 28, 29తేదీల్లో తీర ప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం అధికారులతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వాయుగుండం 28నాటికి తీవ్ర తుఫాన్‌గా మారుతుందని, ఈ సమయంలో ఎక్కడా, ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు నిర్దేశించారు. మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వివిధ జిల్లాలకు ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించామని, ప్రతి శాఖ, ప్రతి విభాగం సమన్వయంతో పని చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. తుఫాన్ నుంచి ప్రజల ఆస్తి, ప్రాణ, మౌలిక సదుపాయాల రక్షణకు ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. మచిలీపట్నం నుంచి కాకినాడ వరకు తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిస్తుందని, ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉండాలని సీఎం సూచించారు. ఎస్ఎంఎస్ అలెర్ట్స్, సోషల్ మీడియా, ఐవీఆర్ఎస్ కాల్స్, వాట్సా‌ప్‌ల ద్వారా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు పంపాలన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తుఫాన్ ప్రభావంపై సమాచారం వేగంగా చేరవేసి, నష్ట నివారణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే తీర ప్రాంత జిల్లాల్లో మొహరించాయన్న సీఎం.. తుఫాన్‌పై ప్రెడిక్టివ్ మోడల్, రియల్ టైమ్ డేటా ఆధారంగా విశ్లేషణ చేస్తున్నామన్నారు. రిజర్వాయర్లు, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 27వేల సెల్‌ఫోన్ టవర్లను డీజిల్ జనరేటర్లతో సిద్ధం చేశామని చెప్పారు. విద్యుత్, టెలికం, తాగునీటి సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను తక్షణమే సమీపంలోని తుఫాన్ రక్షణ కేంద్రాలకు తరలించి, పునరావాసం కల్పించాలని ఆదేశించారు. తుఫాన్ తీవ్రతను బట్టి విద్యాసంస్థలకు కలెక్టర్లు సెలవులు ప్రకటించాలని సూచించారు. రహదారులు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగిపడినా వాటిని తొలగించడానికి అవసరమైన క్రేన్లు, జేసీబీలు ప్రతి సబ్ డివిజన్ స్థాయిలో సిద్ధం చేయాలని, డ్రోన్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మరోవైపు పంట నష్టం వివరాలను స్పష్టంగా తెలుసుకునేలా వ్యవసాయ శాఖ, ఆర్టీజీఎస్ వ్యవస్థ సమన్వయంతో పని చేయాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ఇంకా సముద్రంలోనే ఉన్న 82 మెకనైజ్డ్ పడవలు, 37 మోటరైజ్డ్ పడవలను సురక్షితంగా తీరానికి రప్పించే చర్యలు తీసుకో వాలన్నారు. తుఫాన్ రక్షణ చర్యలపై ఇప్పటికే 11సార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించామని అధికారులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు జాతీయ రహదారులపై వాహనాలు సిద్ధం చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 851 జేసీబీలు, క్రేన్లు సిద్ధంగా ఉంచామని వివరించారు.

ఉద్యానశాఖ డైరెక్టరేట్‌లో హెల్ప్‌లైన్

మొంథా తుఫాన్ నేపథ్యంలో ఉద్యాన రైతుల కోసం గుంటూరులోని డైరెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఉద్యాన తోటలకు నష్టం జరిగితే సూచనలు, సలహాల కోసం హెల్ప్‌లైన్ నంబరు 0863-2216470లో సంప్రదించాలని కోరారు. అధిక వర్షాల వల్ల పండ్ల తోటలు దెబ్బతినకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాన నీటిని తీసేసి, బూస్టర్ డోస్‌గా శాస్త్రవేత్తల సిఫారసు మేరకు ఎరువులు వేసుకోవాలని సూచించారు. గత వారంలో అధిక వర్షాల కారణంగా 21 జిల్లాల్లో 15 మండలాల్లో 23 గ్రామాల్లో 283 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు.

'తుఫాను' జిల్లాలకు ప్రత్యేక అధికారులు

▸ సహాయ చర్యల పర్యవేక్షణకు 18 మంది ఐఏఎస్‌లు

▸ అజయ్‌జైన్, సిసోడియాకు జోనల్ బాధ్యతలు

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో సహాయ చర్యల పర్యవేక్షణ కోసం వివిధ జిల్లాలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. తుఫాన్ ప్రభావం ఉందన్న అంచనా మేరకు కోస్తాంధ్ర, రాయలసీమలోని 19 జిల్లాలకు 18 మంది ఐఏఎస్‌లను ఇన్‌చార్జి అధికారులుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం నుంచి కోనసీమ జిల్లాల వరకు సీనియర్ ఐఏఎస్ అజయ్‌జైన్, పశ్చిమ గోదావరి నుంచి చిత్తూరు జిల్లా వరకు సీనియర్ ఐఏఎస్ ఆర్పీ సిసోడియాకు జోన్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. అల్లూరి, అనకాపల్లి జిల్లాలకు వాడరేవు వినయ్‌చంద్‌ను ఇన్‌చార్జిగా నియమించింది. ప్రత్యేక అధికారులు తక్షణమే కేటాయించిన జిల్లాలకు వెళ్లి, జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని తుఫాన్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తుఫాన్ నష్టాలను లెక్కించి, బాధిత కుటుంబాలకు పరిహారం పంపిణీ, సాధారణ పరిస్థితులు పునరుద్ధరించే వరకు, ప్రత్యేక అధికారులు తుఫాన్ సహాయ అధికారులుగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

జిల్లా	ఇన్‌చార్జి అధికారి
శ్రీకాకుళం	కేవీఎన్ చక్రధరబాబు
విజయనగరం	పటాన్‌షెట్టి రవిసుభాష్
మన్యం	నారాయణ భరత్ గుప్తా
విశాఖపట్నం	అజయ్‌జైన్
అల్లూరి, అనకాపల్లి	వాడరేవు వినయ్‌చంద్
తూర్పుగోదావరి	కే కన్నబాబు
కాకినాడ	వీఆర్ కృష్ణతేజ
కోనసీమ	విజయరామరాజు
పశ్చిమగోదావరి	వీ ప్రసన్న వెంకటేష్
ఏలూరు	కాంతిలాల్ దండే
కృష్ణా	ఆమ్రపాలి
ఎన్టీఆర్	శశిభూషణ్‌కుమార్
గుంటూరు	ఆర్పీ సిసోడియా
బాపట్ల	ఎం వేణుగోపాల్‌రెడ్డి
ప్రకాశం	కోన శశిధర్
నెల్లూరు	ఎస్ యువరాజ్
తిరుపతి	పీ అరుణ్‌బాబు
చిత్తూరు	పీఎస్ గిరీషా

కోస్తాకు తుఫాన్ల కలవరం!

1971 నుంచి 2023 మధ్యకాలంలో 60 సైక్లోన్లు

బంగాళాఖాతంలో పెరుగుతున్న తుఫాన్ల తీవ్రత

ప్రాణ, ఆస్తి నష్టం.. వ్యవసాయ రంగంపైనా ప్రభావం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మే, అక్టోబరు, నవంబరు నెలల్లో బంగాళాఖాతం నుంచి తుఫాన్లు కోస్తాంధ్రపై విరుచుకుపడుతుంటాయి. గడిచిన ఐదున్నర దశాబ్దాల్లో (1971 నుంచి 2023 మధ్య) శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు సుమారు 60 తుఫాన్లు (తీవ్ర తుఫాన్లు, అసాధారణ, సూపర్ సైక్లోన్లు) తీరం దాటాయి. తుఫాన్ల ప్రభావంతో ప్రాణ, ఆస్తి నష్టం భారీగా ఉంటోంది. ప్రధానంగా రైతులు ఎక్కువ నష్టపోతుంటారు. ఉత్తర హిందూ మహాసముద్రంలోని బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో మార్చి నుంచి జూన్, సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు రెండు సీజన్‌లలో తుఫాన్లు సంభవిస్తుంటాయి. ప్రధానంగా మే, నవంబరు నెలల్లో వీటి తీవ్రత ఎక్కువగా ఉంటుందని పలు గణాంకాలు చెబుతున్నా.. గత రెండు దశాబ్దాల్లో అక్టోబరులో కూడా తీవ్ర విధ్వంసం సృష్టించిన తుఫాన్‌లు వచ్చాయి. పర్యావరణ మార్పులతో వాతావరణం వేడిగా మారుతోంది. సముద్రాల ఉపరితల ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. ఇది తుఫాన్‌ల తీవ్రత పెంచేందుకు దోహదపడుతుంది.

ఒక్కసారి గతాన్ని పరిశీలిస్తే..

1971లో శ్రీకాకుళం జిల్లా బారువ, 1977లో కృష్ణా జిల్లా దివిసీమ తుఫాన్‌లు/ఉప్పెన తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. 1980 నుంచి 2000 వరకు ఏడాదికో తుఫాన్ కోస్తాలో ఎక్కడో చోట తీరం దాటింది. 1990 మేలో సంభవించిన తుఫాన్ కోస్తాలోని పలు జిల్లాలను అతలాకుతలం చేసింది. 1996లో బలుసుతిప్ప తుఫాన్ కోనసీమను కకావికలం చేసింది. 1999లో రెండు, 2000 నుంచి 2005 వరకు ఆరు తుఫాన్‌లు వచ్చాయి. ఖైముక్, లైలా, జల్, నీలం, హుద్‌హుద్, తితిలీ.. ఇలా ప్రతి తుఫాన్ కారణంగా ఆస్తి నష్టం వేల కోట్లలో ఉంటోంది. 2014లో సంభవించిన హుద్‌హుద్ వల్ల రూ.21,908 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేయగా.. దీంట్లో మూడో వంతు విశాఖపట్నంలోని పరిశ్రమలకు వాటిల్లింది.

వాతావరణ మార్పులతో..

బంగాళాఖాతం ఇప్పటికే వేడెక్కి ఉందని, దీనికితోడు వాతావరణ మార్పుల ప్రభావంతో ప్రస్తుత మొంథా తుఫాన్ మరింత బలంగా మారుతుందని ఏయూ వాతావరణ విభాగం విశ్రాంత ఆచార్యుడు భానుకుమార్ పేర్కొన్నారు. అక్టోబరులో ఒడిశా నుంచి కాకినాడ వరకు, నవంబరులో నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఎక్కువగా తుఫాన్‌లు తీరం దాటుతుంటాయన్నారు. ఇటీవల కాలంలో బంగాళాఖాతంలో తుఫాన్‌ల తీవ్రత ఎక్కువగా ఉంటున్నందున దాని ప్రభావం కోస్తాపై అంతే ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. సైబీరియా నుంచి వచ్చే ఈశాన్య గాలులు అక్టోబరు, నవంబరు నెలల్లో వచ్చిన తుఫాన్‌లపై ప్రభావం చూపుతాయన్నారు. ఈ సీజన్‌లో వచ్చే తుఫాన్‌లకు కుడి/ఈశాన్యం వైపు ఎక్కువగా వర్షాలు కురుస్తుంటాయని, అందువల్ల కాకినాడ పరిసరాల్లో తీరం దాటనున్న తుఫాన్‌కు కుడి/ఈశాన్యంగా ఉండే ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భానుకుమార్ విశ్లేషించారు.



హుద్‌హుద్ తుఫానుతో విశాఖ బీచ్ రోడ్డు పరిస్థితి ఇలా (ఫైల్)





ప్రకాశం జిల్లా కోమటికుంట వద్ద రోడ్డు పక్కకు దూసుకుపోయిన బస్సు

హడలెత్తించిన మరో రెండు బస్సులు

- ఒక బస్సులో షార్ట్ సర్క్యూట్‌తో పొగలు
- రోడ్డుపక్కకు దూసుకుపోయిన మరో బస్సు
- నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఘటనలు

పొదలకూరు, మార్కాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాద ఘటనను మరువక ముందే.. నెల్లూరు, ప్రకాశం జిల్లాలో మరో రెండు ప్రైవేట్ బస్సులు ప్రయాణికులను హడలెత్తించాయి. నెల్లూరు జిల్లా పొదలకూరు నుంచి శనివారం రాత్రి 11 గంటలకు 15 మంది ప్రయాణికులతో బెంగళూరుకు ట్రావెల్ బస్సు బయలుదేరింది. అక్కడి నుంచి 3కిలోమీటర్ల దూరాన ఉన్న మర్రిపల్లి గ్రామం వద్దకు రాగానే బస్సులో నుంచి పొగలు, మాడిన వాసన వచ్చింది. ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. డ్రైవర్ బస్సును నిలిపివేయడంతో వెంటనే వారు లగేజీలతో సహా కిందకు దిగి దూరంగా పరుగుతీశారు. బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు మోటారు బైకులపై వచ్చి వారిని వెనక్కి తీసుకెళ్లారు. బ్యాటరీ వైర్ల షార్ట్ సర్క్యూట్ వల్ల పొగలు వచ్చినట్లు డ్రైవర్ తెలిపారు. ప్రత్యామ్నాయంగా మరో బస్సును ఏర్పాటు చేసినా, ప్రయాణికులు ఎవరూ ఎక్కలేదు. మరో ఘటనలో.. మార్కాపురం నుంచి రాయల్ వొయేజ్(ఆర్‌వీటీ) ట్రావెల్ బస్సు ఏడుగురు ప్రయాణికులతో బెంగళూరుకు బయల్దేరింది. కోమటికుంట సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేశారు. దీంతో బస్సు అదుపు తప్పి ముందుభాగం పొలంలోకి వెళ్లింది. బస్సు బోల్తాపడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. లగేజీతో సహా దిగిపోయారు. వరుస ప్రమాదాల నేపథ్యంలో స్లీపర్ కోచ్‌లో ప్రయాణమంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు.

ఏడ్చిఏడ్చి ఇంకిన కన్నీళ్లు..!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ సర్వజన వైద్యశాల మార్చురీ పరిసరాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. 'అన్నా.. నాన్న మృతదేహం తీసుకొని మేము బయలుదేరాం..' అంటూ ఒకరు... 'ఇప్పుడే అమ్మ, చెల్లి బాడీలను ఇచ్చారు. బయల్దేరి వచ్చేస్తున్నాం.. అంత్యక్రియలకు సిద్ధం చేయండి..' అంటూ మరొకరు ఫోన్లలో తమవాళ్లకు సమాచారం ఇచ్చుకున్నారు. ప్రభుత్వం సమకూర్చిన ప్రత్యేక అంబులెన్స్‌ల్లో మృతదేహాలను తీసుకుని కుటుంబీకులు, రక్త సంబంధీకులు స్వస్థలాలకు బయలుదేరారు. మృతదేహాల అప్పగింత ప్రక్రియను కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. ఇదిలా ఉండగా తమిళనాడుకు చెందిన ప్రశాంత్ అనే యువకుడి మృతదేహాన్ని సోమవారం అప్పగించే అవకాశం ఉంది.

డీఎన్‌ఏ సరిపోల్చి.. అప్పగింత

శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో 19 మంది అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. మృతులో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, అంబేడ్కర్ కోనసీమ, బాపట్ల, చిత్తూరు జిల్లాలకు చెందిన ఆరుగురు, తెలంగాణకు చెందిన ఆరుగురు, కర్ణాటకకు చెందిన ఇద్దరు, తమిళనాడుకు చెందిన ఇద్దరు, ఒడిశా, బిహార్ రాష్ట్రాలకు చెందిన వారు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. పూర్తిగా కాలిపోయి మాంసపు ముద్దగా మారడంతో ఏ మృతదేహం ఎవరిదో గుర్తుపట్టలేనట్టు తయారయ్యాయి. దీంతో డీఎన్‌ఏ పరీక్షల అనంతరమే మృతదేహాలను అప్పగించాలని అధికారులు నిర్ణయించారు. డీఎన్‌ఏ పరీక్షా ఫలితాలు ఆదివారం ఉదయం 8 గంటలకే కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు చేరాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఫోరెన్సిక్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ ఆధ్వర్యంలో డీఎన్‌ఏ సరిపోల్చి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ఈ ప్రక్రియ ఆదివారం మధ్యాహ్నం 1:45 నుంచి రాత్రి 8:30 గంటల వరకూ సాగింది.

ఏపీ వాసులు వీరే..

నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గోళ్లవారిపల్లికి చెందిన గోళ్ల రమేశ్, ఆయన భార్య అనూష, కూతురు, కుమారుడు మాన్విత, శశాంక్‌ల మృతదేహాలను బంధువులకు అప్పగించారు. కోనసీమ జిల్లా పావులపాలెంకు చెందిన కొవ్వూరు శ్రీనివాస రెడ్డి మృతదేహాన్ని అప్పగించారు. తర్వాత బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామానికి చెందిన గన్నమనేని ధాత్రి మృతదేహం అప్పగించారు. సాయంత్రం చిత్తూరు జిల్లా యామగానిపల్లికి చెందిన పి.త్రిమూర్తి మృతదేహం అప్పగించారు.



నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గోళ్లవారిపల్లికి చెందిన గోళ్ల రమేశ్, ఆయన భార్య అనుషా, కూతురు, కుమారుడు మాన్విత, శశాంక్‌ల మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

ఆ వ్యక్తిది చిత్తూరు జిల్లాగా గుర్తింపు

బస్సు ప్రమాదంలో 19 మంది అగ్నికి ఆహుతైన సంగతి తెలిసిందే. ట్రావెల్ బస్సు రిజర్వేషన్ ప్రకారం 18 మంది మృతదేహాలను గుర్తించి వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్ నగర శివారులోని ఆరాంఘడ్ చౌరస్తా దగ్గర బస్సు ఎక్కిన వ్యక్తి కూడా ఈ ఘటనలో మృతి చెందారు. ఆ వ్యక్తి ఎవరనేది పోలీసులకు సమాచారం రాలేదు. దీంతో పోస్టుమార్టం చేసి లోని మార్చురీలో భద్రపరిచారు. అయితే చిత్తూరు జిల్లా గుడుపల్లి మండలం యామగానిపల్లె గ్రామానికి చెందిన పీటీ కల్యాణ్ భరత్... ఆ మృతదేహం తన తండ్రి త్రిమూర్తి (58)దే కావొచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ శనివారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు. దీంతో రాత్రికిరాత్రే నమూనాలు సేకరించిన పోలీసులు విజయవాడకు పంపించారు. డీఎన్‌ఏ సరిపోవడంతో త్రిమూర్తి మృతదేహాన్ని కుమారుడికి అప్పగించారు.

బిహార్ వాసికి కర్నూలులో అంత్యక్రియలు

కర్నూలు బస్సు ప్రమాదంలో బిహార్‌కు చెందిన అమ్రిత్‌కుమార్ అలియాస్ అమరజిత్ కుమార్ (45) మరణించిన సంగతి తెలిసిందే. ఆ మృతదేహాన్ని ఆదివారం కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించారు. అయితే కర్నూలు నుంచి బిహార్‌కు తీసుకెళ్లాలంటే కనీసం రెండు రోజులు పడుతుంది. ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తామని మృతుడి బంధువులు విన్నవించడంతో కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదేశాల మేరకు ఇక్కడే అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

ఒక్కరినైనా ఇవ్వమని మొక్కుతా..!

'దేవుడెక్కడున్నాడో చెప్పండయ్యా... నా బంగారు తమ్ముణ్ణి, నా కూతురు, మనవడు, మనుమరాల్ని బతికించమని వేడుకుంటా... ఒక్కరినైనా ఇవ్వమని అడుగుతా..' అని బస్సు ప్రమాద మృతుల్లోని అనూష తల్లి ధనమ్మ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్ ఎదుట విలపించారు. వారి మృతదేహాలు నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గోళ్లవారిపల్లెకు చేరుకున్న క్రమంలో ఆదివారం రాత్రి 10 గంటలకు ఎమ్మెల్యే వారి నివాసానికి చేరుకున్నారు. సోమవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఈ మృతదేహం నా తండ్రిది కాదు!

బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో అగ్నికి ఆహుతయ్యాడు. డీఎన్‌ఏ రిపోర్టు ఆధారంగా మృతదేహాన్ని ఆయన కుమారుడికి అప్పగించారు. అయితే ఆ మృతదేహం తన తండ్రిది కాదని, వేరెవరిదో తమకు ఇచ్చారని ఆరోపిస్తూ ఆ మృతదేహాన్ని తీసుకునేందుకు కుమారుడు నిరాకరించాడు. దీంతో అధికారులు, పోలీసులు, వైద్యాధికారులు ఆ యువకుడికి వివరంగా తెలియజేసినట్లు సమాచారం. చివరకు మృతుడి కుమారుడు ఆ మృతదేహాన్ని అయిష్టంగానే బెంగళూరుకు తీసుకెళ్లినట్లు సమాచారం.

డ్రైవర్ దగ్గర అలారం ఉండాలి

- ముందు తలుపు ఆటోమాటిక్‌గా తెరుచుకోవాలి
- వెనుక మరో ఆటోమాటిక్ డోర్ ఉండాలి
- అగ్నినిరోధక పదార్థాలతో బస్సు నిర్మించాలి
- రవాణా శాఖ మాజీ అధికారి గాంధీ



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ప్రమాదాలు చాలావరకూ మానవ తప్పిదాల వల్లే తలెత్తుతున్నాయని మాజీ ఆర్టీఏ అధికారి సీఎల్ఎన్ గాంధీ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం అదనపు కమిషనర్‌గా సేవలు అందించిన గాంధీ శుక్రవారం వేమూరి కావేరీ ట్రావెల్స్ ప్రమాదంపై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. బస్సు లోపల సరైన రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేసుంటే ఇంతగా ప్రాణ నష్టం జరిగేది కాదన్నారు. ఏఐఎస్ 15 నియమ నిబంధనల ప్రకారం అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు ప్రయాణికులను అప్రమత్తం చేయడానికి డ్రైవర్ దగ్గర అలారమ్ బటన్ ఉండాలని చెప్పారు. అలాంటి ఏర్పాటు వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సులో ఉన్నట్లు కనబడటం లేదన్నారు. బస్సు బాడీ నిర్మాణంలోనూ అగ్ని నిరోధక పదార్థాలు వాడాలని, అలాంటి జాగ్రత్తలేవీ తీసుకోలేదని వివరించారు. ముందు భాగంలోని తలుపులు ఆటోమేటిక్‌గా తెరుచుకోవాలని, అద్దాలు పగలగొట్టడానికి ప్రతి కిటికీ దగ్గర ఒక హ్యామర్ ఉంచాలని చెప్పారు. అత్యవసర తలుపులు సులభంగా తెరుచుకునేలా చూడాలని అన్నారు. బస్సు లోపలి భాగంలో మంటలను అదుపు చేసే పరికరాలుంచాలని తెలిపారు. అవేవీ లేవు కనుకే ఈ దుర్ఘటనలో ప్రాణ నష్టం ఎక్కువ జరిగిందన్నారు. ఈ నేరంలో బస్సు యాజమాన్యం, అధికార వ్యవస్థ, అసమగ్ర చట్టం మూడూ దోషులేనని వ్యాఖ్యానించారు. ఖర్చు తగ్గించుకోవడంలో భాగంగా ప్రయాణికుల ప్రాణ రక్షణకు అవసరమైన సౌకర్యాలను బస్సు యాజమాన్యాలు ఏర్పాటు చేయడం లేదని చెప్పారు.

- మోటారు వాహనాల చట్టం ప్రకారం ప్రతి స్లీపర్ బస్సులో తగినన్ని అగ్నిమాపక యంత్రాలు అమర్చాలి. అత్యవసర ద్వారం సరైన స్థానంలో ఏర్పాటు చేయాలి. ప్రమాద సమయంలో ఆటోమేటిక్‌గా తెరుచుకొనే విధంగా ముందు, వెనుక భాగాల్లో రెండు ద్వారాలు ఉండాలి. వీటిని అస్సలు పట్టించుకోవడం లేదు. ధర తక్కువ కనుక ఫోమ్ బెడ్‌లు, కర్టెన్లు వాడుతున్నారు. అవి మంటల తీవ్రతను పెంచుతున్నాయి.
- వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సు డయ్యూ డామన్‌లో రిజిస్ట్రేషన్ చేశారు. ఫిట్‌నెస్, పర్మిట్ అనుమతులు అక్కడే తీసుకున్నారు. తిరిగేది హైదరాబాద్, బెంగళూరు మధ్య. ఆ బస్సును తనిఖీ చేసే అవకాశం ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు లేదు. రవాణా చట్టంలో ఇదో పెద్ద లోపం.
- మూడు నెలలకు ఒకసారైనా బస్సును రిజిస్టర్ చేసిన రాష్ట్రానికి తీసుకెళ్లాలని రవాణా చట్టంలో నిబంధన ఉండేది. రాజకీయ పలుకుబడితో దాన్ని తొలగించారు. ప్రైవేటు బస్సుల యజమానులతో ఆర్టీఏ అధికారులు నిరంతరం సమావేశాలు నిర్వహించి, నిబంధనలు పాటించడం మీద కచ్చితమైన మార్గనిర్దేశాలు జారీ చేయాలి. రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలుంటాయన్న స్పృహ కలిగించాలి. వాళ్ల వ్యాపారాలు వాళ్లు, వీళ్ల ఉద్యోగాలు వీళ్లు చేసుకొంటామంటే కర్నూలు తరహా విషాదాలు కొనసాగుతూనే ఉంటాయి. ప్రతి బస్సుకు నియమ నిబంధనల ప్రకారం చెక్ లిస్టు సిద్ధం చేయాలి. అవన్నీ ఉన్నాయని ధ్రువీకరణ అయ్యాకే బస్సు రోడ్డు ఎక్కేలా చూడాలి.

2 ప్రమాదాలు.. 2 ఎఫ్ఐఆర్‌లు..!

- వేమూరి కావేరి ట్రావెల్ బస్ డ్రైవర్, ఓనర్‌పై కేసు
- ఎర్రిస్వామి ఫిర్యాదుతో మృతుడు శివశంకర్‌పై కేసు

కర్నూలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదం ఘటనపై దర్యాప్తు చివరి దశకు చేరింది. ఈ ఘటనలో ప్రాణాలతో బయటపడిన ఎన్.రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్ డ్రైవర్, యజమానిపై ఉల్లిందకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. బస్సు ప్రమాదానికి పది నిమిషాలు ముందే అంటే అర్ధరాత్రి 2:45 గంటల సమయంలో మద్యం మత్తులో బైక్‌పై డోన్‌కు వెళ్తున్న శివశంకర్, ఎర్రిస్వామి డివైడర్‌ను ఢీకొట్టారు. శివశంకర్ అక్కడికక్కడే మృతిచెందగా, ఎర్రిస్వామి గాయాలతో బయటపడ్డారు. రోడ్డు మధ్యలో పడిపోయిన వీరి బైక్ బస్సు ప్రమాదానికి కారణమైందని పోలీసులు గుర్తించారు. ఎర్రిస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చనిపోయిన బి. శివశంకర్‌పైనా కేసు నమోదు చేశారు.

కాటేసిన మద్యం మత్తు

శివశంకర్, ఎర్రిస్వామి అలియాస్ నాని మిత్రులు. కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామం వద్ద జాతీయ రహదారికి 240 మీటర్ల దూరంలో ఉన్న రేణుక యల్లమ్మ మద్యం దుకాణంలో గురువారం సాయంత్రం 6:57 గంటలకు ఒకసారి, రాత్రి 8:25 గంటల సమయంలో మరోసారి వీరు మద్యం కొనుగోలు చేశారు. షాపు నుంచి బయటకు వచ్చిన తర్వాత 8:27 గంటలకు వీరు బైక్‌పై వెళ్లిపోయిన దృశ్యాలు అక్కడున్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఆ తరువాత అర్ధరాత్రి 2:25 గంటల సమయంలో చిన్నటేకూరు గ్రామం దగ్గర కియ షోరూంకు ఎదురుగా ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకున్నారు. అక్కడి నుంచి ఐదు కిలోమీటర్లు వెళ్లి 2:45 గంటలకు డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందగా, ఎర్రిస్వామి గాయాలతో బయటపడ్డారు. మద్యం మత్తులో వీరు డివైడర్‌ను ఢీకొట్టిన బైకే.. ఆ తరువాత జరిగిన బస్సు ప్రమాదానికి కారణమైంది. లక్ష్మీపురం గ్రామంలో ఎర్రిస్వామి తల్లి ఉంటున్నారు. మద్యం తాగిన వారిద్దరూ ఇంటికి వెళ్లి పడుకున్నారు. రాంపల్లిలో ఎర్రిస్వామికి తెలిసినవారి వివాహం ఉండటంతో తనను ఆర్టీసీ బస్టాండ్‌లో దించమని కోరారు. అయితే డోన్‌లో రైళ్లు ఉంటాయని, వద్దని చెప్పినా వినకుండా శివశంకర్ బలవంతంగా బైక్‌పై డోన్ వైపు తీసుకువెళ్లినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. కాగా, మృతి చెందిన బి.శివశంకర్ మద్యం తాగినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. మరోవైపు, కర్నూలులో ఘటన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రవాణా అధికారులు చేపట్టిన ప్రత్యేక తనిఖీలు ఆదివారం కూడా కొనసాగాయి.

చావుపైనా రాజకీయం

కర్నూలు జిల్లా బస్సు ప్రమాదంపై జగన్ రోత పత్రికలో నీచమైన రాతలు

అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నిత్యం కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్న జగన్ రోత పత్రిక చివరకు చావుపైనా రాజకీయం చేస్తోంది. కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేటు బస్సు ఘోర ప్రమాద దుర్ఘటనను కూటమి ప్రభుత్వానికి ముడిపెడుతూ అసత్య కథనం వండివార్చింది. ద్విచక్ర వాహనదారుడు శివశంకర్ బెల్టు షాపులో మద్యం కొనుగోలు చేసి తాగడం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ ఆదివారం సంచికలో అడ్డగోలు కథనం ప్రచురించింది. జగన్ పత్రిక తీరును ఎక్సైజ్ శాఖ తప్పుబట్టింది. దీనిపై సమగ్ర విచారణ జరిపించిన ఎక్సైజ్ శాఖ అసలు అక్కడ బెల్టు షాపులే లేవని తేల్చింది. లైసెన్స్ పొందిన మద్యం షాపులో బైకర్ శివశంకర్ మద్యం కొనుగోలు చేస్తున్న వీడియోలను కూడా విడుదల చేసింది. కర్నూలు జిల్లా పెద్దటేకూరు గ్రామంలోని 'రేణుక ఎల్లమ్మ వైన్స్' అనే అధికారిక లైసెన్స్ మద్యం షాపు నుంచే మద్యం కొనుగోలు చేశాడని తెలిపింది. సీసీ కెమెరా దృశ్యాల్లో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. ప్రమాదం జరిగిన రోజు రాత్రి అదే షాపులో 7 గంటలకు, 8.25 గంటలకు వేర్వేరు సమయాల్లో మద్యం కొనుగోలు చేశాడని వివరించింది. ఆ షాపు సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా జాతీయ రహదారి నుంచి 240 మీటర్లకు పైగా దూరంలో ఎక్సైజ్ నిబంధనల ప్రకారమే ఏర్పాటైందని తెలిపింది. పైగా ఆ ప్రాంతంలో ఎక్కడా బెల్టు షాపులు లేవని స్పష్టం చేసింది. ఇలా అపోహలు కలిగించే వార్తలు ప్రచురించడం పట్ల ఎక్సైజ్ శాఖ నిరసన వ్యక్తం చేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొంది.



గురువారం రాత్రి కర్నూలు జిల్లా పెద్దటేకూరు గ్రామంలోని లైసెన్స్ షాపులో మద్యం కొనుగోలు చేస్తున్న బైకర్ శివశంకర్, ఎర్రిస్వామి



ఆదివారం జగన్ పత్రికలో ప్రచురించిన కథనం

ఫేక్ ప్రచారాలకు కేరాఫ్ వైసీపీ: నజీర్

వైసీపీ పూర్తిగా ఫేక్ ప్రచారాలకు ప్రతీకగా మారిపోయిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ విమర్శించారు. కర్నూలు జిల్లాలో బస్సు ప్రమాదం జరిగి 19 మంది మృత్యువాతపడితే, ఈ విషాదాన్ని కూడా వైసీపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. ప్రమాదానికి కారణమైన బైకర్ శివశంకర్ బెల్టు షాపులో మద్యం కొనుగోలు చేశాడని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. శివశంకర్ ప్రభుత్వ లైసెన్స్ షాపులోనే మద్యం కొనుగోలు చేశాడని తెలిపారు. ఫేక్ ప్రచారాలకు ఆ పార్టీ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని విమర్శించారు.

హైదరాబాద్-బెజవాడ స్మార్ట్ రోడ్డు

హైదరాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ(ఎన్‌హెచ్-65) జాతీయ రహదారి ఇకపై హై సెక్యూరిటీ హైవేగా మారనుంది. దారి పొడవునా ఎక్కడ ఏం జరిగిందన్నది స్పష్టంగా తెలిసేలా డిజిటల్, స్మార్ట్ రోడ్డుగా రూపుదిద్దుకోనుంది. సోలార్ వీధి దీపాలు, రహదారి పక్కన భద్రతా బారికేడ్లు, వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ప్రత్యేక ఏర్పాట్లు, రోడ్డు మధ్యలో మొక్కలతోపాటు వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలకు ఊతమిచ్చేలా ఈ రోడ్డు త్వరలో అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం 4 వరుసలతో ఉన్న ఈ రహదారిని తెలంగాణ పరిధిలోని మల్కాపూర్ వద్ద ఉన్న అందోల్ మైసమ్మ ఆలయం నుంచి ఏపీలోని విజయవాడలో ఉన్న కనకదుర్గమ్మ గుడి వరకు 231.32 కిలోమీటర్ల మేర 6 వరుసలుగా విస్తరించనున్నారు. ఈ విస్తరణ పనులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) రూపకల్పనను పూర్తిచేసేలా చర్యలు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే ప్రాథమికంగా తయారైన డీపీఆర్ కాపీ 'ఆంధ్రజ్యోతి'కి లభించింది. దాని ప్రకారం.. హైదరాబాద్-విజయవాడ రోడ్డు విస్తరణ కోసం దాదాపు రూ.10,391.53 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని అంచనా వేశారు.

వీటిలో నిర్మాణ వ్యయం రూ.6,775.47 కోట్లు, వివిధ అవసరాలకు మరో రూ.3,616.06 కోట్లు కావాల్సి ఉందని తేల్చారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ప్రస్తుతం 4 వరుసలతో ఉంది. ట్రాఫిక్ పెరగడం, విజయవాడ వెళ్లేందుకు ఈ రోడ్డే కీలకం కావడంతో దీని విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విస్తరణతోపాటు రోడ్డును భద్రతా పరంగానూ పటిష్ఠం చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న పలు జాతీయ రహదారులను డిజిటల్, స్మార్ట్ హైవేలుగా మార్చేలా చర్యలు చేపట్టిన కేంద్రం.. హైదరాబాద్-విజయవాడ హైవేను పూర్తిస్థాయిలో స్మార్ట్ రోడ్డుగా మార్చాలని నిర్ణయించింది. రహదారిపై అధునాతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు వాటిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అనుసంధానిస్తారు. ఈ వ్యవస్థను రాష్ట్ర పోలీసు, రవాణా శాఖకు అనుసంధానం చేస్తారు. ఫలితంగా రహదారిపై నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపిన వివరాలు తెలియడంతోపాటు ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయనేది కూడా తెలిసిపోతుంది. ఈ విధానంలో రహదారిపై 360 డిగ్రీల కోణంలో పనిచేసే అత్యాధునిక సీసీ కెమెరాలను ప్రతి కిలోమీటర్‌కు(రెండు వైపులా) ఒకటి చొప్పున 231 కెమెరాలను అమర్చుతారు. ఇవి అత్యంత శక్తిమంతంగా ఉండడంతోపాటు 24 గంటలూ రోడ్లపై నిఘా ఉంచుతాయి. రహదారిపై ఎక్కడైనా ప్రమాదం జరిగితే.. వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు లొకేషన్‌తోపాటు కిలోమీటర్ నంబర్‌తో కూడిన అన్ని వివరాలను సీసీ కెమెరాలు వీడియో తో సహా పంపుతాయి. స్పీడ్ డిటెక్షన్, రాంగ్ రూట్, ప్రమాదాల వీడియోను చిత్రీకరించడంతోపాటు పలు రకాల సేవలను వీటి ద్వారా అందించనున్నారు. ఫలితంగా రహదారి అత్యంత భద్రతగా ఉండడంతోపాటు ప్రమాదాలు తగ్గేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రవాసులతో మమేకమై..!

- దుబాయ్‌లో చంద్రబాబు ప్రసంగం
- ప్రతి ఒక్కరికీ ఆప్యాయంగా పలకరింపు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దుబాయ్ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు గత శుక్రవారం యూఏఈ సహా గల్ఫ్ దేశాల్లో స్థిరపడిన ప్రవాసాంధ్రులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. గత స్మృతులను గుర్తు చేసుకుని మరీ కొందరిని పలకరించడంతో వారంతా సంతోషంతో ముగ్ధులయ్యారు. ఇక, ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు గంటల పాటు నిలబడి ఏకధాటిగా ప్రసంగించిన తీరుకు ప్రవాసాంధ్రులు.. ముఖ్యంగా యువకులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 75 ఏళ్ల వయసులో కూడా ఎలాంటి అలుపు లేకుండా పాతికేళ్ల యువనేతగా చంద్రబాబు వ్యవహరించిన తీరును ప్రవాసులు కొనియాడారు. గత మూడు దశాబ్దాలుగా సీఎం దుబాయ్‌కు వస్తున్నా తొలిసారి రాజకీయాలకు అతీతంగా తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఇది వేలాది మందిని ఆకట్టుకుంది. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో 9 ఏళ్ల వేమూరి హంశ్ నుంచి కాకినాడలో పుట్టి దుబాయ్‌లో స్థిరపడ్డ 92 ఏళ్ల ఫాతీమా బీ వరకు ఉన్నారు. ఫాతిమా బీ మాట్లాడుతూ.. "మా ఆంధ్రప్రదేశ్‌ను దుబాయ్ తరహాలో అభివృద్ధి చేయాలి." అని సీఎంకు సూచించారు. సీఎం తన ప్రసంగం అనంతరం వేదిక నుంచి దిగి వెళ్తూ వీల్ చైర్‌లో ఉన్న ఫాతీమా వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. సౌదీ అరేబియా నుంచి వచ్చి తనను కలిసిన గడ్డం శిల్ప, చెన్నుపాటి అక్షితలతో సీఎం మాట్లాడుతూ.. గతంలో వారు తనను విజయవాడలో కలిసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సౌదీ అరేబియా, కువైత్, బహ్రెయిన్, ఖతర్, ఒమన్ దేశాల నుంచి కూడా తరలివచ్చారు. కాగా, సీఎం ప్రసంగం వినేందుకు భారీ సంఖ్యలో ప్రవాసులు తరలి వచ్చారని భారత కాన్సల్ జనరల్ సతీశ్ కుమార్ శివన్ తెలిపారు.



92 ఏళ్ల వయసున్న ఫాతీమాతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

పెట్టుబడుల ఆకర్షణలో బాబు సామర్థ్యం మరోసారి రుజువైంది!

- గూగుల్ డేటా హబ్ పై నీతి ఆయోగ్ మాజీ సీఈవో

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక గూగుల్ సంస్థ విశాఖపట్నంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా హబ్‌ను ఏర్పాటు చేస్తుండడంపై నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ హర్షం వ్యక్తం చేశారు. విశాఖలో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా హబ్‌ను ఏర్పాటు చేసేలా గూగుల్‌ను ఒప్పించడం ద్వారా పెట్టుబడుల ఆకర్షణలో తన ప్రతిభా సామర్థ్యాలను సీఎం చంద్రబాబు మరోసారి చాటుకున్నారని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. గూగుల్ రాక తన ఒక్కడి ప్రతిభే కాదని రాష్ట్ర ప్రజలందరిదీ అని పేర్కొన్నారు. అంతులేని అవకాశాలను అందిపుచ్చుకోవడంలో గూగుల్ రావడం తొలి అడుగు మాత్రమేనని, మరిన్ని ఉత్తేజభరిత సమయాలు ముందున్నాయని పేర్కొన్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.